www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సోమవారం | 10-2-2025 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 296 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి రా. 6.58 తదుపరి చతుర్దశి; నక్షత్రం: పునర్వసు సా. 6.01 తదుపరి పుష్యమి; వర్జ్యం: శేషం ఉ. 7.33, రా. 2.12-3.50, దుర్ముహూర్తం: మ. 12.52-1.37, మ. 3.08-3.54; అమృతఘడియలు: మ. 3.36-5.12; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.47; సూర్యాస్తమయం: 6.11 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మణిపూర్ సీఎం బీరెన్‌సింగ్ రాజీనామా

- రాష్ట్రంలో రెండేళ్లుగా జాతుల మధ్య సంఘర్షణ
- హింసను బీరెన్ స్వయంగా ప్రేరేపించారంటూ తాజాగా ఓ ఆడియో విడుదల.. సుప్రీం విచారణ
- సర్కారుపై అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైన కాంగ్రెస్
- అసెంబ్లీ స్పీకర్‌తోనూ బీరెన్‌కు పొసగని వైనం
- బీజేపీలో 12 మంది ఎమ్మెల్యేల వ్యతిరేకత

2


ఆదివారం ఇంఫాల్‌లో గవర్నర్ ఏకే భల్లాకు రాజీనామా సమర్పిస్తున్న మణిపూర్ సీఎం బీరెన్‌సింగ్

అడవిలో నెత్తుటేరు!

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. 31 మంది నక్సల్స్ మృతి.. వారిలో 11 మంది మహిళలు

- మృతుల్లో పలువురు అగ్ర నేతలు ఉన్నట్లు సందేహాలు
- తెలుగువారు భాస్కర్, ప్రకాశ్ కూడా ఉన్నట్లు ప్రచారం
- ఇద్దరు జవాన్ల మృతి.. మరో ఇద్దరు జవాన్లకు గాయాలు
- ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ అడవుల్లో కాల్పులు
- ఇంద్రావతి జాతీయ పార్క్‌లో 3 రాష్ట్రాల నక్సల్స్ సమావేశం
- చుట్టుముట్టిన 650 మంది జవాన్లు.. గంటలపాటు కాల్పులు
- నక్సల్స్‌కు భారీ నష్టం.. 2 నెలల్లో 81 మంది హతం




పాలిథిన్ కవర్లలో నక్సల్స్ మృతదేహాలు; ఎన్‌కౌంటర్ సందర్భంగా జవాన్లు స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

చర్ల/చింతూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ అడవుల్లో మరోమారు తుపాకీ గర్జించింది. పోలీసులు-మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో బీజాపూర్‌లోని ఇంద్రావతి నేషనల్ పార్క్ అటవీ ప్రాంతం నెత్తురోడింది. ఆదివారం ఉదయం నుంచి ప్రారంభమైన ఎన్‌కౌంటర్‌లో గ్రెనేడ్ లాంచర్లతో మావోయిస్టుల దాడులు.. అధునాతన ఆయుధాలతో జవాన్ల ఎదురుకాల్పులతో అటవీ ప్రాంతం దద్దరిల్లిపోయింది. ఆదివారం రాత్రి కడపటి వార్తలందేసరికి.. 31 మంది మావోయిస్టుల మృతదేహాలు.. పెద్ద సంఖ్యలో ఏకే-47, ఇతర తుపాకులు లభ్యమయ్యాయి. 15 మృతదేహాల వద్ద ఏకే-47, ఆటోమేటెడ్ గన్స్ లభించడంతో.. వారంతా తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన డివిజనల్, స్టేట్, సెంట్రల్ కమిటీకి చెందిన నేతలు/సభ్యులు అయ్యి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతులను ఇంకా గుర్తించాల్సి ఉందని చెప్పారు. మావోయిస్టుల కాల్పుల్లో ఇద్దరు జవాన్లు మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బస్తర్ ఐజీ సుందర్‌దాస్ కథనం ప్రకారం.. నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మూడు రాష్ట్రాల మావోయిస్టులు సమావేశమైనట్లు ఉప్పందుకున్న డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా బలగాలు.. ఆదివారం తెల్లవారుజాము నుంచి కూంబింగ్ ప్రారంభించాయి. 650 మంది కూంబింగ్‌లో పాల్గొనగా.. ఉదయం 8 గంటలకు మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో.. రెండు వైపులా కాల్పులు మొదలయ్యాయి. ఆదివారం మధ్యాహ్నానికి 12 మంది నక్సల్స్ మృతిచెందగా.. సాయంత్రానికి ఆ సంఖ్య 31కి చేరింది. వారిలో 11 మంది మహిళలు. కాగా, మృతుల సంఖ్య పెరిగే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టుల కాల్పుల్లో నలుగురు జవాన్లు-డీఆర్జీ హెడ్‌కానిస్టేబుల్ నరేశ్‌ధ్రువ, ఎస్టీఎఫ్ కానిస్టేబుళ్లు వసిత్ రౌతే, గులాబ్ మాండవి, డీఆర్జీ కానిస్టేబుల్ జగ్గు కల్ము తీవ్రంగా గాయపడ్డారు. వారిని హెలికాప్టర్‌లో

మిగతా 2వ పేజీలో...

2026 మార్చి 31నాటికి నక్సలిజాన్ని తుడిచిపెడతాం

- ఇకపై నక్సల్స్ దాడిలో.. ఏ ఒక్క పౌరుడి ప్రాణాలూ పోకూడదు
- ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు జవాన్ల మృతి బాధాకరం
- హోం మంత్రి అమిత్ షా


విపిన్ జైన్


పోమిల్ జైన్


నిందితులను జడ్జి ఇంటిలోకి తీసుకెళుతున్న పోలీసులు


రాజశేఖరన్


అపూర్వ చావ్డా

లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి నిందితుల

అరెస్టు



సిట్ అదుపులో 'బోలేబాబా' డైరెక్టర్లు

వైష్ణవి డెయిరీ సీఈవో, ఏఆర్ డెయిరీ ఎండీ కూడా

- నలుగురికీ తిరుపతి రుయా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు
- రిమాండ్ విధింపు.. తిరుపతి సబ్‌జైలుకు తరలింపు
- సిట్ అదుపులో 2 డెయిరీలకు చెందిన మరో 10 మందికిపైగా సిబ్బంది.. రేపో మాపో అరెస్టు?
- ఆయా ప్రాంతాల్లో బృందాల సోదాలు
- అనధికార అగ్రిమెంట్లు, రాజకీయ కోణంపై ఆరా

అమరావతి/తిరుపతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరుడి లడ్డూ ప్రసాదానికి కల్తీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారంలో నలుగురు కీలక నిందితులను ప్రత్యేక దర్యాప్తు బృందం అరెస్టు చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో సీబీఐ నేతృత్వంలో ఏర్పాటు చేసిన సిట్.. ఉత్తరాఖండ్‌లోని రూర్కీలో ఉన్న బోలేబాబా ఆర్గానిక్ డెయిరీ

మిగతా 2వ పేజీలో...


అనంతపురంలో ధార్ గ్యాంగ్ నుంచి స్వాధీనం చేసుకున్న నగలు, నగదు

దొంగలు బాబోయ్.. దొంగలు!

- రాష్ట్రంలో ఉత్తరాది ముఠాల హల్‌చల్
- పక్కాగా రెక్కీ నిర్వహించి వరుస దొంగతనాలు
- దొంగ సొత్తును పంచుకొని సొంతూళ్లకు పరార్
- ఏలూరు, పల్నాడు, అనంత, తిరుపతిలో భారీ చోరీలు
- యూపీ, రాజస్థాన్ వెళ్లి ఏలూరు పోలీసుల సోదాలు
- అక్కడ అష్టకష్టాలు పడి నలుగురు నిందితుల అరెస్టు
- మధ్యప్రదేశ్ గ్రామాల్లో జల్లెడ పట్టిన అనంత పోలీసులు
- ధార్ ముఠాలో ముగ్గురు కీలక సభ్యులు అదుపులోకి
- దొంగల వేటలో పల్నాడు, తిరుపతి పోలీసులు బిజీబిజీ

12

ధార్ గ్యాంగ్ అరెస్టు

- పోలీసుల అదుపులో ముగ్గురు
- పరారీలో మరో ఇద్దరు
- 59 తులాల ఆభరణాలు, రూ.19.35 లక్షల నగదు స్వాధీనం



పారని పథకాలు

సంక్షేమమే విజయానికి వీసా కాదు!

- ఎన్ని సంక్షేమ పథకాలు ఇచ్చినా.. ఓటమి నుంచి తప్పించుకోలేకపోయిన పలు రాజకీయ పార్టీలు
- ఏపీలో వైసీపీ, తెలంగాణలో బీఆర్ఎస్.. తాజాగా ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీదీ అదే దుస్థితి
- సంక్షేమానికి అభివృద్ధి తోడైతేనే మరో అవకాశం

2

జగన్ సహా ప్రజాప్రతినిధుల కేసుల్లో

రోజువారీ విచారణ!

- అమికస్ క్యూరీ హన్సారియా సిఫారసు
- అఫిడవిట్‌పై నేడు సుప్రీంకోర్టు విచారణ
- సుప్రీం చెప్పినా వాయిదాలేనని అఫిడవిట్‌లో అసంతృప్తి
- ఎంపీలు, ఎమ్మెల్యేలపై 4,732 క్రిమినల్ కేసులు పెండింగ్
- చాలా మంది నిందితులు కోర్టులకే రావడం లేదు
- వరుసగా రెండు సార్లు హాజరుకాకుంటే నాన్-బెయిలబుల్ వారెంట్లు జారీ చేయాలి
- మూడేళ్లకుపైగా పెండింగ్‌లో ఉన్న కేసుల ట్రయల్ పూర్తయ్యాకే ప్రత్యేక కోర్టులకు ఇతర కేసులు ఇవ్వాలి
- ఆ దిశగా ఆదేశాలివ్వాలని హన్సారియా వినతి
- జగన్‌తోపాటు పలువురు నేతల కేసుల విచారణ ఇక వేగవంతమయ్యే అవకాశం







న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలపై దాఖలైన కేసుల్లో పురోగతే లేదు.. వారి కేసులను ప్రత్యేక కోర్టులు ఉదారంగా వాయిదా వేసేస్తున్నాయి.. సాక్షులను నిర్దిష్ట తేదీల్లో న్యాయస్థానాల్లో హాజరుపరచడంలో దర్యాప్తు సంస్థలు విఫలమవుతున్నాయి.. దర్యాప్తు, ట్రయల్ విషయాల్లో ప్రజాప్రతినిధుల ప్రభావం అధికంగా ఉన్నట్లు కనిపిస్తోంది' అని సీనియర్ న్యాయవాది, అమికస్ క్యూరీ విజయ్ హన్సారియా సుప్రీంకోర్టుకు నివేదించారు. కేసుల సత్వర విచారణకు సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చినా పదే పదే వాయిదాలు పడుతున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో కేసుల సత్వర పరిష్కారానికి తాజాగా మార్గదర్శకాలివ్వాలని ఆయన అభ్యర్థించారు. పలువురు ప్రజాప్రతినిధులు కోర్టుల్లో విచారణకు రావడమే లేదని.. వరుసగా రెండుసార్లు

మిగతా 11వ పేజీలో...


పర్వేశ్ వర్మ

2

మోదీ అమెరికా నుంచి వచ్చాకే ఢిల్లీలో కొత్త ప్రభుత్వం!

- షాతో నడ్డా సమావేశం, సీఎం అభ్యర్థిపై చర్చ
- రేసులో ముందున్న పర్వేశ్ వర్మ
- ముఖ్యమంత్రి పదవికి అతిశీ రాజీనామా
- ఆప్ ఎమ్మెల్యేలతో అరవింద్ కేజ్రీవాల్ భేటీ

బడులను ముంచిన జగన్ మామ

ఐదేళ్ల పాలనలో సర్కారీ స్కూళ్లు నిర్వీర్యం!

- ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటుకు వెళ్లిపోయిన 5 లక్షల మంది విద్యార్థులు
- సాధ్యంకాని సంస్కరణలతో అస్తవ్యస్తం.. ప్రైవేటుకు మేలు చేసేలా తరగతుల విలీనం
- ఊరి బడిని దూరం చేసి లేనిపోని గొప్పలు.. బలవంతంగా ఇంగ్లిష్ మీడియం రుద్దుడు
- టోఫెల్, ఐబీ అంటూ విద్యార్థులపై ప్రయోగాలు.. ఇప్పటికీ గత ప్రభుత్వ చర్యల ప్రభావం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సాధారణంగా ఏ ప్రభుత్వమైనా పేదలు చదువుకునే సర్కారీ పాఠశాలలను అభివృద్ధి చేయాలని ప్రయత్నిస్తుంది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా బడులకు మెరుగులు దిద్దేలా పథకాలు అమలు చేస్తుంది. కానీ పిల్లలకు మేనమామనంటూ చెప్పుకొన్న జగన్ ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించింది. ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేస్తామని ప్రగల్భాలు పలికిన జగన్ సర్కారు.. బడుల రూపురేఖల సంగతి అటుంచితే గత ఐదేళ్లలో లక్షల మంది విద్యార్థులను ప్రభుత్వ బడులకు దూరం చేసింది. అప్పటి వరకు ప్రైవేటు బడులకు పిల్లల్ని పంపాలనే ఆలోచన తల్లిదండ్రులకు లేకపోయినా, బలవంతంగా ప్రైవేటు బాట పట్టేలా వారి ఆలోచనను మార్చేసింది. ప్రభుత్వ బడుల్లో చదివితే కష్టం అనే పరిస్థితి తీసుకొచ్చింది. విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లకు క్యూ కట్టేలా చేసింది. చివరికి ప్రైవేటు పాఠశాలలకు

మిగతా 10వ పేజీలో...





తలకు మించిన 'కాలేజీల' భారం!

- వైద్య కళాశాలల కోసం కూడా జగన్ సర్కారు అప్పులే అప్పులు
- అయినా ముందుకు సాగని నిర్మాణాలు
- కాంట్రాక్టు సంస్థలకు 674 కోట్ల బాకీ
- వాటిని ఇప్పుడు కడుతున్న కూటమి
- విడతల వారీగా నిధులు విడుదల
- తాజాగా రూ.285 కోట్లకు ఉత్తర్వులు
- మరోవైపు ఫేజ్-2 కాలేజీల సమస్య
- పెండింగులో 20 శాతం నిర్మాణాలు
- వీజీఎఫ్‌పై ప్రైవేటు మొగ్గు అంతంతే

12

దేశంలోనే తొలి కృత్రిమ మేధ

రోబోటిక్ గిడ్డంగి!

- బందరు పోర్టు సమీపంలో రూ.25 కోట్లతో నిర్మాణం
- హమాలీలతో పనిలేదు.. తూకంలో తేడాలకూ చెక్
- మానవ రహితంగా రోబోటిక్ సేవల వినియోగం
- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ప్రతిపాదన



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మానవ రహిత, ఆధునిక సాంకేతిక, అధునాతన సౌకర్యాలతో 10వేల టన్నుల సామర్థ్యం గల ఆటోమేటిక్ ఇంటిగ్రేటెడ్ గిడ్డంగి రాష్ట్రంలో ఏర్పాటు కానుంది. దేశంలో ఎక్కడా లేని విధంగా పూర్తిగా కృత్రిమ మేధతో ఈ రోబోటిక్ గ్రెయిన్ స్టోరేజ్ గిడ్డంగిని మచిలీపట్నం పోర్టు సమీపంలో నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది. అన్నపూర్ణ-ఏపీ పేరుతో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ

మిగతా 12వ పేజీలో...



నిందితుల పుట్టుమచ్చలు తదితరాలను నమోదు చేస్తున్న పోలీసులు

లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి నిందితుల అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

డైరెక్టర్లు విపిన్ జైన్(45), పోమిల్ జైన్(47).. తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం పెనుమాకలోని వైష్ణవి డెయిరీ స్పెషాలిటీస్ లిమిటెడ్ సీఈవో అపూర్వ వినయ్‌కాంత్ చావ్డా (47), తమిళనాడులోని దిండిగల్‌లో ఉన్న ఏఆర్ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ రాజు రాజశేఖరన్(69)ను అరెస్టు చేసింది. కల్తీ జరిగిన కాలంలో విపిన్ జైన్, పోమిల్ జైన్ వైష్ణవి డెయిరీ డైరెక్టర్లుగా ఉన్నట్లు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. నలుగురినీ ఆదివారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకుని తిరుపతి అలిపిరిలోని భూదేవి కాంప్లెక్సులో వున్న సిట్ కార్యాలయానికి తరలించారు. రాత్రి 8.20 గంటల సమయంలో రిమాండ్ రిపోర్టు సిద్ధం చేసి వైద్య పరీక్షల నిమిత్తం నలుగురినీ భారీ భద్రత నడుమ రుయా ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం రాత్రి 9.10 గంటలకు 2వ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ప్రవీణ్ కుమార్ నివాసానికి తీసుకెళ్లారు. కేసు విచారణాధికారిగా ఉన్న జిల్లా అదనపు ఎస్పీ వెంకట్రావు, ఏపీపీలు వారిని ఆయన ఎదుట ప్రవేశపెట్టారు. రిమాండ్ రిపోర్టును పరిశీలించిన న్యాయాధికారి.. నలుగురికీ జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. అనంతరం వారిని తిరుపతి సబ్ జైలుకు తరలించారు.

ఇదీ జరిగింది..

వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదంలో కలిపే నెయ్యిలో అపవిత్ర పదార్థాలు కలిసినట్లు రిపోర్టుల్లో బట్టబయలు కావడం.. టీటీడీ మార్కెటింగ్ జనరల్ మేనేజర్ మురళీకృష్ణ గత ఏడాది సెప్టెంబరు 25న చేసిన ఫిర్యాదుతో తిరుపతి ఈస్ట్ పోలీసు స్టేషన్లో ఎఫ్ఐఆర్ (470/2024) నమోదు చేయడం.. అనంతరం కూటమి ప్రభుత్వం గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో విచారణకు ఆదేశించడం.. కలియుగ దైవంగా భాసిల్లే శ్రీవేంకటేశ్వరుడి లడ్డూ ప్రసాదంలో ఉపయోగించే నెయ్యిలో కల్తీ జరిగిందన్న వార్తలు దేశవిదేశాల్లో ఆందోళనకు దారి తీయడం.. ఈ అంశం వివాదాస్పదమవడంతో సుప్రీంకోర్టు గత అక్టోబరు 4న సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో ఐదుగురు సభ్యులతో సిట్‌ను ఏర్పాటు చేయడం తెలిసిందే. ఇందులో ఇద్దరు సీబీఐ అధికారులు.. హైదరాబాద్ జోన్ జాయింట్ డైరెక్టర్ సురేశ్ ప్రభు, విశాఖపట్నం సీబీఐ ఎస్పీ మురళి, ఏపీ పోలీసు శాఖ నుంచి ఐజీ త్రిపాఠి, డీఐజీ గోపీనాథ్ జెట్టి, భారత ఆహార భద్రత-ప్రమాణాల అథారిటీ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నుంచి డాక్టర్ సత్యేన్‌కుమార్ పాండా సభ్యులు. నవంబరు 24న సిట్ దిగువ స్థాయి అధికారులు తిరుపతిలో దర్యాప్తు ప్రారంభించారు. డిసెంబరు 13న సిట్ కీలక సభ్యులు రావడంతో విచారణ వేగం పుంజుకుంది. ఇన్ని రోజులూ దర్యాప్తులో భాగంగా సేకరించిన రికార్డులు, సీసీ ఫుటేజీలు, ట్యాంకర్ల లాగ్ బుక్కులు, ట్రిప్ షీట్లు, ట్యాంకర్ల డ్రైవర్లు ఇచ్చిన సమాచారం, డెయిరీల సిబ్బంది నుంచి సేకరించిన వివరాలను సిట్ బృందం లోతుగా విశ్లేషించింది. టీటీడీకి నెయ్యి సరఫరా చేసే కాంట్రాక్టు పొందిన ఏఆర్ డెయిరీ తను నేరుగా నెయ్యి సరఫరా చేయకుండా వైష్ణవి డెయిరీ ద్వారా నెయ్యి సరఫరా చేసినట్లు సిట్ బృందం నిర్ధారించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేసు దర్యాప్తు అధికారి వెంకట్రావు తన సిబ్బందితో కలసి గత నాలుగు రోజులుగా ఏఆర్, వైష్ణవి డెయిరీలకు వెళ్లి యాజమాన్యాలను ప్రశ్నించారు. ఆదివారం మధ్యాహ్నం వారిని అదుపులోకి తీసుకుని తిరుపతికి తరలించారు. కాగా.. ఆయా డెయిరీలకు చెందిన మరో పది మంది సిబ్బంది ప్రస్తుతం సిట్ అదుపులో ఉన్నారు. వారిలో మేనేజర్ స్థాయి అధికారుల నుంచి.. ల్యాబ్ సిబ్బంది, ట్యాంకర్ల డ్రైవర్లు కూడా ఉన్నట్లు తెలిసింది. వారిని సోమ లేదా మంగళవారం అరెస్టు చూపించే అవకాశం ఉంది. ఇంకోవైపు.. ఏఆర్, బోలేబాబా, వైష్ణవి డెయిరీల కార్యాలయాలతోపాటు సంబంధిత వ్యక్తుల ఇళ్లలో సిట్ బృందాలు సోదాలు సాగిస్తున్నాయి. ఈ వ్యవహారంలో ఇంకా ఎవరున్నారు.. తక్కువ ధరకు నెయ్యి సరఫరాకు అంగీకరించడం వెనుక మతలబేంటి.. కల్తీ చేసేందుకు టీటీడీ అధికారులెవరైనా సహకరించారా.. ఏ ధైర్యంతో ఇలా చేశారు.. ఎవరు అనుమతించారు.. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన ఆధారాల సేకరణలో సిట్ ప్రస్తుతం నిమగ్నమైంది. రాజకీయపరమైన వ్యవహారాలు, అనధికారిక అగ్రిమెంట్లు ఏమైనా ఉన్నాయా అనే కోణంలోనూ కూపీ లాగుతోంది. ఆయా డెయిరీలకు అవకాశమిచ్చిన లేదా తెర వెనుక ఉండి కథ నడిపించిన కీలక వ్యక్తి ఎవరన్నది తేలాల్సి ఉందని అంటున్నారు.

ఇంతకూ ఏ-1 ఎవరు?

ఈ కేసులో మొదటి నిందితుడు ఎవరన్నది అంతుబట్టడం లేదు. రిమాండ్ రిపోర్టులో రాజు రాజశేఖరన్‌ను ఏ-2గా, పోమిల్‌జైన్‌ను ఏ-3గా, విపిన్ జైన్‌ను ఏ-4గా, అపూర్వ చావ్డాను ఏ-5గా పేర్కొన్నా.. ప్రథమ నిందితుడి పేరును ప్రస్తావించలేదు. టీటీడీలో గతంలో పనిచేసిన కీలక అధికారుల్లో ఒకరు గానీ లేదా టీటీడీ బోర్డులో పనిచేసిన కీలక వ్యక్తి గానీ కావచ్చని తెలుస్తోంది.

చీకటి పడ్డాకా మహిళను అరెస్టు చేయవచ్చు

» కారణాలు సహేతుకంగా ఉండాలి: మద్రాస్ హైకోర్టు

చెన్నై, ఫిబ్రవరి 9: చీకటి పడిన తరువాత కూడా మహిళలను అరెస్టు చేయవచ్చని, అయితే ఇందుకుగల హేతుబద్ధతను దర్యాప్తు అధికారి నిరూపించుకోవాల్సి ఉంటుందని మద్రాసు హైకోర్టు స్పష్టం చేసింది. సూర్యాస్తమయం తరువాత, సూర్యోదయానికి ముందు మహిళలను అరెస్టు చేయకూడదన్నది కేవలం మార్గదర్శనం చేసే సూచనలాంటిదని, చట్టబద్ధమైన నిబంధనేమీ కాదని తెలిపింది. దీన్ని ఉల్లంఘించినంత మాత్రాన అరెస్టు చట్టవిరుద్ధం కాబోదని ద్విసభ్య ధర్మాసనం తెలిపింది. రాత్రివేళ నిందితురాలిని అరెస్టు చేసిన మహిళా ఇన్‌స్పెక్టర్, మహిళా హెడ్‌కానిస్టేబుల్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలన్న ఏకసభ్య ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలను కొట్టివేసింది. దీనిపై కోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చిన మహిళా ఎస్ఐపై చర్యలు తీసుకోవాలన్న ఆదేశాలను మాత్రం సమర్థించింది.

పారని పథకాలు

» సంక్షేమమే విజయానికి వీసా కాదు!

» ఎన్ని సంక్షేమ పథకాలు తెచ్చినా.. ఓటమి తప్పించుకోలేని పార్టీలు

» ఏపీలో వైసీపీ.. తెలంగాణలో బీఆర్ఎస్.. తాజాగా ఢిల్లీలో ఆప్

» సంక్షేమానికి అభివృద్ధి తోడైతేనే ప్రజాదరణ

ఒక్కసారి అధికారంలోకి వస్తే ముప్పై ఏళ్లు సీఎంగా కొనసాగుతానంటూ ప్రగల్భాలు పలికిన మాజీ సీఎం జగన్.. సంక్షేమ పథకాల రూపంలో జనానికి రూ.లక్షల కోట్లు పంచినా ఎందుకు ఓడిపోయానో అర్థం కాలేదని ఐదేళ్ల తిరక్కుండానే వాపోవాల్సిన పరిస్థితి! కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ నుంచి.. రైతు బంధు, దళిత బంధు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల దాకా.. ఎన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినా అవేవీ కేసీఆర్‌ను ఓటమి కోరల నుంచి కాపాడలేకపోయాయి!! కేవలం సంక్షేమ పథకాలే ఓట్లు రాల్చవనే చేదు నిజం.. తాజాగా ఢిల్లీ ఎన్నికల ఫలితాల రూపంలో మరోసారి రుజువైంది. మహిళలకు ఉచిత ప్రయాణం, ఉచిత విద్యుత్తు, ఉచిత తాగు నీరు, మొహల్లా క్లినిక్‌ల వంటివేవీ కేజ్రీవాల్ ఓటమిని ఆపలేకపోయాయి. నిజానికి, ఓట్ల కోసమో ఓటుబ్యాంకు కోసమో ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలను చాలామంది ప్రతికూల ధోరణితో చూస్తారుగానీ.. బడిపిల్లలకు మధ్యాహ్న భోజనం, బడికెళ్లే ఆడపిల్లలకు సైకిళ్ల పంపిణీ వంటి పథకాలు బడుగు, బలహీనవర్గాల్లో అక్షరాస్యత పెంచడానికి ఎంతగానో దోహదపడతాయనడంలో సందేహం లేదు. అలాగని సంక్షేమం పేరుతో అడ్డగోలుగా ప్రజల ఖాతాల్లోకి రూ.లక్షల కోట్లు వేసేసినంతమాత్రాన.. ఎన్నికల్లో గెలవడానికి వీసా దొరికేసినట్టు కాదు! వాటికి ఒక పరిమితి.. అభివృద్ధికి, సంక్షేమానికి మధ్య సమతౌల్యం లేకపోవడమే అసలు సమస్య. ఈ విషయాన్ని అర్థం చేసుకోలేకపోవడం వల్లనే రాజకీయ పార్టీలు ఒకదాన్ని మించి మరొకటి విచక్షణ రహితంగా హామీలు ఇచ్చుకుంటూ పోతున్నాయి. ఆ పథకాల అమలుకు దొడ్డిదోవన కార్పొరేషన్ల పేరుతో రూ.లక్షల కోట్లు అప్పులు తెస్తున్నాయి. బడ్జెట్ అప్పులను మాత్రమే లెక్కల్లో చూపుతూ.. బడ్జెటేతర అప్పుల్ని దాచేసి మాయ చేసే ప్రయత్నం చేస్తున్నాయి. అభివృద్ధి మృగ్యమై అప్పులు మాత్రమే మిగలడంతో.. అసలు, వడ్డీలు కట్టే దారి తెలియక, ప్రభుత్వ భూములు, ఆస్తులను తాకట్టు పెట్టే/తెగనమ్మే దుస్థితికి దిగజారుతున్నాయి. జగన్ సర్కారు ప్రభుత్వ భవనాలను తాకట్టు పెట్టిన సంగతి తెలిసిందే. వైసీపీ హయాంలో రోడ్ల దుస్థితి గురించి చెప్పుకోనే అక్కర్లేదు. తెలంగాణలోనూ అదే పరిస్థితి. కేసీఆర్ సర్కారు భూముల విక్రయం చేపట్టడం, ఓఆర్ఆర్‌ను 30 ఏళ్లపాటు ఒక ప్రైవేటు సంస్థకు కేవలం రూ.7వేల కోట్లకు లీజుకు కట్టబెట్టడం తెలిసిందే. ఢిల్లీలో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. అక్కడ ఆమ్ ఆద్మీ పార్టీ అమలు చేసిన పలు పథకాలను కొనసాగించడంతోపాటు వాటికి అదనంగా మరిన్ని పథకాలు అమలుచేస్తామన్న బీజేపీ.. తన హామీలను ఎలా నిలబెట్టుకుంటుందో చూడాల్సి ఉంది!

ఆశ.. కోపం.. సానుభూతి..

సంక్షేమ పథకాలే తమను మళ్లీ మళ్లీ అధికారపీఠంపై కూర్చోబెడతాయని చాలామంది రాజకీయ నాయకులు విశ్వసిస్తారుగానీ.. కేవలం సంక్షేమం.. కేవలం అభివృద్ధి.. ఇలా ఏదో ఒకదానికి మాత్రమే కట్టుబడే ప్రభుత్వాన్నీ ప్రజలు సహించలేరు. ఉద్యోగ, ఉపాధి కల్పన, మౌలిక సదుపాయాల కల్పన, రోడ్ల నిర్మాణం వంటివి ఏమేరకు జరిగాయన్నది కూడా గమనిస్తారు. సంక్షేమానికి అభివృద్ధి తోడైన సందర్భాల్లో మాత్రమే అధికారంలో ఉన్న పార్టీకి మరో అవకాశాన్ని ఇస్తారని, ఎన్నికల్లో గెలుపోటములకు ఇంకా చాలా కారణాలు దోహదం చేస్తాయని చాలా సందర్భాల్లో వెల్లడైంది.

ఉచితంగా ఎంత డబ్బు ఇచ్చినా కూడా.. మనసులో మాట బయటకు చెప్పుకొనే స్వేచ్ఛ లేని వాతావరణాన్ని, భావవ్యక్తీకరణ స్వేచ్ఛలేని ఉక్కబోత పరిస్థితిని, నాయకుల అహంభావాన్ని ప్రజలు ఎక్కువకాలం సహించలేరు. 2019లో జగన్ గెలుపునకు ఆశ, సానుభూతి అనే బలమైన భావోద్వేగాలు ఎలా పనిచేశాయో.. 2024లో జగన్ సర్కారు అవినీతి, అక్రమాలు, భూకబ్జాల వంటివాటిపై ప్రజల్లో కోపం, భావవ్యక్తీకరణ స్వేచ్ఛ లేని నిర్బంధ వాతావరణంపై ఆగ్రహం అంతకన్నా ఎక్కువగా బలంగా పనిచేయడం వల్లే ఆ పార్టీ అంత ఘోరంగా ఓటమి పాలైంది! 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమికి కూడా ఆ పార్టీ నాయకుల అహంకారపూరిత వైఖరి ఎంతో కొంత కారణమైందన్నది రాజకీయ నిపుణుల విశ్లేషణ. తాజాగా ఢిల్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు, ఆప్ ఓటమికి కూడా ఈ భావోద్వేగాలే ప్రధాన కారణాలుగా నిలిచాయి. పదేళ్ల పాలన నేపథ్యంలో ప్రజల్లో పెరిగిన ప్రభుత్వ వ్యతిరేకత, పెరిగిన నిరుద్యోగ రేటు, అభివృద్ధి లేమి వంటివి కూడా తోడవడం.. ఆయనతోపాటు ఆమ్ ఆద్మీ పార్టీ ఓటమికి ప్రధాన కారణాలయ్యాయి.

- సెంట్రల్ డెస్క్

హామీల అమలు బీజేపీకి సవాలే!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ఢిల్లీలో బీజేపీ చరిత్రాత్మక విజయం సాధించింది. అయితే ఢిల్లీ ఆర్థిక వ్యవస్థ లోటులోకి జారుకొనే అవకాశం ఉందనే అంచనాల నేపథ్యంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు ఆ పార్టీకి సవాలుగా కనిపిస్తోంది. పేద మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులకు నెలకు రూ.2,500 పింఛను(70 ఏళ్ల దాటిన వృద్ధులకు రూ.3,000), గర్భిణులకు రూ.21 వేలు, పేద విద్యార్థులకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య వంటి హామీలను బీజేపీ ప్రకటించింది. అన్ని రంగాల్లో మార్పు తీసుకొస్తామని చెప్పింది. అయితే హామీల ఆర్థిక భారం ప్రస్తుతం ఢిల్లీ ఆర్థిక పరిస్థితిలో స్పష్టంగా కనిపిస్తోంది. 2024-25 సంవత్సరానికి అంచనా వేసిన పన్ను ఆదాయం రూ.58,750 కోట్లు ఉండగా.. మొత్తం బడ్జెట్ రూ.76 వేల కోట్లుగా ఉంది. అయితే, ప్రస్తుతం అర్హులకు అందుతున్న లబ్ధిని కొనసాగించడంతో పాటు ఎన్నికల హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వానికి అదనంగా ఏడాదికి రూ.25 వేల కోట్లు వరకు అవసరం అవుతుందని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో హామీలు అమలు బీజేపీ పెద్ద సవాలు అని చెప్పవచ్చు. పేద మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వాలంటే ఏడాదికి రూ.11 వేల కోట్లు ఖర్చు అవుతుందని ఒక అంచనా. ఇక ఢిల్లీలోని 24.4 లక్షల మంది వృద్ధులకు పింఛన్లు ఇవ్వాలంటే ఏడాదికి అదనంగా మరో రూ.4,100 కోట్లు అవసరం. అదేవిధంగా యమునా నది ప్రక్షాళనకే గత కొన్నేళ్లుగా దాదాపు రూ.8 వేల కోట్ల ఖర్చవుతోంది. ఇక ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేయడానికి రూ.10,200 కోట్లు కావాలని అంచనా. అయితే కేంద్రం సాయం చేసేందుకు సిద్ధంగా ఉందని, నిధులు సమకూర్చుకుంటామని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర పేర్కొన్నారు.

లోకం తీరు



బీజేపీ 'కరువు' తీరింది!

ఢిల్లీలో దశాబ్దాలుగా గెలవని 12 స్థానాల్లో ఈసారి నాలుగింట విజయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు మూడు దశాబ్దాల తర్వాత బీజేపీ విజయం అందుకుంది. అయితే ఇదే సమయంలో 1993 నుంచి గెలుపు అందని ద్రాక్షగా ఉన్న 9 నియోజకవర్గాలు, 2008 నుంచి విజయం దక్కని మూడు స్థానాలకుగానూ ఈసారి నాలుగింటిలో విజయకేతనం ఎగరవేసింది. ఈ పన్నెండు స్థానాల్లో 2008లో నియోజకవర్గాల పునర్విభజన తర్వాత న్యూఢిల్లీ, వికాస్‌పురి, కొండ్లి ఏర్పాటు కాగా, మిగతా తొమ్మిది స్థానాలు మటియా మహల్, బల్లీమారాన్, అంబేద్కర్ నగర్, సీలంపూర్, ఓఖ్లా, సూల్తాన్‌పూర్ మర్జా, మంగోల్‌పురి, జంగ్‌పుర, దియోలి. వీటిల్లో జంగ్‌పుర, న్యూఢిల్లీ, మంగోల్‌పురి, వికాస్‌పురి నియోజకవర్గాల్లో బీజేపీ ఈసారి ఎట్టకేలకు తన జెండా పాతింది.

డ్యాన్స్‌తో అతిశీ గెలుపు సంబరాలు

» సిగ్గుచేటన్న స్వాతి మలివాల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: కల్కాజీ నియోజకవర్గంలో విజయం సాధించిన ఢిల్లీ మాజీ సీఎం అతిశీ పార్టీ కార్యకర్తలతో కలిసి డ్యాన్స్ చేస్తూ సంబరాలు చేసుకున్నారు. ఎన్నికల్లో సొంత పార్టీ ఘోర పరాజయం పాలైనన సమయంలో ఆమె తన గెలుపు పట్ల సంబరాలు చేసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆప్ సీనియర్ నాయకులంతా ఓడిపోతే అతిశీ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్ అన్నారు. అతిశీ డ్యాన్స్ చేయడం ఆమె విజయానికి సంబరాలు మాత్రమే కాదని, ఆప్ సీనియర్ నాయకుల ఓటమి పట్ల ఆమె అంతర్గత సంతృప్తికి సంకేతమని అనురాగ్ ఠాకూర్ పేర్కొన్నారు. అతిశీ.. బీజేపీ అభ్యర్థి రమేశ్ బిధూరిపై 3,521 ఓట్ల తేడాతో గెలుపొందారు.

మోదీ అమెరికా నుంచి వచ్చాకే ఢిల్లీలో కొత్త ప్రభుత్వం!



వీకే సక్సేనాకు రాజీనామా పత్రాన్ని సమర్పిస్తున్న అతిశి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి9: ఢిల్లీలో కొత్త ప్రభుత్వ ఏర్పాటు ఆలస్యం కానుంది. ప్రధాని మోదీ అమెరికా పర్యటన ముగించుకుని వచ్చాకే కొత్త ప్రభుత్వం కొలువు తీరనుంది. ఈ నెల 12, 13 తేదీల్లో ఆయన అమెరికాలో పర్యటించనున్నారు. 15వ తేదీన తిరిగిరానున్నారు. ఆ తర్వాతే నూతన ప్రభుత్వం ఏర్పడుతుందని బీజేపీ వర్గాలు చెప్పాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమావేశమయ్యారు. సీఎం అభ్యర్థిపై చర్చించినట్లు సమాచారం. రేసులో పర్వేశ్ వర్మ ముందున్నా పలువురి పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఎంపీ బాన్సురి స్వరాజ్, మాజీ మంత్రి స్మృతి ఇరానీ పేర్లు ప్రచారంలో ఉన్నాయి. మరోవైపు, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ ఘోర పరాజయంతో సీఎం పదవికి అతిశీ రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాకు అందజేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 22 మంది ఎమ్మెల్యేలతో ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ ఫిరోడ్ షా రోడ్డులోని తన నివాసంలో భేటీ అయ్యారు. ప్రజల కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు.



తేజస్‌లో ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్ చీఫ్‌లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: భారత సైన్యాధిపతి ఉపేంద్ర ద్వివేది, వైమానిక దళాధిపతి ఏపీ సింగ్ ఆదివారం తేజస్ ఎయిర్‌క్రాఫ్ట్‌లో ప్రయాణించారు. ఇద్దరూ కలిసి 45 నిమిషాల పాటు యుద్ధ విమానంలో గాల్లో విహరించారు. రెండు రక్షణ దళాల అధిపతులు యుద్ధవిమానంలో ఇలా కలిసి విహరించడం ఇదే తొలిసారి. బెంగళూరులోని యలహంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ఇందుకు వేదికైంది. తన జీవితంలో ఇదో అద్భుత ఘట్టమని ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. ఇదిలా ఉండగా, సోమవారం నుంచి యలహంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ఐదురోజుల పాటు ఏరో ఇండియా ప్రదర్శన జరగనుంది. ఇందులో భారత్‌తో పాటు అమెరికా అత్యాధునిక యుద్ధ విమానాలను ప్రదర్శించనున్నాయి.

కిరణ్ రాయల్‌పై జనసేన విచారణ

పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి జనసేన ఇన్‌చార్జి కిరణ్ రాయల్‌పై పార్టీపరంగా విచారణకు ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆదేశించారు. గత రెండ్రోజులుగా ఆయనకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. కొందరు మహిళలకు సంబంధించి కొన్ని వీడియోలు వైరల్ అయ్యాయి. వీటిపై జనసేన రాష్ట్ర కార్యాలయం ఆదివారం స్పందించింది. ఆయనపై వచ్చిన ఆరోపణలను క్షుణ్ణంగా విచారించాలని పార్టీ కాన్‌ఫ్లిక్ట్ కమిటీని ఆదేశించారు. ఈ నేపథ్యంలో పార్టీ ఆదేశాలు వెలువడేవరకూ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని కిరణ్ రాయల్‌కు స్పష్టం చేశారు. ప్రజలకు ఉపయోగపడే విషయాలపై జనసేన నాయకులు దృష్టిపెట్టాలని సూచించారు.

మణిపూర్ సీఎం రాజీనామా

అమిత్‌షా, నడ్డాతో భేటీ అనంతరం గవర్నర్‌కు రాజీనామా సమర్పించిన బీరెన్ సింగ్



ఇంఫాల్, ఫిబ్రవరి 9: మణిపూర్ సీఎం బీరెన్ సింగ్ అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేశారు. రాష్ట్రంలో జాతుల మధ్య ఘర్షణలను ఆయన ప్రేరేపించినట్లు లీకైన ఆడియోలోని గొంతుకు ఆయన గొంతుకు 93% సారూప్యత ఉందని ట్రూత్ ల్యాబ్స్ నివేదిక ఇచ్చింది. ఆడియో లీక్ అంశంపై కుకీ ఆర్గనైజేషన్ ఫర్ హ్యూమన్ రైట్స్ ట్రస్ట్ సుప్రీం కోర్టును ఆశ్రయించగా విచారణ జరుగుతోంది. మరోవైపు బీరెన్‌పై అసెంబ్లీలో అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్ సిద్ధమైంది. సొంత పార్టీలోనే ఆయనపై వ్యతిరేకత ఉంది. 12 మంది సొంత ఎమ్మెల్యేలే ఆయనకు వ్యతిరేకంగా ఉండడంతో పాటు మరో ఆరుగురు కూడా ఆయనపై అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. అలాగే ఆయనకు, స్పీకర్‌కు పడటం లేదు. ఈ పరిణామాల నేపథ్యంలో బీరెన్‌సింగ్.. బీజేపీ సీనియర్ నాయకులను కలిసిన తర్వాత ఆదివారం తన రాజీనామా లేఖను గవర్నర్‌కు సమర్పించారు. అయితే, తదుపరి ఏర్పాట్లు జరిగే దాకా సీఎంగా కొనసాగాలని బీరెన్‌సింగ్‌ను గవర్నర్ కోరారు.

రెండేళ్లుగా అల్లర్లు

మణిపూర్‌లో రెండేళ్లుగా మైతేయి కుకీల మధ్య హింస చెలరేగుతూనే ఉంది. అందులో వందలాది మంది మరణించగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. అయితే అల్లర్లలో మైతేయిలను బీరెన్ సింగ్ ప్రేరేపిస్తున్నట్లు డిసెంబరులో ఓ ఆడియో లీకయింది. అందులో.. "ప్రభుత్వ కార్యాలయ్యాల్లోని ఆయుధాలను లూటీ చేసేందుకు మైతేయిలకు అవకాశమివ్వండి" అని ఆయన ఆదేశించినట్లు ఉంది. ఆ ఆడియోలోని గొంతుకు బీరెన్ సింగ్ గొంతుకు 93% సారూప్యత ఉన్నట్లు హైదరాబాద్‌లోని ట్రూత్ ల్యాబ్స్ నివేదిక ఇచ్చింది. ఆ నివేదికను సుప్రీం కోర్టును సమర్పించి, బీరెన్‌పై తగు చర్యలు తీసుకోవాలని కుకీ సంస్థ తరఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోరారు. అయితే కేంద్రం, మణిపూర్ సర్కార్ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేసును మణిపూర్ హైకోర్టు విచారించాలని ఆయన పేర్కొనగా దీనిపై తదుపరి విచారణలో నిర్ణయం తీసుకుంటాని సుప్రీం తెలిపింది. ఈ ఆడియోపై కేంద్ర ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదిక అందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

ఇప్పటికే ఆలస్యమైంది: కాంగ్రెస్

బీరెన్ సింగ్ రాజీనామా ఇప్పటికే ఆలస్యమైందని కాంగ్రెస్ పేర్కొంది. బీరెన్ రాజీనామాపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ మాట్లాడుతూ.. తమ పార్టీ అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైందని, పరిస్థితి గ్రహించిన బీరెన్ వెంటనే రాజీనామా చేశారని అన్నారు. తరచూ ప్రయాణాలు చేసే మోదీ మణిపూర్ ఎప్పుడు వస్తారని ఎదురుచూస్తున్నామని ఆయన ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

రాజీనామాకు ముందు అమిత్‌తో భేటీ

రాజీనామా ముందు బీరెన్ సింగ్ కేంద్ర మంత్రి అమిత్ షాను కలిశారు. ఆదివారం ఉదయం ఢిల్లీకి వెళ్లి బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, షాలతో భేటీ అయ్యారు. సాయంత్రం ఇంఫాల్‌కు వచ్చి రాజ్ భవన్‌లో గవర్నర్ అజయ్ కుమార్ భళ్లాకు తన రాజీనామా లేఖ సమర్పించారు. బీరెన్ సింగ్ రాజీనామా నేపథ్యంలో సోమవారం ప్రారంభం కావాల్సిన అసెంబ్లీ సమావేశాలను గవర్నర్ అజయ్ కుమార్ భళ్లా రద్దు చేశారు.

అడవిలో నెత్తుటేర్లు!



నరేశ్ ధ్రువ్



వసిత్ రౌతే

(మొదటి పేజీ తరువాయి)

రాయ్‌పూర్ ఆస్పత్రికి తరలించగా.. నరేశ్‌ధ్రువ, వసిత్ రౌతే చికిత్స పొందుతూ మృతిచెందారు. మిగతా ఇద్దరు జవాన్లకు మెరుగైన చికిత్స అందిస్తున్నామని ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు.

ఒకేచోట.. 3 రాష్ట్రాల నక్సల్స్

గడిచిన ఏడాది కాలంగా వరుస ఎన్‌కౌంటర్లతో మావోయిస్టుల తరఫున భారీ నష్టం వాటిల్లింది. దీంతో.. ఉన్న క్యాడర్‌ను కాపాడుకుంటూ.. పునర్నిర్మాణంపై తెలంగాణ, మహారాష్ట్ర(గడ్చిరోలి కమిటీ), ఛత్తీస్‌గఢ్(నేషనల్ పార్క్ కమిటీ, మద్దేడు కమిటీ)కు చెందిన మావోయిస్టులు నేషనల్ పార్క్‌లో సమావేశమైనట్లు పోలీసులకు సమాచారం అందింది. ఛత్తీస్‌గఢ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల వేళ.. వీరు కీలక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. రాష్ట్రంలో పలు పంచాయతీలతో పాటు.. రాజధాని నగరం రాయ్‌పూర్ మునిసిపల్ ఎన్నికలు జరగనున్నాయి. దాంతో పోలీసులు శనివారం అర్ధరాత్రి నుంచి వ్యూహాత్మకంగా నక్సల్స్‌ను చుట్టుముట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. ఆదివారం తెల్లవారుజామున సుమారు 650 మంది జవాన్లతో నాలుగు వైపుల నుంచి కూంబింగ్ ప్రారంభించారు. ఉదయం 8 గంటల సమయంలో నక్సల్స్ తారసపడడంతో.. ఇరువైపులా హోరాహోరీ కాల్పులు జరిగాయి. కాగా.. ఈ ఎన్‌కౌంటర్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పెచ్చర్లకు చెందిన అడెల్లు అలియాస్ భాస్కర్, మందమర్రికి చెందిన ప్రకాశ్ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కాగా, గతేడాది నుంచి మావోయిస్టులకు కోలుకోలేని దెబ్బలు తగులుతున్నాయి. 2024లో 219 మంది నక్సల్స్ చనిపోగా.. వెయ్యి మంది వరకు లొంగిపోయారు. ఈ ఏడాది కూడా నేషనల్ పార్క్ ఎన్‌కౌంటర్‌తో కలిపి.. గడిచిన 40 రోజుల్లో మొత్తం 81 మంది నక్సలైట్లు మృతిచెందారు. గరియాబంద్‌లో 16, గంగలూరులో 8, పూజారి కాంకేర్‌లో 12 మంది నక్సల్స్ హతమయ్యారు.

2026కల్లా నక్సలిజం అంతం: షా

దేశంలో నక్సలిజాన్ని 2026 మార్చి 31 నాటికి పూర్తిగా నిర్మూలిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పునరుద్ఘాటించారు. బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు జవాన్లు ప్రాణాలు కోల్పోవడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది మార్చి తర్వాత.. దేశంలో నక్సలిజం వల్ల ఏ ఒక్క పౌరుడి ప్రాణాలు కూడా పోకూడదని ఆకాంక్షించారు.

23 నెలల్లో 92 లక్షల మంది!

అమెరికాలో అక్రమ ప్రవేశాలకు యత్నం

వీరిలో 2.7 లక్షల మంది భారతీయులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) పరిధిలోని యూఎస్ బోర్డర్ అండ్ కస్టమ్స్ పెట్రోల్ (యూఎస్‌బీపీ), యూఎస్ ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) గణాంకాల ప్రకారం 2022 డిసెంబరు నుంచి 2024 అక్టోబరు మధ్య 23 నెలల వ్యవధిలో 92 లక్షల మందికి పైగా అమెరికాలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించడానికి ప్రయత్నించారు. వీరిలో సరిహద్దుల్లో అరెస్టయినవారు, బహిష్కరణకు గురైనవారు, ప్రవేశానికి అనుమతి నిరాకరించిన వారు ఉన్నారు. 2021 నుంచి 2024 వరకూ మొత్తం 3,488 మంది భారతీయులను ఐసీపీ అరెస్టు చేసింది. మరోవైపు 2022 డిసెంబరు నుంచి 2024 అక్టోబరు మధ్య అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించడానికి ప్రయత్నించిన 2,69,884 మంది భారతీయులను యూఎస్‌బీపీ అడ్డుకుంది.

క్షణమొక యుగం!

» అక్రమ వలసలపై ఉక్కుపాదంతో అమెరికాలో రెస్టారెంట్లలో సిబ్బంది తొలగింపు

» అక్కడి భారతీయ రెస్టారెంట్లలో పనిచేస్తున్న తెలుగు యువత ఆందోళన



(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

అమెరికాలోని భారత రెస్టారెంట్ల తలుపులు తడితే చాలు లోపల పని చేస్తున్న వారు వణికిపోతున్నారు. ఎప్పుడు ఏ క్షణాన ఇమ్మిగ్రేషన్ అధికారులు వచ్చి తనఖీ చేస్తారో.. తాము ఏక్షణంలో పట్టుబడుతామోనని భయాందోళనలో క్షణమొక యుగంగా కాలం వెళ్లదీస్తున్నారు. ఇలా భయపడుతూ పనిచేస్తున్న వారిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన యువత కూడా ఉండడం గమనార్హం. అమెరికాలో సుమారు 9వేల భారత రెస్టారెంట్లు ఉన్నట్లు అంచనా. గత దశాబ్ద కాలంగా దేశంలో పెద్ద సంఖ్యలో తెలుగు ప్రవాసీయులు రెస్టారెంట్లు ఏర్పాటు చేశారు. తెలుగు ప్రవాసీయులు అధికంగా ఉన్న టెక్సాస్ రాష్ట్రంలో తొలుత ఈ వ్యాపారం ప్రారంభమై ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించింది. తెలుగు వారు బృందాలుగా ఏర్పడి ఈ రంగంలో పుంజుకుంటున్నారు. తెలుగువారు స్థాపించిన రెస్టారెంట్లలో తెలుగు యువత ఎక్కువగా ఉపాధి పొందుతోంది. అమెరికాలో చదవడానికి వచ్చె భారతీయ విద్యార్థులను ఈ రెస్టారెంట్లలో నియమించుకుంటున్నారు. అయితే.. వీరిలో ఎక్కువగా సరిహద్దులు దాటి మెక్సికో నుంచి అక్రమంగా వచ్చిన వారే ఎక్కువగా ఉన్నారు. వాస్తవానికి ఇలా నియమించడం చట్టవిరుద్ధం. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమ వలసలపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు రెస్టారెంట్లు, ఇతర పని ప్రదేశాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. దీంతో అనేక మంది భారతీయ రెస్టారెండ్ల నిర్వాహకులు పార్ట్ టైం పనులు కల్పించేందుకు స్వస్తి పలుకుతున్నారు. దీంతో ఆయా పనులపైనే ఆధారపడిన విద్యార్థుల పరిస్థితి డోలాయమానంలో పడింది. ఇమ్మిగ్రేషన్ అధికారుల తనిఖీల్లో అక్రమ వలసదారులు దొరికితే అది వారితో పాటు తమకు కూడా ఇబ్బందేనని రెస్టారెంట్ నిర్వాహకులు భావిస్తున్నారు. ఈ పరిణామాలు విద్యార్థులకు ప్రాణసంకటంగా మారాయి. మరోవైపు.. తక్కువ వేతనానికి లభించే పనివారు వెళ్లిపోతే రెస్టారెంట్లపై ఆర్థిక భారం పెరుగుతుందని యజమానులు తలలు పట్టుకుంటున్నారు.



గుణదల లూర్ధుమాత 101వ మహోత్సవాలు ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేసి గుణదల లూర్దుమాత 101వ మహోత్సవాలు ప్రారంభిస్తున్న విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు

గుణదల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రజలను దేవుని మార్గంలో నడిపించడానికి మరియమాత అనేక ప్రాంతాల్లో భక్తులకు దర్శనమిచ్చిందని విజయవాడ కతోలిక పీఠం బిషప్ మోస్ట్ రెవరెండ్ తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. గుణదల కొండపై కొలువైన గుణదల(లూర్దు)మాత 101వ మహోత్సవాలు ఆదివారం ఉదయం అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఉదయం 7 గంటలకు బిషప్ గ్రాసి ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళావేదికపై బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు, వికర్ జనరల్ ఫాదర్ మేశపాం గాబ్రియేలు తదితర గురువులు జ్యోతి ప్రజ్వలన చేసి అధికారికంగా ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు భక్తులను ఉద్దేశించి సందేశమిస్తూ...2025 సంవత్సరాన్ని జగద్గురువులు పరిశుద్ధ పోప్ ఫ్రాన్సిస్ వారు జూబ్లీ సంవత్సరంగా ప్రకటించారన్నారు. గుణదల మాత పుణ్యక్షేత్రం అద్భుతాల నిలయంగా విరాజిల్లుతోందని అన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన పూజాపీఠంపై ప్రారంభ పవిత్ర దివ్యపూజాబలి సమర్పించారు. పూజ అనంతరం గురువులు మువ్వల ప్రసాద్, పల్లె జోజిబాబు పసల తోమస్ తదితరులు కతోలిక క్రైస్తవ భక్తులకు దివ్య సత్ప్రసాదం అందజేశారు.

ఆస్తి వివాదంలో తాతను చంపేశాడు

» వ్యాపారవేత్త వీసీ జనార్దన్ రావు హత్య.. 70కి పైగా కత్తి పోట్లు


వీసీ జనార్దన్ రావు

హైదరాబాద్/దెందులూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): వెల్జన్ గ్రూపు ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత వెలమాటి చంద్రశేఖర జనార్దన్ రావు(85) హత్యకు గురయ్యారు. ఆస్తి వివాదంలో జరిగిన ఘర్షణలో ఆయన మనవడు కీర్తితేజ(29)నే ఆయనపై కత్తితో దాడి చేసి హతమార్చాడు. జనార్దన్ రావు నివాసంలోనే ఈ దారుణం జరిగింది. ఏలూరు జిల్లా కొవ్వలి గ్రామానికి చెందిన జనార్దనరావు.. బేగంపేటలో నివాసముంటారు. ఆయనకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. రెండో కూతురు సరోజిని దేవి భర్తతో విబేధాలు రావడంతో కొంతకాలంగా తండ్రితోనే ఉంటున్నారు. సరోజిని దేవి కుమారుడు కిలారు కీర్తి తేజ విదేశాల్లో ఉన్నత విద్య అనంతరం 2018 నుంచి మణికొండలో నివాసముంటున్నాడు. ఆస్తి, హోదా, వ్యాపారాల్లో గుర్తింపు విషయాల్లో కీర్తితేజ కొంతకాలంగా తాత, తల్లితో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 6వ తేదీ రాత్రి జనార్దన్ రావు ఇంటికి వచ్చిన కీర్తితేజ వాగ్వాదానికి దిగాడు. తన వెంట తెచ్చుకున్న కత్తితో జనార్దన్‌రావును ఇష్టమొచ్చినట్టు పొడిచాడు. జనార్దన్ రావు మెడపైనే 16 సార్లు వరకు పొడిచిన కీర్తితేజ.. మొత్తం 70కి పైగా కత్తిపోట్లు పొడిచాడు. దాడిని అడ్డుకోబోయిన తల్లి సరోజిని దేవిని దాదాపు 10 సార్లు పొడిచాడు. జనార్దన్‌రావు అక్కడికక్కడే మరణించగా సరోజిని దేవి ఆస్పత్రిపాలయ్యారు. కీర్తితేజను పోలీసులు అరెస్టు చేశారు. కాగా, రతన్‌టాటా సహాధ్యాయి అయిన వీసీ జనార్దన్ రావు.. సేవ కార్యక్రమాల్లోనూ రతన్‌టాటాను మరిపించారు. కోట్ల రూపాయాలను సేవా కార్యక్రమాలకు వెచ్చించారు. ఏలూరు ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి పలు దఫాలుగా నగదు అందించారు. భక్తుల భోజన వసతుల అభివృద్ధికి టీటీడీకి రూ.50 కోట్లు, స్వగ్రామం కొవ్వలిలోని జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి రూ.5 కోట్లు అందించారు.

భర్త వేధింపులు తాళలేక కుమారుడు సహా హోంగార్డు ఆత్మహత్య

» ఏలూరు కాలువలో మృతదేహాలు గుర్తింపు


ఝాన్సీ, దినేష్ కార్తీక్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు తాళలేక ఒక మహిళా హోంగార్డు తన ఐదేళ్ల కుమారుడితో కలిసి కాలువలో పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అనకాపల్లి పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ అందించిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లికి చెందిన హోంగార్డు దొండా రాంబాబు కుమార్తె ఝాన్సీకి, కశింకోటకు చెందిన అట్టా అచ్యుతరావుకు 2012లో వివాహం జరిగింది. అచ్యుతరావు అనుమానంతో ఝాన్సీని వేధిస్తుండేవాడు. దాంతో కొంతకాలానికే ఆమె అనకాపల్లి పట్టణంలోని గాంధీనగర్ అంజయ్య కాలనీలో ఉండే తల్లిదండ్రుల వద్దకు వచ్చేసింది. పెద్దలు రాజీ చేయడంతో తిరిగి భర్త వద్దకు వెళ్లింది. హోంగార్డుగా పనిచేసే రాంబాబు ఐదేళ్ల క్రితం మృతి చెందడంతో రెండేళ్ల క్రితం ఆ ఉద్యోగం ఝాన్సీకి వచ్చింది. ప్రస్తుతం ఆమె అనకాపల్లి డీఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండగా.. అచ్యుతరావు బయ్యవరంలో ఒక ప్రైవేటు కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. వారికి కుమారుడు దినేష్ కార్తీక్(5) ఉన్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం భార్యతో అచ్యుతరావు గొడవపడ్డాడు. దీంతో ఆమె అంజయ్యకాలనీలో ఉంటున్న తల్లి సత్యవతి వద్దకు వచ్చేసింది. సాయంత్రం గాంధీనగరంలో దినేష్ కార్తీక్ చదువుతున్న స్కూల్‌కు వెళ్లి, కుమారుడిని తీసుకుని నేరుగా తుమ్మపాల సమీపంలో గల ఏలేరు కాలువలో పడి ఆత్మహత్య చేసుకుంది. రెండు రోజులుగా కుమార్తె, మనమడు కనిపించకపోవడంతో సత్యవతి, ఆమె బంధువులు వెతకడం ప్రారంభించారు. ఆదివారం ఉదయం ఏలేరు కాలువలో మృతదేహం ఉన్నట్టు తుమ్మపాల గ్రామస్థుల నుంచి సమాచారం రావడంతో సీఐ మృతదేహాన్ని పరిశీలించి హోంగార్డు ఝాన్సీగా గుర్తించారు. అగ్నిమాపక సిబ్బంది సహకారంతో కాలువలో దినేష్ కార్తీక్ మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అచ్యుతరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది.

కన్నకొడుకే కాలయముడయ్యాడు!

» మద్యం మత్తులో తండ్రిని చంపిన తనయుడు


నిందితుడు మరియదాసు

దొనకొండ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నిద్రిస్తున్న తండ్రిని చెట్లు కోసే రంపం బ్లేడుతో విచక్షణారహితంగా తలపై బలంగా గాయపర్చి హత్య చేశాడు ఓ వ్యక్తి. ప్రకాశం జిల్లా దొనకొండ మండలం ఇండ్లచెరువులో శనివారం అర్ధరాత్రి ఈఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు గ్రామానికి చెందిన పైడిపోగు ఏసు(78) రైల్వేశాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ముగ్గురికీ వివాహాలయ్యాయి. కొన్నేళ్ల క్రితం భార్య మృతి చెందింది. పెద్ద కుమారుడు నాగేశ్వరరావు అదే గ్రామంలో వేరే ఇంట్లో ఉంటూ కూలి పనులు చేసుకొని జీవిస్తున్నాడు. రెండో కుమారుడు మరియదాసు, భార్య, వారి ఇద్దరు కుమార్తెలు ఏసుతో కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. మద్యానికి బానిసైన మరియదాసు జులాయిగా తిరుగుతూ తరచూ ఇంట్లో గొడవపడుతుండేవాడు. అతని వేధింపులు తట్టుకోలేక ఏసు ఉదయం దొనకొండకు వచ్చి ఎక్కడో ఒకచోట కాలక్షేపం చేసి సాయంత్రానికి ఇంటికి వెళ్తుండేవారు. వారం క్రితం మరియదాసు భార్యతో గొడవపడడంతో ఆమె పిల్లలను తీసుకుని స్వగ్రామమైన పోతలపాడుకు వెళ్లిపోయింది. శనివారం తండ్రి వద్ద డబ్బులు తీసుకున్న మరియదాసు మద్యం సేవించి రోడ్డుపై పడిపోయాడు. విషయం తెలుసుకొన్న ఏసు గ్రామస్థుల సహకారంతో కొడుకును ఇంటికి చేర్చాడు. అర్ధరాత్రి సమయంలో స్పృహలోకి వచ్చిన మరియదాసు ఇంట్లో ఎవరూలేకపోవడంతో గాఢనిద్రలో ఉన్న తండ్రిపై దాడి చేశాడు. రంపం బ్లేడుతో తలపై కోయడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. అనంతరం రోడ్డుపైకి వచ్చి తండ్రిని చంపానని మరయదాసు కేకలు వేస్తుండగా స్థానికులు అనుమానంతో ఇంట్లోకి వెళ్లి చూసేసరికి ఏసు విగతజీవిగా రక్తపు మడుగులో మంచంపై పడి ఉన్నారు. వెంటనే ఇరుగుపొరుగు వారు అక్కడకు చేరుకొని మరియదాసును సమీపంలోని విద్యుత్ స్తంభానికి కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మరియదాసును అదుపులోకి తీసుకున్నారు.

గోదావరి రివర్ బోర్డు బృందం రెండోరోజు పర్యటన

ఏలూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టు ఎడమ కాల్వ కనెక్టివిటీ పనులను గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు బృందం ఆదివారం పరిశీలించింది. బోర్డు చైర్మన్ ఏకే ప్రధాన్, కార్యదర్శి అజగేషన్ ఎడమ కాల్వ కనెక్టివిటీలో ప్రధానమైన ప్రాంతాలను పరిశీలించారు. జంట గుహలు, ఎగ్జిట్ చానల్ హెడ్ రెగ్యులేటర్, ఇరిగేషన్ టన్నెల్, నేవిగేషన్ టన్నెల్, నేవిగేషన్ చానల్, పవర్ హౌస్ ప్రాంతాలను వారు పరిశీలించారు.

జలవనరుల శాఖలో ప్రాజెక్టు టూరిజం!

» పర్యాటక శాఖ భాగస్వామ్యంతో ప్రైవేటు సంస్థలకూ ఆహ్వానం
» సోలార్ ప్యానళ్లతో విద్యుదుత్పత్తి
» ఫ్లోటింగ్ సోలర్ ప్యానళ్లూ ఏర్పాటు
» ఆదాయార్జనకు ప్రణాళికలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జల వనరుల శాఖ ఉన్నతాధికారులు ఆదాయార్జనపై దృష్టి సారిస్తున్నారు. ఇందుకోసం ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. టెంపుల్ టూరిజం తరహాలో ప్రాజెక్టు టూరిజాన్ని అభివృద్ధి చేయాలని యోచిస్తున్నారు. ప్రాజెక్టులను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయడం వల్ల అదనపు ఆదాయం వస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం పర్యాటక శాఖ భాగస్వామ్యంతో పాటు ప్రైవేటు సంస్థలనూ ఆహ్వానించాలని యోచిస్తున్నారు. ప్రాజెక్టు ప్రాంతం, కాలువ గట్ల వద్ద సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేయడం ద్వారా విద్యుదుత్పత్తిని చేపట్టడంతో పాటు అదనపు ఆదాయం పొందవచ్చని భావిస్తున్నారు. ఇదే సమయంలో అత్యాధునిక సాంకేతిక నైపుణ్యంతో ఫ్లోటింగ్ సోలార్ ప్యానళ్లను నదీ జలాలు, ప్రాజెక్టుల వద్ద ఏర్పాటు చేయడం ద్వారా సోలార్ విద్యుదుత్పత్తిని చేయవచ్చని యోచిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం ఈ తరహా విధానాన్ని ఇప్పటికే అమలు చేస్తోందని చెబుతున్నారు. మైనర్ ఇరిగేషన్ పరిధిలోని సాగునీటి యాజమాన్య సంఘాల ద్వారా నీటి తీరువాను సక్రమంగా వసూలు చేయడం ద్వారా పూర్తిస్థాయిలో ఆదాయాన్ని పొందే వీలుంటుందని భావిస్తున్నారు. అలాగే పారిశ్రామిక సంస్థల నుంచి సెస్‌ను గరిష్ఠ స్థాయిలో వసూలు చేయడంపై దృష్టి సారించాలని యోచిస్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో జల వనరుల శాఖ సిబ్బంది కోసం నిర్మించే కాలనీలను అభివృద్ధి చేయడం ద్వారా కూడా అదనపు ఆదాయం పొందవచ్చని అభిప్రాయపడుతున్నారు. త్వరలోనే ఈ ప్రతిపాదనలను ప్రభుత్వం ముందుకు తీసుకురావాలన్న యోచనలో జల వనరుల శాఖ ఉంది.

ల్యాండ్ బ్యాంక్‌గా మిగులు భూమి

రాష్ట్ర ఆర్థిక స్థితిగతుల నేపథ్యంలో జల వనరుల శాఖ ఏటా పది నుంచి పదిహేను వేల కోట్ల రూపాయల దాకా బడ్జెట్‌లో కేటాయింపులకు నోచుకోలేకపోతోంది. ఫలితంగా ఇప్పటికే నిర్మించిన ప్రాజెక్టుల యాజమాన్య నిర్వహణే భారంగా మారుతోంది. ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు ఇతర ఆదాయ మార్గాలతో పాటు ప్రాజెక్టు నిర్మాణ సమయంలో సేకరించిన మిగులు భూమిని 'ల్యాండ్ బ్యాంక్'గా మార్చుకోవాలని నిర్ణయించింది. నిరుపయోగంగా వదిలేయడం వల్ల విలువైన ఆస్తి అన్యాక్రాంతమవుతోందని, ఇతర శాఖలు చేజిక్కించుకుంటున్నాయని చెబుతోంది. విజయవాడ, విశాఖపట్నం సహా ప్రముఖ నగరాలు, పట్టణాల్లో జల వనరుల శాఖకు చెందిన విలువైన భూములు, భవనాలను ఇతర శాఖలు సొంతం చేసుకున్నాయి.

వైసీపీ ఉన్మాదుల అకృత్యం

» ఇంజనీరింగ్ విద్యార్థినిపై ఒకరు అత్యాచారం
» వీడియోలు చిత్రీకరించామని ఇద్దరు బెదిరింపులు
» తమ కోరికా తీర్చాలని వేధింపులు
» పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు.. అదుపులో నిందితులు

విజయవాడ/కంచికచర్ల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): క్లబ్‌లో గుమస్తాగా పనిచేస్తున్న తండ్రి కోసం వెళ్లిన కుమార్తెను ఆకతాయిలు స్విమ్మింగ్‌పూల్‌లోకి తోసేస్తారు. తర్వాత ఓ రాజకీయ నాయకుడి కుమారుడు ఆమెపై అత్యాచారం చేస్తాడు. దీన్ని అతడి స్నేహితులు చూస్తూ చప్పట్లు కొట్టి ప్రోత్సహిస్తారు!! కొన్నాళ్ల క్రితం విడుదలైన కర్తవ్యం చిత్రంలోనిదీ సన్నివేశం!!. అచ్చం ఇలాగే, ఓ ఇంజనీరింగ్ విద్యార్థినిని ప్రేమ పేరుతో వంచించి ఆమెపై అత్యాచారం చేస్తున్న యువకుడ్ని ప్రోత్సహించారు వైసీపీ యువజన విభాగానికి చెందిన యువకులు. ఈ దృశ్యాలను ఫోన్లలో చిత్రీకరించామని వేధిస్తుండడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లలో జరిగిందీ దారుణం. తిరువూరుకు చెందిన ఓ యువతి బీటెక్ చదువుతోంది. పరిటాల గ్రామానికి చెందిన చింతల ప్రభుకుమార్ ఆమెతోపాటు చదువుతున్నాడు. ఇద్దరి మధ్య స్నేహం ఏర్పడింది. పరిటాల గ్రామానికి చెందిన పెయింటర్ షేక్ గాలి షాహిద్ (పిద్దా), షేక్ హుస్సేన్(పీసు), ప్రభుకుమార్ ఒకే ఊరికి చెందిన వారు కావడంతో వారి మధ్య స్నేహబంధం ఏర్పడింది. వారిలో హుస్సేన్ సోషల్ మీడియాలో చాలా చురుకుగా ఉంటాడు. రీల్స్ చేసి ఇన్‌స్టాలో పోస్టు చేస్తాడు. ఈ ముగ్గురూ వైసీపీ యువజన విభాగానికి చెందినవారు. వారి వాట్సాప్ స్టేటస్‌ల్లో అన్నీ వైసీపీకి సంబంధించినవే ఉన్నాయి. ప్రభుకుమార్‌తో స్నేహంగా ఉండటంతో హుస్సేన్‌కు కూడా ఆ యువతితో పరిచయం ఏర్పడింది. ఈ ఏడాది సంక్రాంతి సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో యువతిని హుస్సేన్ ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడికి షాహిద్, ప్రభుకుమార్ చేరుకున్నారు. కాసేపటికి హుస్సేన్ బయటకు వచ్చేశాడు. తర్వాత షాహిద్ లోపలకు వెళ్లి యువతిపై అత్యాచారం చేశాడు. బయట ఉన్న హుస్సేన్, ప్రభుకుమార్ చప్పట్లు కొడుతూ అతడిని ప్రోత్సహించారు. ఈ దృశ్యాన్ని సెల్‌ఫోన్లలో చిత్రీకరించామని యువతిని బెదిరిస్తున్నారు. తమ కోరికలు కూడా తీర్చకపోతే వీడియోలను వెబ్‌సైట్ల లో అప్‌లోడ్ చేస్తామని వేధిస్తున్నారు. ఈ ముగ్గురి నుంచి నిత్యం నరకం అనుభవిస్తున్న బాధితురాలు తల్లిదండ్రుల సాయంతో కంచికచర్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ బి.రాజు ఈ ముగ్గురు యువకులపై కేసు నమోదు చేశారు. నిందితులను అదుపులోకి తీసుకున్నామని, సోమవారం కోర్టులో హాజరుపరుస్తామని నందిగామ ఏసీపీ ఏబీజీ తిలక్ చెప్పారు.

ఏడో తరగతి విద్యార్థినిపై లైంగికదాడి

» ప్రతిఘటించడంతో కడుపులో పిడిగుద్దులు
» స్కూల్ వ్యాను డ్రైవరే కీచకుడు
» గత నెల 29న ఘటన.. నిందితుడి కోసం గాలింపు

నెల్లూరు రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఏడో తరగతి చదువుతున్న బాలికను రోజూ స్కూల్‌కు తీసుకెళ్లే క్రమంలో వ్యాను డ్రైవర్ ఆమె యోగక్షేమాలు అడిగేవాడు. చదువు వివరాలు ప్రస్తావిస్తూ సొంత మనిషిలా నమ్మించాడు. అదను చూసి ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. గత నెల 29న ఈ దారుణం జరగగా, బాలిక తల్లికి అనుమానం వచ్చి ఆరా తీయడంతో వెలుగుచూసింది. నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండల పరిధిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో బాలిక(13) ఏడో తరగతి చదువుతోంది. ఆ చిన్నారికి తండ్రి లేడు. గత నెల 29న బాలిక వ్యాన్‌లో స్కూలుకు బయలుదేరింది. కొంతదూరం వెళ్లేసరికి వాంతులు రావడంతో కిందికి దిగింది. రోజూ వ్యానుకు డ్రైవర్‌గా వచ్చే నరుకూరు దళితవాడకు చెందిన నంబూరు సతీష్, ఆ రోజు కొత్త డ్రైవర్‌కు రూట్ చూపించేందుకు స్కూటర్‌పై వచ్చాడు. కిందకు దిగిన బాలికను స్కూటర్‌పై ఎక్కించుకుని తీసుకువస్తానని చెప్పి వ్యానును పంపించేశాడు. కానీ బాలికను స్కూల్‌కు తీసుకెళ్లకుండా కోడూరు వద్దనున్న సముద్రతీరానికి మరో స్నేహితుడు కోవూరు సునీల్ సాయంతో తీసుకెళ్లాడు. అక్కడ పొదల్లోకి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆమె ప్రతిఘటించడంతో కడుపులో పిడిగుద్దులు గుద్దాడు. తర్వాత టీడీగూడూరు మండలం చిన్నతోపు వద్దకు స్కూల్ వ్యానును పిలిపించుకుని, మరోసారి వ్యానులో బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయం బయట చెబితే చంపేస్తానని బెదిరించి యథావిధిగా స్కూల్ ముగిసే సమయానికి వ్యానులో ఇంటి వద్ద దింపేశారు. అయితే, బాలిక ప్రవర్తనపై అనుమానంతో ఏం జరిగిందంటూ తల్లి ఈ నెల 7న గట్టిగా నిలదీసింది. దీంతో జరిగిన దారుణాన్ని చిన్నారి ఆమెకు వివరించింది. దిగ్భ్రాంతికి గురైన తల్లి.. ఆదివారం తమకు ఫిర్యాదు చేయడంతో బాలికకు వైద్య పరీక్షలు జరిపించి, కేసు నమోదు చేశామని సీఐ వెల్లడించారు. నిందితులు నంబూరు సతీష్, కోవూరు సునీల్ కోసం ప్రత్యేక బృందంతో గాలిస్తున్నామని తెలిపారు.

దివ్యాంగురాలిపై అత్యాచారం

» పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు

పలాసరూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): దివ్యాంగురాలైన ఓ మహిళను వరసకు మామ అయిన వ్యక్తి మాయమాటలు చెప్పి గర్భవతిని చేసిన ఘటన శ్రీకాకుళం జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనకు సంబంధించి కాశీబుగ్గ సీఐ టి.సూర్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పలాస మండలంలోని ఓ గ్రామానికి చెందిన దివ్యాంగురాలికి.. అదే గ్రామానికి చెందిన వరిశ భాస్కరరావు అనే వ్యక్తి మాయమాటలు చెప్పేవాడు. మామ వరసయిన అతడు. 7 నెలల కిందట ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆమె వద్దని నిరాకరించినా కల్లబొల్లి మాటలు చెప్పి, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. తీవ్ర అనారోగ్యానికి గురైన ఆమె గత నెల 22న ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోగా గర్భవతి అని వైద్యులు తేల్చారు. విషయం బయటపడడంతో కుటుంబ సభ్యులు భాస్కరరావును పిలిపించి గ్రామపెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టారు. ఇందులో తన తప్పు లేదని భాస్కరరావు వాగ్వాదానికి దిగారు. దీంతో ఆదివారం బాధితురాలు కుటుంబ సభ్యులతో కలిసి కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేసింది. భాస్కరరావు తనను గర్భవతిని చేశాడని, తనకు న్యాయం చేయాలని ఆమె కోరింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు.

నేడు పోలవరం ప్రగతిపై కేంద్ర జలశక్తి సమీక్ష

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రధాన డ్యామ్ పనుల ప్రగతిపై కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి దేబర్షి ముఖర్జీ అధ్యక్షతన సోమవారం న్యూఢిల్లీలో సమీక్ష నిర్వహించనున్నారు. ప్రధాన డ్యామ్ పనుల్లో కీలకమైన సమాంతర డయాఫ్రమ్‌వాల్ నిర్మాణం కోసం అంతర్జాతీయ నిపుణుల ప్యానెల్ ఇచ్చిన సూచనల మేరకు ప్లాస్టిక్ కాంక్రీట్ టీ-16 మిశ్రమాన్ని కాంట్రాక్టు సంస్థ బావర్ వాడుతోంది. డయాఫ్రమ్‌వాల్ నిర్మాణాన్ని ఈ ఏడాది ఆఖరుకు పూర్తిచేయాలని కేంద్ర జలశక్తి లక్ష్యాన్ని నిర్దేశించింది. డయాఫ్రమ్‌వాల్ 600 మీటర్లకు చేరేసరికి ఒకవైపు నుంచి ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ పనులు ప్రారంభించాలని నిర్మాణ సంస్థ మేఘా ఇంజనీరింగ్‌ను కేంద్ర జలశక్తి సూచించింది. ఈ పనులు 2027 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని చెబుతోంది.

ఆస్తి కోసం ఆగిన అంత్యక్రియలు

» రెండ్రోజులుగా ఇంటి వద్దే యువకుడి మృతదేహం
» ససేమిరా అంటున్న తల్లి, సోదరి.. రోదిస్తున్న భార్య


శివాచారి మృతదేహం వద్ద మూడేళ్ల కుమారుడితో భార్య ఈశ్వరి

గిద్దలూరు టౌన్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ మరణించిన కుమారుడి మృతదేహాన్ని తమ ఇంటి వద్ద పెట్టవద్దంటూ తల్లి, సోదరి తెగేసి చెప్పారు. ఆస్తి విషయం తేల్చాల్చిందేనని భీష్మించారు. రెండ్రోజులుగా ఇంటి ముందే మృతదేహం ఉన్నా అంత్యక్రియలకు కుటుంబసభ్యులు ఎవరూ ముందుకు రాలేదు. అందిన సమాచారం మేరకు గిద్దలూరు పట్టణానికి చెందిన హయగ్రీవ శివాచారి(32) కొంతకాలంగా హైదరాబాద్‌లో భార్య, 3 సంవత్సరాల కుమారుడితో కలిసి జీవిస్తున్నారు. మద్యానికి బానిసైన శివాచారి ఈ నెల 7న ఇంటిపై నుంచి కిందపడి తీవ్రగాయాలై చికిత్స పొందుతూ మృతి చెందారు. భర్త మృతదేహాన్ని తీసుకొని 8న ఈశ్వరి గిద్దలూరుకు వచ్చారు. శనివారం వైశ్యాబ్యాంక్ వీధిలో ఉన్న నివాసానికి చేరుకున్నారు. అక్కడ శివాచారి తల్లి, సోదరి తమ ఇంటి వద్ద శవాన్ని పెట్టవద్దంటూ ఇంటికి తాళం వేసుకొని వెళ్లిపోయారు. బంధువులు కూడా ఆ ప్రాంతానికి రాలేదు. దీంతో శనివారం, ఆదివారం భర్త శవం వద్ద ఈశ్వరి రోదిస్తూనే ఉంది. ఆదివారం సాయంత్రం సమాచారం అందుకున్న గిద్దలూరు అర్బన్ సీఐ సురేశ్ అక్కడికి చేరుకొని శివాచారి తల్లి, సోదరి, భార్యతో మాట్లాడి అంత్యక్రియలు నిర్వహించాలని సూచించారు. అయితే ఆస్తుల విషయం తేలే వరకు అంత్యక్రియలు చేయబోమని వారు తేల్చిచెప్పారు.

పల్నాడు జిల్లాలో ఘోర ప్రమాదం

» ట్రాక్టర్ బోల్తా.. నలుగురు మహిళా వ్యవసాయ కూలీలు మృతి

ముప్పాళ్ల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం చాగంటివారిపాలేనికి చెందిన కూలీలు వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లి వస్తుండగా బొల్లవరం శివారు మాదల మేజరు కాలువ వద్ద ట్రాక్టర్ బోల్తా పడింది. ఆదివారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో ట్రాక్టరులోని నలుగురు వ్యవసాయ కూలీలు మృతి చెందారు. బొల్లవరం గ్రామ శివారులో మిర్చికోతలకు వెళ్లిన సుమారు 21 మంది కూలీలు ట్రాక్టర్‌లో తిరుగు ప్రయాణమయ్యారు. రోడ్డు గుంతల మయంగా ఉండటంతో ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న మేజరు కాల్వలో బోల్తా పడింది. మిర్చి టిక్కీలపై కూర్చున్న కూలీలు కిందపడగా, వారిపై టిక్కీలతో పాటు ట్రాక్టర్ ట్రాలీ పడింది. ఈ ఘటనలో తేనేపల్లి పద్మ(46), మధిర సామ్రాజ్యం(55), మధిర గంగమ్మ (60) అక్కడికక్కడే మృతి చెందారు. చెక్కెర మాధవి(30) సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందింది. ట్రాక్టర్ బోల్తా పడుతుందని పసిగట్టిన కూలీల్లో కొంతమంది కిందకు దూకి ప్రాణాలను కాపాడుకున్నారు. మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. ''రెం ముప్పాళ్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

తిరుమల చేరుకున్న చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్


జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్‌కు స్వాగతం పలుకుతున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆదివారం తిరుమలకు వచ్చారు. తిరుమలలోని పద్మావతి అతిథిగృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి బస, దర్శన ఏర్పాట్లు చేశారు. కాగా, జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ సోమవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

శ్రీవారి సేవలో జస్టిస్ జయసూర్య


శ్రీవారి ఆలయం ముందు జస్టిస్ జయసూర్య

తిరుమల, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయసూర్య తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో స్వామివారిని దర్శించుకుని రంగనాయకమండపానికి చేరుకున్న ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. అలాగే గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ విజయ్ బిష్ణోయ్, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దండపాణి కూడా వేర్వేరుగా శ్రీవారిని దర్శించుకున్నారు.

దేశంలో రాజ్యహింస అవధులు దాటింది

» రెండో రోజు విరసం సాహిత్య పాఠశాలలో ప్రొఫెసర్ హరగోపాల్


ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఫాసిజం దేశంలో నలుమూలలా విస్తరించిందని, తద్వారా రాజ్యహింస అవధులు దాటిందని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. కర్నూలు జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో రెండ్రోజులు కొనసాగిన విప్లవ రచయిత సంఘం (విరసం) 24వ సాహిత్య పాఠశాల కార్యక్రమాలు ఆదివారం రాత్రి ముగిశాయి. 'సంక్షోభ కాలంలో సాహిత్యకారుల పాత్ర' అనే అంశంపై నిర్వహించిన ముగింపు బహిరంగ సభలో ముఖ్యవక్తగా ప్రొఫెసర్ హరగోపాల్ ప్రసంగించారు. రచయితల దృక్పథంలో మార్పు రావడం కాదని, ప్రవర్తనలో మార్పు రావాలని అన్నారు. ఇటీవల కాలంలో రచయితలు ప్రజలకు దగ్గరయ్యే సాహిత్యాన్ని సృష్టిస్తున్నారని, ఇది ఆశాజనకంగా భావిస్తున్నానని చెప్పారు. విరసం నాయకుడు నాగేశ్వరాచారి అధ్యక్షత వహించిన ఈ సభకు ముందు విరసం నాయకులు 27 పుస్తకాలు ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో విరసం రాష్ట్ర అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ, ప్రధాన కార్యదర్శి రివేరా, సాయిబాబా సహచరి వసంత కుమారి, వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్, విరసం నేతలు పాణి, ఎన్.రవి, వరలక్ష్మి, సాగర్, శశికళ తదితరులు పాల్గొన్నారు.

నేడు నులి పురుగుల నిర్మూలనా దినం

» చిన్నారులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ

అమరావతి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినం సందర్భంగా ఒకటి నుంచి 19 ఏళ్ల వయస్సు గల చిన్నారులు, విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీకి సర్వం సిద్ధం చేసినట్లు ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి.వీరపాండియన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

హిందీ నేర్చుకుంటున్న కుమార స్వామి

బెంగళూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాజకీయాల్లో సుదీర్ఘకాలం వివిధ హోదాల్లో కొనసాగిన కుమారస్వామి కేంద్రమంత్రిగా రాణించేందుకు సమగ్రంగా హిందీ నేర్చుకోదలిచారు. భాషా తరగతుల ద్వారా రోజూ 90 నిమిషాలపాటు హిందీ నేర్చుకుంటున్నారు. హిందీ బోధించే అధ్యాపకులను నియమించుకున్నారు. రెండు రోజులుగా హిందీలో రాయడం, సులభంగా మాట్లాడడాన్ని వారు నేర్పిస్తున్నారు.

అరేబియన్ తీరాన అక్షర కెరటాలు

జనవరి 22 నుంచి 26 వరకు కేరళ లిటరరీ ఫెస్టివల్ కోళికోడ్ (కాలికట్) నగరంలో సముద్రపు ఒడ్డున జరిగింది. ఈ ఉత్సవాన్ని ప్రముఖ మలయాళీ ప్రచురణకర్తలు డి.సి. బుక్స్ గత ఎనిమిదేళ్ళుగా నిర్వహిస్తున్నారు. ఈసారి అతిథి దేశంగా ఫ్రాన్స్‌ను ఆహ్వానించారు. సాహిత్యోత్సవంతో పాటుగా తొలిసారిగా ఈ ఏడాది ప్రచురణకర్తల సమావేశం (పబ్లిషర్ కాన్క్లేవ్) కూడా రెండు రోజుల పాటు ఏర్పాటు చేశారు. వారి ఆహ్వానం మేరకు, 'ఎలమి' ప్రచురణల నిర్వాహకురాలిగా నేను హాజరయ్యాను.

***

లిట్ ఫెస్ట్ అంటే– దేశీ విదేశీ రచయితలను, సాహిత్యకారులను, ప్రచురణకర్తలను, పాఠకులను కొన్ని రోజుల పాటు ఒక చోటకు తెచ్చే పుస్తకాల జాతర. పుస్తకాల అట్టల పైన పేరుగా మాత్రమే తెలిసిన రచయితలను పలకరించే అవకాశం ఇక్కడ కలుగుతుంది. ఎప్పటెప్పటి నుంచో తమ రచనల ద్వారా సోషల్ మీడియాలో 'ఫ్రెండ్స్'గా మారిన వారిని మొదటిసారి ఆలింగనం చేసుకునే అవకాశాన్ని ఇస్తుంది. తాజాగా అచ్చైన పుస్తకాలను ప్రమోట్ చేసుకోడానికి ఇవి మంచి వేదికలు.




కోటలు, హోటళ్ళు, ఐటీ పార్కులు, బీచులు – ఇలా రకరకాల ప్రాంగణాల్లో జరుగుతూ వేలల్లో, లక్షల్లో వచ్చే సందర్శకులని ఆకర్షిస్తాయి ఈ లిటరరీ ఫెస్టివల్స్. పుస్తకాలంటే ప్రాణం పెట్టే వారి సంఖ్య మరీ తక్కువేమీ కాదన్న సంగతిని గుర్తు చేస్తాయి. అన్ని లిటరరీ ఫెస్ట్‌లూ ఒకేలా అనిపించినా, ఆ హంగూ హడావిడీ కాస్త ఇబ్బంది కలిగించినా, ప్రస్తుతం దేశంలో జరుగుతున్న ప్రతి ఫెస్ట్‌కూ ఏదో ఒక ప్రత్యేకత ఉంది. 2012 నుంచి హైదరాబాద్, బెంగళూరు, జైపూర్ వంటి లిట్ ఫెస్టులకు వెళ్ళడం మామూలైపోయిన నన్ను ఈ కేరళ సాహిత్య ఉత్సవం కొన్ని విషయాల్లో అబ్బురపరిచింది.

"ఆసియాలో రెండో అతి పెద్ద లిటరరీ ఫెస్ట్" అన్న టాగ్‌లైన్‌కు తగినట్టే ఈ ఉత్సవానికి ఈ ఏడాది దాదాపు ఆరు లక్షల మంది సందర్శకులు వచ్చారు. అరేబియన్ సముద్రం ఒడ్డున ఇంతమంది సాహిత్యంలో పడిమునకలు వేయడాన్ని చూస్తే మనసు నిండిపోయింది. కేరళలో 1940లలో జరిగిన గ్రంథాలయోద్యమం వల్ల ఆ రాష్ట్రంలో పుస్తక పఠనం బలపడింది. ఇప్పుడు సామాన్యుల నుంచి సెలబ్రిటీల దాకా అందరూ పుస్తకాల పురుగులే. అందుకే అంతమంది జనం!

నన్ను బాగా ఆశ్చర్యపరచిన, ఆకట్టుకున్న విషయం మాత్రం అత్యధిక సెషన్లు మలయాళ భాష లోనే ఉండడం. మలయాళీ రచయితలకూ, పాఠకులకే ఇక్కడ పెద్ద పీట వేశారు. బుక్ స్టాల్‌లో కూడా 70 శాతం వరకూ మలయాళీ పుస్తకాలే ఉన్నాయి. పోస్టర్లు, పాంప్లెట్లు, వేదికల పేర్లు... ఇలా అన్ని చోట్లా మలయాళానిదే హవా! ఆఖరుకి అతిథులుగా వెళ్ళిన మాకు ఇచ్చిన గిఫ్ట్ హాంపర్‌లో కూడా ఇతర గిఫ్టులతో పాటు ఒక మలయాళంలో ఉన్న కాలెండరు, వార పత్రిక ఇచ్చారు.

ఇలాంటి సాహిత్య ఉత్సవాలకు విదేశీ రచయితలు రావడం పరిపాటే! ముఖ్యంగా అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్నవారిని పిలుస్తారు. కేరళ లిట్ ఫెస్ట్‌కు జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్, బల్గేరియా దేశాల



"ఆసియాలో రెండో అతి పెద్ద లిటరరీ ఫెస్ట్" అన్న టాగ్‌లైన్‌కు తగినట్టే కేరళ లిటరరీ ఫెస్టివల్‌కు ఈ ఏడాది దాదాపు ఆరు లక్షల మంది సందర్శకులు వచ్చారు. అరేబియన్ సముద్రం ఒడ్డున ఇంతమంది సాహిత్యంలో పడిమునకలు వేయడాన్ని చూస్తే మనసు నిండిపోయింది. కేరళలో 1940లలో జరిగిన గ్రంథాలయోద్యమం వల్ల ఆ రాష్ట్రంలో పుస్తక పఠనం బలపడింది. ఇప్పుడు సామాన్యుల నుంచి సెలబ్రిటీల దాకా అందరూ పుస్తకాల పురుగులే. అందుకే అంతమంది జనం!

నుంచి రచయితలతోపాటు, వారిని ఆంగ్లంలోకి అనువదించిన వారూ వచ్చారు. అంతేగాక ఆ రచయితలు రాసిన పుస్తకాల మలయాళ అనువాదాలను ఈ సభల్లో వారి సమక్షంలోనే విడుదల చేయడం గొప్పగా అనిపించింది. భారతీయ భాషల్లోకి విదేశీ రచనలు అనువాదం అవ్వడమే అరుదు. అలాంటిది ఆ రచయిత సమక్షంలోనే అనువాదం ఆవిష్కరణ జరగటం ఇంకా అపురూపం.

***

ఈ ఫెస్టివల్లో భాగంగా 'ఫ్రెంచ్ ఇన్‌స్టిట్యూట్ ఇన్ ఇండియా', 'ఫ్రెంచ్ ఇంటర్నేషనల్ బుక్ ఆఫీసు' సంయుక్తంగా రెండు రోజులపాటు ప్రచురణకర్తల సమావేశాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ఇండియాలో ఫ్రెంచ్ రాయబారి హెచ్.ఈ. థియరీ మథౌ; ప్రముఖ కవి, రచయిత కె. సచ్చిదానందన్; బుక్ బ్రహ్మ వ్యవస్థాపకులు సతీష్ చప్పరికె అతిథులుగా వచ్చారు. ఫ్రాన్స్ నుంచి గల్లీమార్డ్ వంటి పెద్ద సంస్థలు, లిటరరీ ఏజెంట్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, మరాఠీ, ఇంగ్లీష్ భాషల ప్రచురణకర్తలు కూడా పాల్గొన్నారు.

మన దేశంలో పుస్తకాలకు, అనువాదాలకు ఎలాంటి మార్కెట్ ఉందన్న దానిపై ఈ సమావేశాల్లో చర్చ జరిగింది. ఇతర దక్షిణాది భాషలతో పోల్చుకుంటే తెలుగులో అమ్మకాలు తక్కువ గానే ఉన్నాయి. పుస్తకాల డిస్ట్రిబ్యూషన్ సమస్యలను దాదాపు అందరూ ప్రస్తావించినా ఒక్కో భాషలో ఆ సమస్యల తీవ్రత ఒక్కోలా ఉన్నది అనిపించింది. ప్రచురితమైన పుస్తకాలకు ఐ.ఎస్.బీ.ఎన్ కోడ్ ఉపయోగించకపోవడం వల్ల అసలు ఎన్ని పుస్తకాలు వెలువడుతున్నాయి అన్నది లెక్కలకు అందడం లేదు. అలానే, రచయితలకు ప్రచురణకర్తలకు మధ్య సరైన రాతపూర్వక అగ్రిమెంట్లు లేకపోవడంవల్ల అనువాదాలు చేయించేటప్పుడు వచ్చే గందరగోళాలు ప్రస్తావనకు వచ్చాయి.

ఫ్రాన్స్ వారు తమ దేశంలో పుస్తకాలు, అనువాద రచనల పరిస్థితి ఎలా ఉందో చెప్పుకొచ్చారు. మనతో పోల్చుకుంటే వారిది ఎక్కువ ఆర్గనైజ్డ్ మార్కెట్ అనిపించింది. ఉదాహరణకి– అక్కడ సెకండ్ హాండ్ పుస్తకాల అమ్మకాలు ఎంత పెద్ద మార్కెట్టో లెక్కలతో సహా చూపించారు. (ఇండియాలో పాత పుస్తకాల షాపుల విషయంలో ఇలాంటి గణాంకాలు అసాధ్యం.) వాళ్ళ పుస్తకాల అమ్మకాల సంఖ్య కూడా ఆశాజనకంగా ఉంది. ముఖ్యంగా అనువాద పుస్తకాలకు కూడా మార్కెట్ బాగుందని చెప్పారు.

***

తెలుగు నుంచి ఫ్రెంచ్ లోకి అనువాదాలు వెళ్ళాలన్నా, అక్కడ నుంచి ఇక్కడకి అనువాదాలు రావాలన్నా మనం – వ్యక్తులుగా, సంస్థలుగా – చేయవలసిన పనులు, గమనించుకోవాల్సిన విషయాలు కొన్ని ఉన్నాయి.

రచయితలు తమ పుస్తకాలను ప్రచురణకు ఇచ్చేటప్పుడు రాతపూర్వక అగ్రిమెంట్లు ఉండేటట్టు చూసుకోవాలి. వాటిలో తమ రచనల అనువాద హక్కులకు ఆయా ప్రచురణకర్తలు ప్రాతినిధ్యం వహించేలా అనుమతి ఇస్తే తెలుగు రచనలను ఇలాంటి వేదికలపైకి తీసుకువెళ్ళి మాట్లాడ్డానికి వీలవుతుంది. లిటరరీ ఫిక్షన్ ప్రచురించే ఫ్రెంచ్ ప్రచురణకర్తలు తమ పాఠకులకు తెలియని కొత్త రచయితను ప్రచురణకు ఎంచుకునేటప్పుడు వారి కథలను కాకుండా నవలలనే ఎంచుకుంటామని చెప్పారు. నవలల తోపాటు మహిళల జీవితాలను ప్రతిబింబించే ఆత్మకథనాలపై కూడా ఆసక్తి చూపారు. బాల సాహిత్యం (ముఖ్యంగా బొమ్మల పుస్తకాలు), యంగ్ అడల్ట్ ఫిక్షన్ కూడా వారు తీసుకోడానికి ఇష్టపడుతున్నారు.

ఈ సమావేశానికి తెలుగు నుంచి ఎలమి ప్రచురణలు, ఛాయా బుక్స్ హాజరయ్యాయి. పోయిన ఏడాది జరిగిన బుక్ బ్రహ్మ లిటరరీ ఫెస్టివల్లో కేవలం భారతీయ ప్రచురణకర్తలం మాత్రమే సమావేశమయ్యాం. ఈసారి అంతర్జాతీయ ప్రచురణ సంస్థలతో కలిసి మాట్లాడే అవకాశం చిక్కింది. మన సాహిత్యం వైపు ఈ ప్రచురణకర్తలు ఆశగా చూస్తున్నారని అర్థమైంది. మన రాజకీయ సామాజిక పరిస్థితులు, అందులోంచి పుట్టుకొస్తున్న సాహిత్యం గురించి చక్కగా 'పిచ్' చేయగలిగితే మనకీ అవకాశాలు వస్తాయి. వాళ్ళ పుస్తకాలను మనం అనువాదం చేయాలంటే కాపీరైట్లు, రాయల్టీ ఖర్చులు చూసుకోవాలి. కొన్ని ప్రాజెక్టులకు గ్రాంట్స్ ఉన్నాయి. అవి మంజూరు అయితే ప్రచురణకర్తలపై భారం తగ్గుతుంది.

ఇక భాషలు నేర్చుకునే ఆసక్తి ఉన్నవారు ఫ్రెంచ్, స్పానిష్, జర్మన్ లాంటి యూరోపియన్ భాషలు నేర్చుకోగలిగితే అనువాద అవకాశాల్ని చేజిక్కించుకోవచ్చు. ప్రచురణకర్తలకు ఇచ్చే గ్రాంట్స్ కన్నా అనువాదకులకు గ్రాంట్స్ కాస్త ఎక్కువగా ఉన్నట్టు అనిపించాయి. మూల భాష నుంచి నేరుగా అనువాదం చేయగలిగే వారికి ఎప్పుడూ ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుంది. అయితే, తెలుగు–ఫ్రెంచ్ లేదా ఫ్రెంచ్–తెలుగు నుంచి చేయదగిన పుస్తకాల సంఖ్యతో పోల్చుకుంటే ఈ రెండు భాషల్లో ప్రావీణ్యత ఉన్న అనువాదకులు తక్కువ కాబట్టి, మధ్యే మార్గాన ఇంగ్లీషు నుంచి చేసే అనువాదాల పట్ల కూడా ఈ ప్రచురణకర్తలు సుముఖంగానే ఉన్నారు.

"దేశ విదేశ భాషల్లో మన సాహిత్యం ఎందుకు వెళ్ళడం లేదు?" అంటూ ఆవేశపూరితమైన ప్రశ్నల దగ్గర ఆగిపోకుండా, ఎలాంటి అవకాశాలు ఉన్నాయో తెలుసుకుని, వాటి కోసమై రచయితలు, అనువాదకులు, ప్రచురణకర్తలు కలిసి పని జేస్తే ఫలితాలు కనిపించవచ్చు.

■ పూర్ణిమ తమ్మిరెడ్డి
purnimat07@gmail.com

ముద్దులు

ఏటొడ్డున గులాబి వన్నెలో పూసే సముద్ర పాలాకు పూలు. ఒంకిని గుంటలో విరిసే తెల్ల తామరలు నీకు ముద్దు.

తూర్పు కనుపూరు ముత్యాలమ్మ జాతరలో
తీసిచ్చిన బంగారు చుక్కల నీలపు మట్టి గాజులు. నాయుడుపేటలో కొన్న రవ్వలంత అద్దాలు కుట్టిన చిలకపచ్చ రంగు కెంజాయ అంచు చున్నీ. తూపిలిపాళెం కడలొడ్డున అలలు మనల్ని దొర్లిస్తుండగా దొరికిన పాల తెలుపు చిన్న శంకు నీకు ముద్దు.

నా చేతిపైన మనిద్దరి పేర్ల తొలి అక్షరాల పచ్చబొట్టు. నా ఎడమ చెవికి పెట్టుకున్న తెల్లరాయి పుడక. జడల్లి పూలు పెట్టేదా అంటూ మెడదాకా పెంచుకున్న నా జుట్టులో వేళ్లు జొనిపి సుకుమారంగా గుంజడము. గూడూరు సుందరమహల్లో కలిసి చూసిన చంటి సినిమా ఇలా అప్పట్లో నీకు మన కలయికలోని ప్రతి ఒకటీ ముద్దు.

ఒక నా పుట్టినరోజు సాయంత్రం నుదుటన నువ్విచ్చిన చిన్నప్పటి మా అమ్మ ముద్దు. ఆ రాత్రి చీకటిలో ఏటి ఇసుకపైన నీ నిలువు పెదాలను నా పెదాలకు అప్పగించిన ముద్దు.

రేపట్నుంచి నీకు కనబడనంటూ వెక్కిళ్లతో – గుండెలు పగిలిన కట్టెకు నువ్విచ్చిన చితి కౌగిలి ముద్దు.

కలలన్నీ బూడిదై చివరికి మిగిలిన ఒంటూపిరి బతుక్కి నీ తలపోతల తపనలే కన్నీటి జడిలో విరిసి మెరిసే వానవిల్లు ముద్దు.

■ ఫిరోజ్ చిగురుపాటి

సోమవారం 10 ఫిబ్రవరి 2025

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

స్త్రీని మించిన ఇతివృత్తం లేదు

తెలుగులో ఉత్తరాంధ్ర సాహిత్యానికి ప్రత్యేకమైన విభిన్నత ఉంటుంది. ఈ ప్రాంత భౌగోళికతకు, జీవన విధానానికి కొంత సంఘర్షణ ఎక్కువ. ఆ సంఘర్షణను, ఆర్తిని కవితా వాహికగా నిబద్ధతతో వెల్లడిస్తున్న రచయితల్లో **సాంబమూర్తి లండ** ఒకరు. కవిత్వం పట్ల ఆయన దృక్పథాన్ని, జీవితాన్ని యుద్ధానికి ఉపమానంగా వాడడం వెనుక ఉన్న భావనని ఆయన మాటల్లోనే తెలుసుకొందాం.



మీ కుటుంబ నేపథ్యం గురించి, సాహిత్య ప్రేరణల గురించి చెప్పండి?

నిజానికి మేం సముద్రం పిల్లలం (మత్స్యకార సామాజిక వర్గం). కానీ, నాన్నకు ముందు మూడు తరాలుగా మట్టితో అనుబంధం పెంచుకున్న దిగువ మధ్యతరగతి కుటుంబం. మార్క్స్‌ను చదివిన పోతన నాన్న. అప్పట్లో మాది రెండున్నర ఎకరాల జీడిమామిడి, కొబ్బరి, పనస, మునగ తోటల ఉద్యానవనం. టీచర్‌గా ఉద్యోగం వచ్చినా ఎమ్మెస్సీ చదువుకుంటానంటే కాదనలేనంత ఇష్టం నాన్నకు చదువు మీద.

బాల్యంలో లాంతరు వెలుగుల మధ్య నాన్న చదివి వినిపించిన కాల్పనిక సాహిత్యం నాలో అక్షరాల్ని విత్తాయి. ఆ విత్తనాలు ఉత్తరాంధ్ర బతుకు విధ్వంస ప్రతిఘటనకు దారి చూపాయి. అమ్మ మిగిల్చిపోయిన ఖాళీ తక్షణం నన్ను అక్షరంగా మలిచింది. 'గాజు రెక్కల తూనీగ', 'నాలుగు రెక్కల పిట్ట', 'ఆమెకు మిగలని ఆమె' కవితా సంపుటాలుగా ఇప్పటికి మూడు ఆకులు తొడిగాను. పగళ్లు స్కూల్లో పిల్లలకు పాఠాలు చెబుతూ... రాత్రులు కళ్ళల్లో దివిటీలు వెలిగించుకుని నన్ను నేను వాక్యాలుగా అనువదించుకోవడం మొదలై ఎనిమిదేళ్ళు.

కవిత్వాన్ని మీరు ఎలా నిర్వచించుకుంటారు?

నది ఇంకిన చోట ఒక తడి మేఘపు వాగ్దానం కవిత్వం. జడత్వం నిండిన కాలం ముఖం మీద నీళ్ళు కుమ్మరించి మేల్కొలిపే బాధ్యత. భయంతో నాలుకలన్నీ పిడచగట్టుకు పోయినపుడు నిశ్శబ్దాన్ని చీల్చుకుని మొలకెత్తే చైతన్యపు విత్తు. కవిత్వమంటే అదృశ్య సముద్రం మీద వేట. కనబడని అరణ్యంలో కావాలనే తప్పిపోయి, భుజానికి ఒక వాక్యాన్ని తగిలించుకుని ఇల్లు చేరడం.


మీ కవిత్వ శీర్షికలలో ఎక్కువగా 'రెక్కల' ప్రస్తావన ఎక్కువ ఉంటుంది, ఎందుకు?

బాల్యంలో ఇంటికీ బడికీ ఇంచుమించు కిలోమీటర్ దూరం. పదోతరగతి వరకూ కాళ్ళు దిగబడే ఇసుకదారిలో రోజుకు నాలుగుసార్లు నడవాల్సి వచ్చేది. అప్పుడంతా చేతుల్ని రెక్కల్లా ఊపుకుంటూ ఎగురుతున్నట్టు కలలొచ్చేవి. రెక్కలమీద ప్రేమ అలా మొదలైందేమో. రెక్కలు అన్నవి నా బాల్యం నాకిచ్చిన శైలీ ముద్ర అనుకోవచ్చేమో మరి.

మీ రచనల్లో జీవితం మీద యుద్ధం చెయ్యాలనే స్ఫూర్తి ఎక్కువగా కనపడటానికి కారణం మీరు టీచర్ కావటం అనుకోవచ్చా?

ఇప్పుడున్నదంతా సంక్షుభిత కాలం. వచ్చేది ఎడతెగని విధ్వంస రుతువు. మనుషుల మధ్య అనుబంధాలను చంపేస్తున్న గ్లోబలైజేషన్, వ్యక్తిగత జీవితాల్లోకి చొచ్చుకు వచ్చిన సోషల్ మీడియా, అన్నింటా పెరిగిన వేగం... వంటి అనూహ్యతల వల్ల మనిషి సహజ సున్నితత్వాన్ని కోల్పోయి అతి సున్నితత్వానికి చేరుకొంటున్నాడు. ఇది సున్నితత్వం లేకపోవడం కంటే ప్రమాదం. అటువంటప్పుడు ఎవరైనా యుద్ధాన్నే బోధించాలి. తెలంగాణాలో ఇంటర్ పిల్లల ఆత్మహత్యల నేపథ్యంలో 'ఇంకొంచెం యుద్ధాన్ని ప్రేమించు', చిన్నవిషయాలకే కలత చెందే నేటి అమ్మాయిలకు 'యుద్ధం నాకు కొత్తకాదు' వంటి కవితలు రాశాను. దీని వెనుక నాలోని టీచర్ కంటే మానసిక సన్నద్ధత కోసం అక్షరాల్ని వాడే రచయిత ప్రభావమే ఎక్కువ ఉందనుకొంటాను.

పొద్దున లేచిన్నుంచీ తిరిగి కళ్ళు మూతలు పడే దాకా ఎందరో స్త్రీలు కనుపాపల మీదుగా నడిచిపోతుంటారు. ఊరికే నడిచిపోరు. కనుపాపల మీద లోతైన గాయాలను మిగిల్చిపోతారు. అనేకానేక స్త్రీల ఒకానొక ప్రతిఫలనం 'ఆమెకు మిగలని ఆమె'. జీవితంలో ఇప్పటివరకూ నాకు తారసపడిన ప్రతి నీడకూ అక్షరాలతో బొమ్మ కట్టాలని చూసాను.



మీ మూడో కవితా సంపుటిగా వెలువరించిన 'ఆమెకు మిగలని ఆమె' గురించి చెప్పండి?

పొద్దున లేచిన్నుంచీ తిరిగి కళ్ళు మూతలు పడే దాకా ఎందరో స్త్రీలు కనుపాపల మీదుగా నడిచిపోతుంటారు. ఊరికే నడిచిపోరు. కనుపాపల మీద లోతైన గాయాలను మిగిల్చిపోతారు. అనేకానేక స్త్రీల ఒకానొక ప్రతిఫలనం 'ఆమెకు మిగలని ఆమె'. జీవితంలో ఇప్పటివరకూ నాకు తారసపడిన ప్రతి నీడకూ అక్షరాలతో బొమ్మ కట్టాలని చూసాను.

ఈ కవితా సంపుటి మొత్తం స్త్రీ కేంద్రంగా రాయడానికి కారణం?

ఏ స్థల కాలమాన పరిస్థితుల్లోనైనా ఆమె బాధిత. గాయాలతో అవమానాలతో అనుమానాలతో సంకెళ్ళతో వున్న ఆమె రూపం ప్రతిసారీ గుండెను ఛిద్రం చేస్తూనే వుంటుంది. ఎప్పుడూ ఆమెను ఓడించాలని చూసే ప్రపంచాన్ని ఎలా ఇష్టపడతాను? వాక్యాల్ని పట్టుకుని ఎదురు నిలబడ్డాను. ఆమె విషయంలో జరుగుతున్నదంతా అన్యాయమేనని చేస్తున్నదంతా నమ్మకద్రోహమేనని చెప్పాలనుకున్నాను.

జీవితంలో తారసపడ్డ స్త్రీలు నన్ను మరింత సున్నితంగా మార్చకపోతే బహుశా ఈ ప్రత్యేక సంపుటి లేదు. సమాజంలో ఇప్పటికీ ఆమె ద్వితీయ శ్రేణి పౌరురాలిగానే పరిగణించబడడాన్ని జీర్ణించుకోలేను. మొగ్గల నుండి రేపో మాపో రాలిపోయే పువ్వుల దాకా జరుగుతున్న లైంగికదాడులు, అత్యాచార పర్వాలు, నగ్న ఊరేగింపులు సిగ్గుతో తలదించుకునేలా చేస్తాయి. సమాజంలో ఉన్న ద్వంద్వ ప్రమాణాలు నిర్ఘాంతపరుస్తాయి. స్త్రీని దేవతను చేసి కూర్చోబెట్టి రాజ్యాలను ఏలుకునే కుట్రలను బద్దలు కొట్టాలనిపిస్తుంది. కవిత్వంలో ఓల్గా, కొండేపూడి నిర్మల, మహెజబీన్‌ల నుండి అందుకున్న ప్రేరణ వుంది. స్త్రీకి మించిన విశాల ఇతివృత్తం లేదు.

ఉత్తరాంధ్ర కవిత్వ నేపథ్యంలో మీ కవిత్వాన్ని ఎలా చూస్తారు?

నా ముందూ నా తర్వాతా సాగే యుద్ధానికి మధ్యలో కొనసాగింపు కావాలి నేను. పదే పదే కట్లు తెంపుకుని చేను మీద పడుతున్న పశువుల మందతో ప్రమాదం ఎప్పుడూ పొంచే ఉంటుంది. బతుకుల్ని చెరిపేయడానికి ఒక తుఫాను ఎప్పుడూ ప్రణాళికలు రచిస్తూనే వుంటుంది. తీరంలో ప్రమాద హెచ్చరికలా నిలబడాలి. ఆ దిశగానే సాగుతున్నాను. ఈ ప్రయాణంలో ఒంటరిని కాదు. మా ముందుతరం దీపధారై నడుస్తోంది. ప్రతిభ, అధ్యయనం, సొంత గొంతూ వున్న వర్తమానతరం వారసత్వాన్ని రెండు చేతులతో అందుకుంది. ఉత్తరాంధ్ర కథకులు, కవులలో ప్రక్రియ, శైలీ, శిల్పం వేరు వేరు కావచ్చు. కానీ వారు చిత్రించే కళింగాంధ్ర సాహితీ ఆత్మ మాత్రం ఒక్కటే. ఈ నేలలో పుట్టిన ఏ కవీ కథకుడూ నిద్రపోవడానికి లేదు. నిరంతరం మెలకువగానే ఉండాలి.

ఇంటర్వ్యూ ■ సారిపల్లి నాగరాజు, బి. మదన మోహన్ రెడ్డి
✆ 80083 70326

ముగ్గురు కవుల సప్తతి సభలు

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాలు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త నిర్వహణలో ఫిబ్రవరి 16 ఉదయం 10గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో కందుకూరి శ్రీరాములు, నందిని సిద్దారెడ్డి, నాళేశ్వరం శంకరం... ఈ ముగ్గురు కవుల సప్తతి సభ జరుగుతుంది. ముఖ్య అతిథి దేశపతి శ్రీనివాస్. సభలో కొండపల్లి నీహారిణి, బైస దేవదాస్, మామిడి హరికృష్ణ, దేవి ప్రసాద్ నరేష్ చారి తదితరులు పాల్గొంటారు.

బెల్లంకొండ సంపత్ కుమార్.

భూతపురి సాహిత్య పురస్కారం

భూతపురి సుబ్రహ్మణ్యశర్మ 88వ జయంతి సందర్భంగా 23వ సాహిత్య పురస్కార ప్రదానోత్సవం ఫిబ్రవరి 16 ఉదయం 10 గంటలకు సి.పి. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం, కడపలో జరుగుతుంది. పురస్కార గ్రహీత పుత్తా పుల్లారెడ్డి రూ.10,116 నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను స్వీకరిస్తారు. సభకు అధ్యక్షుడు జి. విశ్వనాథ కుమార్, ముఖ్య అతిథి కె. కృష్ణారెడ్డి, ప్రధానవక్త శలాక రఘునాథ శర్మ

భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి

కళింగాంధ్ర కవితలకు ఆహ్వానం

కళింగాంధ్ర కవుల కవిత్వంతో సిక్కోలు బుక్ ట్రస్ట్ తెస్తున్న వార్షిక సంచిక కోసం ప్రింట్ లేదా ఆన్‌లైన్ పత్రికలలో 2024లో ప్రచురితమైన తమ కవితలలో నచ్చిన రెండు కవితలను ఈమెయిల్: sikkolu books@gmail.com లేదా వాట్సాప్: 99892 65444కు ఫిబ్రవరి 20 లోగా పంపాలి. వార్షిక కవితా సంకలనంతో పాటు కళింగాంధ్ర కవుల డైరక్టరీని కూడా ప్రచురిస్తున్నందున వర్తమాన కళింగాంధ్ర కవులు పేరు, ఫోన్ నెంబర్లను నమోదు చేసుకోవలసిందిగా విజ్ఞప్తి.

సిక్కోలు బుక్ ట్రస్ట్

కథలకు ఆహ్వానం

నవమల్లెతీగ సాహిత్య మాసపత్రిక 18వ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా తెస్తున్న కథల ప్రత్యేక సంచిక కోసం ఎ4 సైజులో 3–4 పేజీల కథలను ఫిబ్రవరి 27లోపు యూనికోడ్ లేదా డీటీపీతో పంపాలి. ఈమెయిల్: malleteega@gmail.com; చిరునామా: నవమల్లెతీగ మాసపత్రిక, 6164, టి.ఎఫ్–1, శుభశ్రీ టవర్స్, ఉయ్యూరు జమీందారు స్ట్రీట్, గాంధీనగర్, విజయవాడ–520003. ఫోన్: 92464 15150.

కలిమిశ్రీ

ఇవి హృదయం లెక్కలు

తాటిశెట్టి రాజు గారి 'ఏకాంతం' కవితను ఇటీవలి నా ప్రియపద్యంగా విశ్లేషణకు ఎంచుకున్నాను. ప్రేమలో ఉండే స్వచ్ఛత, నిజాయితీతో కూడిన కవి భావ ప్రకటన... అదే ఈ కవిత ఆకట్టుకోడానికి ముఖ్య కారణం. ఈ కవితలో మొదటి మూడు స్టాంజాలు మూడ్‌ని రిఫ్లెక్ట్ చేసే వాతావరణాన్ని వర్ణిస్తే, తర్వాతి పేరాలు కవి భావనని తెలియ జేస్తాయి. మన మనసుని బట్టే చుట్టూ వాతావరణం కనిపిస్తుంది. నిజానికి ఏది చీకటి? ఏది వెలుగు? ప్రతీదీ మన భాష్యమే! ప్రతీదీ మన అన్వయమే! మన అనుభూతులు మనతో ఆడుకునే ఆటల దృశ్యాలే అన్నీ!



ప్రేమ ఒక వరము, ఒక శాపము. ఆశించడం, ఆక్రోశించడం జీవితంలో భాగాలు. ప్రేమతో నిండిన హృదయానికి, బండబారినపోయిన లోకం తీరు, దాని లెక్కలు ఒక మింగుడుపడని విషయం. అందుకే ప్రేమలో ఓడిపోయినా సరే, హృదయానికే పెద్ద స్థానమిచ్చి, ఓడినా ప్రేమదే గెలుపని చెప్పాడు కవి. ప్రేమ కలిగిన మనసు స్వచ్ఛమైనది. ఆ మనసు నుండీ పుట్టే దుఃఖాలు, వ్యథలు, కన్నీళ్ళు, కవిత్వాలు ఏవైనా సరే స్వచ్ఛమైనవీ, అర్థవంతమైనవీ, విలువైనవి!

బంధం రెండు హృదయాలను కలిపే వంతెన. అది విఫలమై, ఒంటరైన హృదయంలో ప్రేమ అనాథ, బిచ్చగత్తె! లేదా లాభనష్టాల బేరీజు లోకంలో ప్రేమ దిక్కులేని అనాథ! రెండు హృదయాల మధ్య తాళ గతులు తప్పితే పొసగని బంధాలలో ప్రేమ అనాథ! మనిషి చుట్టూ ఉండే రకరకాల పరిస్థితులతో, ప్రేమకివ్వలేని విలువతో ప్రేమ అనాథ!

ప్రేమను కోల్పోయాక మళ్ళీ ప్రేమ కోసమే పరితపిస్తాడు మనిషి. అలా ప్రేమ వెతుకులాటలో మనుషుల స్వభావాల గురించి గమనింపులేనితనంలోనో, లేదా రెండు మనసుల మధ్య సామరస్యం కుదరకో పొలమారటం, పోగొట్టుకోవటం జరిగిపోతాయి. తిరిగి మరో ప్రేమ కోసమో, భరోసా కోసమో వెతుకులాట మొదలవుతుంది.

అంతులేనంత ప్రేమతో ఈ ప్రపంచం నిండి ఉంది. ఎన్నో బంధాలు మనిషిని పెనవేసుకునే ఉన్నాయి. అయినప్పటికీ తనకి తాను మాత్రమే మిగిలే ఒంటరితనం మనిషిని వెంటాడుతూనే ఉంటుంది, చివరికి ఆ ఒంటరితనమే మిగులుతుంది చాలాసార్లు. ఇదే తాత్వికతతో ఈ కవిత ముగుస్తుంది.

■ రాళ్ళబండి శశిశ్రీ
✆ 74163 99396

ప్రియ పద్యం



ఏకాంతం

కిటికీ లోంచి వచ్చి పడుతున్న చీకటితో
గదిలో గుడ్డిదీపం తగాదా పడుతోంది

దూరంగా ఎక్కడో కురుస్తున్న వర్షాన్ని
వెక్కిరింతగా మా ఊరికి ఉరుమి చెప్తోంది నింగి
పగటిపోరాటంలో గెలవలేని ఓ బక్కకుక్క
రాత్రి చీకట్లో పౌరుషంగా రంకెలేస్తోంది
వీధిలో ఒంటరిగా

లాభనష్టాలు లోకం లెక్కలు
ప్రేమ – విరహం హృదయానివి

ప్రేమలో ఓడిపోనీ
అది లోకంలో విజయాలన్నిటి కంటే విలువైనది

ఒట్టి వ్యథ, దుఃఖం, కన్నీళ్ళు, కవిత్వం
ప్రేమ వల్ల అర్థవంతమయ్యాయి

ప్రేమకోసం లోకంలో వెతుకుతున్నావా?
పాపం అది ప్రేమలో అనాథ బిచ్చగత్తె

పొలమారి గొంతు అడ్డం పడ్డప్పుడు
అన్నీ నీళ్ళ కుండలుగానే తోస్తాయి
లోపల ప్రేమ పొలమారినప్పుడే
మనసు మరో మనసు కోసం తడుముకుంటుంది

వచ్చిపోయే వలసపక్షుల గుడారం–చెట్టుకి
దాని నీడ మాత్రమే తన శాశ్వత తోడని
ఎవరూ చెప్పనక్కర్లేదు

■ తాటిశెట్టి రాజు



కరుణించు మేరీమాత

ఘనంగా గుణదల తిరునాళ్లు ప్రారంభం

మొదటిరోజు పోటెత్తిన భక్తులు









గుణదల కొండ వెలుగుల్లో భక్తుల ప్రత్యేక ప్రార్థనలు (ఇన్‌సెట్‌లో) మరియమాత

గుణదల మేరీమాత 101వ మహోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు, వికర్ జనరల్ ఫాదర్ మేశపాం గాబ్రియేలు తదితర గురువులు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అంతకుముందు గుణదల పురవీధుల్లో మేరీమాత తేరు ప్రదక్షిణ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం కావడంతో ప్రార్థనామందిరంతో పాటు మేరీమాత గుహ, శిలువ మార్గంలో భక్తులు కిటకిటలాడారు. 6లో



నేత్రపర్వం

వైభవంగా వీరమ్మ తల్లి ఊయల ఉత్సవం

- తిరుగుగుడ దీపాలతో దేదీప్యమానంగా వెలిగిన ఉయ్యూరు
- ప్రధాన రహదారిలోని ఆలయంలో కొలువుతీరిన అమ్మవారు

6లో

అవే తప్పులు

భూముల రీసర్వేలో మళ్లీ గత తప్పిదాలే చోటుచేసుకుంటున్నాయి. క్షేత్రస్థాయిలో సర్వేయర్ల నిర్లక్ష్యం, నిర్వాకాల కారణంగా సర్వే నెంబర్ల రీ ఫిక్సేషన్‌ను సరిగ్గా చేయట్లేదని రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా కాకుండా, గ్రామ సర్వేయర్ల ఇష్టారాజ్యంగా రీసర్వే జరగటం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

భూముల రీసర్వేలో గ్రామ సర్వేయర్ల నిర్వాకాలు

టార్గెట్లు నిర్దేశించకున్నా హడావిడిగా పనులు

- సర్వేలో భూమి ఎక్కువగా తేలితే బేరాలు
- క్షేత్రస్థాయిలో పరిశీలన లేకుండానే లెక్కలు
- గూగుల్ మ్యాప్ ఆధారంగా అస్తవ్యస్తంగా..
- అర్జీలు పరిష్కారమయ్యాయని సంతకాలకు డిమాండ్
- లబోదిబోమంటున్న భూ యజమానులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలోని భూముల రీసర్వే కొత్త సమస్యలు తెచ్చి పెడుతోంది. గ్రామ సర్వేయర్లు బేరాలు పెట్టడం మొదలుపెట్టేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరపకుండా సర్వే నెంబర్‌ను, అందులోని సబ్ డివిజన్స్ పరిధిలోని భూములను పరిశీలించకుండా, కనీసం రైతులతో కూడా మాట్లాడకుండా పని కానిచ్చేస్తున్నారు. గూగుల్ మ్యాప్ ఆధారంగా ఓ అంచనాకు వచ్చి, ఆ భూమి నాలుగు వైపులా కొలతలు తీసుకుని రీసర్వే చేసేస్తున్నారు.

సమస్యలు ఇలా..

భూముల శిస్తుల కోసం బ్రిటీషు కాలంలో బీ నెంబర్లు ఇచ్చారు. 1925లో సరిహద్దు బౌండరీల చట్టం ఏర్పడ్డాక రీ సర్వే ప్రారంభమైంది. ఒక సర్వే నెంబర్‌లో గరిష్టంగా 20 ఎకరాల్లోపు ఉంటుంది. మాగాణి అయితే 10, మెట్ట అయితే 20 ఎకరాల్లోపు ఉంటుంది. రీ సర్వేలో ముఖ్యంగా సదరు సర్వే నెంబర్‌లో ఎంతమంది ఉన్నారు, విస్తీర్ణం ఎంత.. అనేది రీ ఫిక్సేషన్ చేయాలి. ఇది ఎంత సమర్థవంతంగా చేయగలిగితే రీసర్వే అంత చక్కగా ఉంటుంది. నిర్ణీత పరిమాణం కంటే భూమి ఎక్కువ ఉంటే.. ఆ సర్వే నెంబర్ పరిధిలోని వారికే తలా కొంత పంచుతూ సర్దుబాటు చేయాలి. కానీ, కొంతమంది సర్వేయర్లు ఆ మిగులు భూమిని వేరే సర్వే నెంబర్‌లోని వారికి కలపటానికి బేరాలు కుదుర్చుకుంటున్నారు. ఒకచోట ఉన్న ఎక్కువ భూమిని మరో సర్వే నెంబర్‌లోని తాను బేరం కుదుర్చుకున్న సబ్ డివిజన్ హోల్డర్‌కు కలిపితే రీసర్వేలో శాస్త్రీయత కనిపించదు. ఎక్కువ, తక్కువలు రావటానికి మిగతా 6లో..

రైతులపై సర్వేయర్ల ఒత్తిడి

కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అడ్డగోలు సర్వేతో రైతుల భూములకు సంబంధించి చాలా వివాదాలు తలెత్తాయి. ఎన్టీఆర్ జిల్లాలోనే 3 వేల వరకు రైతుల నుంచి ప్రజా ఫిర్యాదుల వేదికకు ఫిర్యాదులు అందాయి. కృష్ణాజిల్లాలో పరిస్థితి కూడా అదే. మొత్తంగా 6 వేల వరకు అర్జీలు అందాయి. వీటి పరిష్కారం రెవెన్యూ అధికారులకు తలనొప్పిగా మారింది. ఆరు నెలలుగా బాధితులు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఏ ప్రయోజనం లేదు. కాగా, ఈ అర్జీలను పరిష్కరించాల్సిన అధికారులు రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. మీరు పెట్టిన అర్జీలు పరిష్కారమయ్యాయని సంతకం చేసి ఇవ్వాలంటున్నారు. ఇలా చేస్తే పెండింగ్ శాతాన్ని తగ్గించుకోవచ్చన్నది వీఆర్వోలు, సర్వేయర్ల అభిప్రాయం. కానీ, ఇలాంటి అర్జీలకు సంబంధించి కూడా రీసర్వే చేస్తే సమస్య పరిష్కారమవుతుంది. ఆ పని మాత్రం చేయట్లేదు. గ్రామానికో సర్వేయర్ ఉన్నా సమస్యను ఎందుకు పరిష్కరించటం లేదో అర్థంకాని పరిస్థితి. ఈ అంశాలపై రెండు జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు సీరియస్‌గా దృష్టి సారించకపోతే రైతుల్లో అసంతృప్తి పెరిగే అవకాశముంది.

తిట్టుకో.. తన్నుకో..

పశ్చిమ వైసీపీలో రచ్చకెక్కిన విభేదాలు

వైసీపీ పశ్చిమ నేతల కోల్డ్‌వార్ ఒక్కసారిగా భగ్గుమంది. వైసీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డి ముందే వెలంపల్లి శ్రీనివాసరావు, షేక్ ఆసిఫ్ దాదాపు కొట్టుకునేంత వరకు వెళ్లారు. అరుపులతో మొదలై.. ఒకరినొకరు దూషించుకున్నారు. సుబ్బారెడ్డి సర్దుబాటు చేసే ప్రయత్నం చేసినా వీలు పడలేదు. దీంతో సయోధ్య సమావేశాన్ని అర్ధాంతరంగా వాయిదా వేసి ఇద్దరినీ వెళ్లిపోమని పంపించేశారు.

- సయోధ్య సమావేశంలో వెలంపల్లి, ఆసిఫ్ తిట్ల దండకాలు
- వైవీ సుబ్బారెడ్డి వారించినా తగ్గలేదు
- తొలుత తిట్లు.. ఆ తర్వాత కొట్టుకునే వరకు..
- అర్ధాంతరంగా ఆగిపోయిన సమావేశం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో వైసీపీ నేతల మధ్య అంతర్యుద్ధం రచ్చకెక్కింది. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌లో అధికారపక్షంగా ఉన్న వైసీపీ కార్పొరేటర్లను కాపాడుకోవటానికి అధినేత జగన్ తాడేపల్లిలోని తన నివాసంలో విజయవాడ నగర నాయకులతో ఇటీవల సమావేశమైన సంగతి తెలిసిందే. ఈ సమావేశానికి పశ్చిమ నియోజకవర్గంలో వైసీపీ తరపున పోటీచేసి ఓటమి చెందిన షేక్ ఆసిఫ్ హాజరు కాలేదు. వెలంపల్లి శ్రీనివాసరావు ఏకపక్ష నిర్ణయాలు, దుందుడుకు వ్యవహారాలపై అంతకుముందే జగన్‌కు ఆసిఫ్ ఫిర్యాదు చేశారు. ఆసిఫ్ గైర్హాజరు కావడంతో ఇద్దరి మధ్య ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు సమావేశం నిర్వహించారు. ఇద్దరి మధ్య సయోధ్య కుదర్చాలని వైవీ సుబ్బారెడ్డికి జగన్ బాధ్యత అప్పగించారు.

తిట్ల పురాణం నుంచి తన్నుకునే వరకూ..

వెలంపల్లి శ్రీనివాసరావు, షేక్ ఆసిఫ్‌ను వైవీ సుబ్బారెడ్డి ఆదివారం తాడేపల్లి పిలిపించారు. వెలంపల్లి తన వెంట ఎమ్మెల్సీ రూహుల్లాను కూడా తీసుకెళ్లారు. ఆసిఫ్ మాత్రం ఒంటరిగానే వెళ్లారు. ఉదయం 11 గంటలకు మొదలైన సమావేశం మధ్యాహ్నం 3 గంటల వరకు సాగింది. సమావేశం మొదలైనప్పటి నుంచి వెలంపల్లి, ఆసిఫ్ మధ్య అరుపులు తప్ప మాటల్లేవు. తనకు పశ్చిమ నియోజకవర్గంలో ఏమాత్రం విలువ ఇవ్వటం లేదని తెలిపినట్టు తెలిసింది. దీనిపై వెలంపల్లి స్పందిస్తూ అందరినీ కలుపుకొనే వెళ్తున్నామని, సొంత కార్యక్రమాలు చేసుకుంటూ పార్టీకి దూరంగా ఉంటుంటే ఏం చేయగలమనడంతో వాదులాట ప్రారంభమైంది. ఈ గొడవ తిట్ల పురాణం అందుకునే స్థాయికి చేరింది. సుబ్బారెడ్డి వారించే ప్రయత్నం చేసినా వినలేదు. ఆసిఫ్ గట్టిగా ఎదురుదాడి చేస్తుండటంతో ఎమ్మెల్సీ రూహుల్లా కూడా జోక్యం చేసుకుని వెలంపల్లి తరఫున వాదించినట్టు సమాచారం. ఈ దశలో కొట్టుకునే పరిస్థితి రావడంతో సుబ్బారెడ్డి వారిని వారించే ప్రయత్నం చేశారు. చివరికి లాభం లేదని ఇద్దరిపై కోప్పడి బయటకు పంపించేశారు.

రైతు హత్య..?



శ్రీనివాసరావు (ఫైల్)

ములకలపెంటలో దారుణం

- భూ వివాదాలే కారణమా?

మైలవరం రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొర్సుమిల్లి శివారు ములకలపెంటలో ఓ రైతు అనుమానాస్పదంగా మృతిచెందినట్లు మైలవరం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై కె.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం ములకలపెంటకు చెందిన కడియం శ్రీనివాసరావు (57) శనివారం ఇంటికి రాకపోవడంతో, కుటుంబ సభ్యులు పొలానికి వెళ్లి చూశారు. ఆయన అక్కడ శవమై కనిపించడంతో హతాశులయ్యారు. గతంలో శ్రీనివాసరావు పొలంలో సుమారు 46 సెంట్లు పక్కనున్న రైతు పొలంలో కలిసినట్లు గత ప్రభుత్వంలో జరిగిన రీసర్వేలో రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. అయినా పక్క రైతు పొలం ఇవ్వకపోవడంతో రెవెన్యూ సదస్సులో శ్రీనివాసరావు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో ఇరు కుటుంబాల మధ్య వివాదాలు జరుగుతుండగా, శనివారం శ్రీనివాసరావు శవమై తేలడంతో ఇది హత్యేనంటూ ఆయన కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. మృతుడి శరీరంపై కత్తిపోట్లు కూడా ఉండటంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. కాగా, ఆదివారం ఉదయం ఇద్దరు అనుమానితుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పోస్టుమార్టం నిమిత్తం శ్రీనివాసరావు మృతదేహాన్ని మైలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మద్యం మార్గం

మద్యం షాపులే టార్గెట్‌గా వరుస చోరీలు

- తొలుత వన్‌టౌన్.. తర్వాత మంగళగిరి..
- తాజాగా బెంజిసర్కిల్ వద్ద..
- కౌంటర్లను కొల్లగొడుతున్న దొంగలు
- చడ్డీలు వేసుకుని, ముసుగులతో దొంగతనాలు

పగలంతా ఎక్కడ ఉంటారో తెలియదు. ఎక్కడెక్కడ తిరుగుతారో తెలియదు. చీకటి పడుతున్న సమయంలో రహదారులను వెతుక్కుంటూ బయటకొస్తారు. ఎక్కడ మద్యం దుకాణం కనిపిస్తే అందులోకి దూకుతారు. కౌంటర్లను ఖాళీ చేస్తారు. కొద్దిరోజులుగా వరుసగా ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో మద్యం దుకాణాల్లో సాగుతున్న చోరీల తీరిది. విజయవాడ, మంగళగిరి ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని ఈ చోరీలు జరుగుతున్నాయి. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో దుకాణాల్లోని కౌంటర్లను కొల్లగొడుతున్నారు. జనవరి 31 నుంచి శనివారం అర్ధరాత్రి వరకు జరిగిన ఘటనలకు సంబంధించిన సీసీ కెమెరాల ఫుటేజీలు ఈ విషయాలను తెలియజేస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ముఖానికి ముసుగు.. శరీరం నిండా నూనె.. అండర్‌వేర్ మాత్రమే వేసుకుని ఉన్న వీరిని చూస్తే చడ్డీగ్యాంగ్ గుర్తొస్తుంది. రెండేళ్ల క్రితం చడ్డీగ్యాంగ్ నగరంలో వరుసగా అపార్ట్‌మెంట్లలో చోరీలకు దిగగా, పోలీసులు మధ్యప్రదేశ్‌కు వెళ్లి అక్కడి నుంచి కొంతమంది చడ్డీగ్యాంగ్ సభ్యులను లాక్కొచ్చారు. ఇప్పుడు అదే పోలికలతో ఉన్న నిందితులు మద్యం షాపుల్లో చోరీలకు దిగుతున్నారు. మద్యం దుకాణాలకు పక్కన ఉండే చిన్నచిన్న సందుల్లోకి వెళ్లి షాపు పైభాగాన ఉండే రేకును కట్ చేస్తున్నారు. ఆ కన్నం నుంచి నెమ్మదిగా షాపులోకి దిగుతున్నారు. క్యాష్ కౌంటర్‌లో ఉన్న మొత్తాన్ని ఒక కవర్‌లో వేసుకుంటున్నారు. కౌంటర్లకు తాళాలు వేసి ఉంటే పగలగొడుతున్నారు.

బెంజిసర్కిల్ వద్ద మద్యం షాపులో చోరీ

శనివారం అర్ధరాత్రి బెంజిసర్కిల్ వద్ద ఉన్న మద్యం షాపులోకి ఓ వ్యక్తి ఇలాగే ప్రవేశించాడు. జనవరి 31న సితార సెంటర్, మంగళగిరిలో ఉన్న మద్యం దుకాణాల్లోకి ఈ విధంగా దిగారు. ఈ మూడు షాపుల్లో చోరీ చేసిన



సితార సెంటర్, బెంజిసర్కిల్ వద్ద చోరీ దృశ్యాలు

వ్యక్తుల అవతారాలు ఒకేలా ఉన్నాయి. ఈ ముగ్గురు ఒకే గ్యాంగ్‌గా ఉంటున్నారన్న అనుమానం వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు చోరీలు జరిగిన షాపుల్లోకి నిందితులు సరిగ్గా అర్ధరాత్రి 1-2 గంటల మధ్య దిగినట్టు సీసీ కెమెరాల్లోని ఫుటేజీని బట్టి తెలుస్తోంది. బెంజిసర్కిల్ మద్యం షాపులోని కౌంటర్ నుంచి రూ.20 వేలు దొంగిలించారు. సితార సెంటర్ వద్ద జరిగిన చోరీలోనూ ఇంతే మొత్తాన్ని చోరీ చేశారు. మంగళగిరిలోని మద్యంషాపు నుంచి మిగతా 6లో..

గీత షాపులకు 621 దరఖాస్తులు

- ఎన్టీఆర్‌లో 335..కృష్ణాకు 286
- షాపుల కేటాయింపు డ్రా వాయిదా
- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఎఫెక్ట్

6లో



నాట్యమయూరాలై..

ముగిసిన సిద్ధేంద్రయోగి జయంత్యుత్సవాలు



ఊరేగుతున్న వీరమ్మ, గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా వీరమ్మ గ్రామోత్సవం

● మెట్టినింటి నుంచి ఆలయానికి చేరిన అమ్మవారు

ఉయ్యూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వీరమ్మతల్లి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రావిచెట్టు సెంటర్ సమీపాన మెట్టినింటి నుంచి శనివారం రాత్రి బయలుదేరిన అమ్మవారు మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ, తిరుగు గండదీపాల భక్తులు వేలాది మంది వెంట రాగా పురవీధుల్లో ఊరేగారు. అమ్మవారికి దీపారాధన చేసి, పసుపు కుంకుమ అందించి, పల్లకీ వెంట వేలాది భక్తులు నడిచారు. గ్రామోత్సవం అనంతరం ఊయల స్తంభాల వద్ద ఊయలలూగి ప్రధాన రహదారిపై ఉన్న ఆలయానికి ఆదివారం రాత్రికి అమ్మవారు చేరుకున్నారు.

నేత్రపర్వం

ఉయ్యూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : వీరమ్మతల్లి ఊయల ఉత్సవం భక్తజనసందోహం నడుమ ఆదివారం నేత్రపర్వంగా సాగింది. 15 రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి మెట్టినింటి నుంచి బయలుదేరిన అమ్మవారు నగర వీధుల్లో వైభవంగా ఊరేగి ప్రధాన సెంటర్ సమీపంలోని ఊయల స్తంభాల వద్దకు చేరుకున్నారు. కన్నుల పండువగా ఊయల ఉత్సవం జరుపుకొన్నారు. భారీగా తరలివచ్చిన భక్తులతో ఉయ్యూరు జనసంద్రంగా మారింది. ప్రధాన సెంటర్‌తో పాటు అమ్మవారి ఆలయం, కాటూరు రోడ్డు, బస్టాండ్ రోడ్లు కిక్కిరిశాయి. తిరుగుగండ దీపాలతో ఉయ్యూరు దేదీప్యంగా వెలిగింది. ఊయల ఉత్సవం అనంతరం అమ్మవారు ప్రధాన రహదారిలోని ఆలయంలో కొలువుతీరారు. అక్కడి నుంచి భక్తులకు దర్శనమిస్తున్నారు.

తొక్కిసలాట.. త్రుటిలో తప్పిన ప్రమాదం

ఊయల ఉత్సవంలో తొక్కిసలాట జరగగా, త్రుటిలో పెద్దప్రమాదం తప్పింది. ఈ ఘటనలో పలువురు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. అమ్మవారి పల్లకీ ఊయల స్తంభాల వద్దకు వస్తున్న తరుణంలో పోలీసుల రోప్‌వే వైపు నుంచి కాకుండా బారికేడ్లు ఉన్న వైపు నుంచి భక్తులు ఒక్కసారిగా రావడంతో తోపులాట జరిగింది. బారికేడ్ల కిందపడి మహిళలు గాయపడ్డారు. అక్కడే ఉన్న పోలీసులు కిందపడిపోయిన వారిని లేపి పరిస్థితి చక్కదిద్దారు.



గుడివాడ అక్కినేని నాగేశ్వరరావు కళాశాల 1971-1978 బ్యాచ్

అపూర్వ సమ్మేళనం

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): గుడివాడ అక్కినేని నాగేశ్వరరావు కళాశాల(1971-1978 బ్యాచ్) పూర్వ విద్యార్థుల సంఘం 'మిత్రమా స్వాగతం'(మిస్వా) ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో వారి కుటుంబసభ్యులతో సహా సమావేశమైంది. యాభై మూడేళ్ల స్నేహానికి గుర్తుగా నాటి తీపి జ్ఞాపకాలను వారంతా గుర్తుచేసుకున్నారు. అప్పటి ఆంగ్ల అధ్యాపకుడు చిరుమామిళ్ల సాంబశివరావును సత్కరించారు. మిస్వా వేదిక ద్వారా సామాజిక కార్యక్రమాల్లో భాగమవుతామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లెల మల్లికార్జునరావు(న్యూఢిల్లీ) ప్రకటించారు. కార్యనిర్వాహక అధ్యక్షుడు తోట నరేంద్రదేవ, మేరుగ శివాజీ, వెన్నా వల్లభరావు, కేవీఎస్ఎన్ మూర్తి, పువ్వుల సుధాకర్, వెలిచేటి సత్యనారాయణ పాల్గొన్నారు.



జీవీజే బాలుర ఉన్నత పాఠశాల పదో తరగతి 1974-1975 బ్యాచ్

ఉల్లాసంగా..ఉత్సాహంగా

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): జీవీజే బాలుర ఉన్నత పాఠశాలలో 1974-1975లో పదో తరగతి చదువుకున్న వారంతా పట్టణంలోని ఉక్కు కళావేదికలో సమావేశమై ఆదివారం ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. పాఠశాల స్థల దాత గెంటేల వెంకటజోగయ్య ముని మనవడు పార్థసారథి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. యాభై ఏళ్ల క్రితం చదువుకున్న వారంతా ఇలా కలుసుకోవటం చరిత్రాత్మకమని, వారి చిరునామాలు గుర్తించి, సమీకరించిన నిర్వాహకులు అభినందనీయులు అని మాజీ ఎంఈవో వెంకటేశ్వరశర్మ, ప్రస్తుత హెచ్ఎం మాధవీలత అన్నారు. అమెరికా నుంచి ఈ సమావేశానికి విచ్చేయడం వారి స్నేహశీలతకు దర్పణమన్నారు. పూర్వ విద్యార్థులందరికీ వారి పేరు, ఫొటోతో మెమొంటోను నిర్వాహకులు అందించారు. పసుపుల పుల్లారావు(ఇల్లెందు), మెరిశెట్టి రంగారావు, వీరవల్లి శ్రీనివాసరావు, నాగళ్ల రాజా, ఎన్.ధనమూర్తి, పబ్బిశెట్టి రాండన్, న్యాయవాది గోనెల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అవే తప్పులు..!

(5వ పేజీ తరువాయి)

దోహదపడుతుంది. భవిష్యత్తులో ఇది సమస్యలకు దారితీస్తుంది. కాబట్టి సర్వేయర్లు సర్వే నెంబర్ల ప్రాతిపదికన కాకుండా ఆ గ్రామ ఫీల్డ్ మెజర్‌మెంట్ బుక్ (ఎఫ్ఎంబీ) ఆధారంగా రీ ఫిక్సేషన్‌ను సక్రమంగా చేపట్టాలి. అలాగే, కొన్ని సర్వే నెంబర్లలో భూమి తక్కువగా చూపించే అవకాశముంది. పూర్వం రోజుల్లో గొలుసులతో కొలవటం వల్ల అంత ప్రామాణికంగా సర్వే జరగకపోయి ఉండొచ్చు. కాల్వగట్లను, ఇతర పోరంబోకులను కూడా కలుపుకొని అప్పట్లో మాన్యువల్ విధానంలో ఎక్కువగా నమోదు చేయించుకుని ఉండొచ్చు. ఇలాంటి సందర్భాల్లో ఎక్కువ, తక్కువలు తప్పకుండా వస్తాయి. ఎక్కువ వస్తే బేరాలు పెట్టుకుని వేరే సర్వే నెంబర్ల వారికి కలిపి చూపటం, తక్కువ వస్తే వారికి అర్థమయ్యేలా చెప్పకపోవటం వంటి అంశాలు ప్రస్తుతం రీసర్వేలో ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. ఆరోజు ఎంతమందికి రీసర్వే పూర్తి చేశామని సర్వేయర్లు ఆలోచిస్తున్నారే కానీ, గ్రామం అనే పరిధిని దృష్టిలో ఉంచుకుని నిర్వహించటం లేదన్న విమర్శలు భూ యజమానుల నుంచి వస్తున్నాయి. సర్వే నెంబర్ల రీ ఫిక్సేషన్ సక్రమంగా జరగకపోతే పోరంబోకు భూములు అన్యాక్రాంతమయ్యే పరిస్థితి ఉంది.

మద్యం మార్గం

(5వ పేజీ తరువాయి)

మాత్రం రూ.3 లక్షలు తీసుకెళ్లినట్లు సమాచారం. అయితే, వీరు చడ్డీగ్యాంగ్‌కు సంబంధించిన వారు కాదని పోలీసులు చెబుతున్నారు. మద్యం షాపుల్లో ఇప్పటివరకు జరిగిన చోరీలన్నీ స్థానిక దొంగల పనేనంటున్నారు. చడ్డీగ్యాంగ్ ఈ చోరీలు చేసిందని దృష్టిని మళ్లించడానికే ఇలా చేస్తున్నారని పోలీసులు పేర్కొంటున్నారు. వాస్తవానికి చడ్డీగ్యాంగ్‌లోని వ్యక్తులు ముఖానికి ముసుగు ధరించి, అండర్‌వేర్ వేసుకుని, ఒంటికి నూనె గానీ, గ్రీజు గానీ రాసుకుంటారు. వారి చేతులకు గ్లౌజ్‌లు ఉంటాయి. తాజాగా మద్యం దుకాణాల్లో జరిగిన చోరీల్లో ఫుటేజీలను పరిశీలిస్తే.. ఈ దొంగలకు గ్లౌజ్‌లు లేకపోవడంతో పోలీసు వర్గాలు స్థానికతను పరిగణనలోకి తీసుకుంటున్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి గుణదల మహోత్సవాలు ప్రారంభిస్తున్న విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు



ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు, భక్తులతో కిటకిటలాడుతున్న గుణదల పుణ్యక్షేత్రం పరిసరాలు



అంగరంగ వైభవంగా..

గుణదల లూర్దుమాత 101వ మహోత్సవాలు ప్రారంభం

గుణదల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): 'మరియమాతకు కష్టాలు, బాధలు విన్నవించుకుంటే ఆమె ప్రార్థనను దేవుడు ఆలకించి మన సమస్యలు తొలగిస్తారు. భక్తులను దేవుని మార్గంలో నడిపించడానికి మరియ మాత అనేక ప్రాంతాల్లో దర్శనమిచ్చారు.' అని విజయవాడ కతోలిక పీఠం బిషప్ మోస్ట్ రెవరెండ్ తెలగతోటి జోసఫ్ రాజారావు అన్నారు. గుణదల కొండపై కొలువైన లూర్దు మాత 101వ మహోత్సవాలు ఆదివారం ఉదయం అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 7గంటలకు బిషప్ గ్రాసీ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కళావేదికపై బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు, వికర్ జనరల్ ఫాదర్ మేశపాం గాబ్రియేలు తదితర గురువులు జ్యోతిప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. 2025 సంవత్సరాన్ని జగద్గురువు పరిశుద్ధ పోప్ ఫ్రాన్సిస్ జూబ్లీ సంవత్సరంగా ప్రకటించారని బిషప్ భక్తులకు సందేశమిచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన పూజాపీఠంపై స్వర్ణ జూబిలేరియన్ ఫాదర్ పి.కె.జోసఫ్‌తో కలిసి బిషప్ జోసఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్, వికార్ జనరల్ ఫాదర్ ఎం.గాబ్రియేలు, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు, ఎడ్యుకేషన్ డస్క్ డైరెక్టర్ కొలకాని మరియప్ప, ఎస్ఎస్‌సి డైరెక్టర్ తోట సునీల్ రాజు, డయాసిస్‌కు చెందిన గురువులు ప్రారంభ పవిత్ర దివ్యపూజాబలి సమర్పించారు. పూజ



దివ్యపూజాబలి సమర్పిస్తున్న గురువులు

అనంతరం గురువులు మువ్వల ప్రసాద్, పల్లె జోజిబాబు పసల తోమస్ తదితరులు కతోలిక క్రైస్తవ భక్తులకు దివ్య సత్ప్రసాదం అందజేశారు.

పురవీధుల్లో మేరీమాత తేరు ప్రదక్షిణ

గుణదల పురవీధుల్లో మేరీమాత తేరు ప్రదక్షిణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వ



తేరు ప్రదక్షిణను ప్రారంభిస్తున్న దేవినేని అవినాశ్

హించారు. కార్యక్రమాన్ని వైసీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాశ్ ప్రారంభించారు. మేరీమాత ఆశీస్సులు తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలందరికీ ఉండాలని కోరుకున్నారు. తేరు ప్రదక్షిణ ప్రధాన చర్చి నుంచి ప్రారంభమై గంగిరెద్దుల దిబ్బ, గాంధీబొమ్మ సెంటర్, గుణదల సెంటర్, ఏలూరు రోడ్డుమీదుగా లూర్దునగర్, బెత్లహామ్‌నగర్‌ల నుంచి తిరిగి చర్చి వద్దకు చేరుకుంది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై మేరీమాత ప్రతిమను ఉంచి భక్తిగీతాలు ఆలపిస్తూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రెక్టర్ యేలేటి విలియం జయరాజు, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, కార్పొరేటర్లు నిర్మలా కుమారి, మాధురి, అంబేడ్కర్ పాల్గొన్నారు.



మోకాళ్లపై నడిచి వెళుతున్న భక్తులు



కొవ్వొత్తులు వెలిగిస్తున్న క్రైస్తవులు



కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి బందోబస్తును పర్యవేక్షిస్తున్న సీపీ రాజశేఖర్‌బాబు

బందోబస్తు పర్యవేక్షించిన సీపీ

గుణదల: మేరీమాత ఉత్సవాల బందోబస్తును నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు పర్యవేక్షించారు. ఆదివారం మధ్యాహ్నం గుణదలలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ వద్దకు చేరుకుని ఎల్‌సీడీ టీవీల ద్వారా రద్దీగా ఉన్న ప్రదేశాలను గుర్తించారు. డ్రోన్ కెమెరాలు, ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరుపై దృష్టి సారించారు. ఏలూరు రోడ్డులో వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోవాలని ఏసీపీ దామోదర్‌ను ఆదేశించారు. ప్రధాన చర్చి, కొండ మధ్యలో మేరీమాత గుహ, కొండ శిఖరాగ్రానగల యేసుక్రీస్తు శిలువ వద్ద భక్తుల దర్శనాలు ఆలస్యం కాకుండా చూడాలన్నారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలన్నారు. భక్తులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. డీసీపీ గౌతమి షాలి, ట్రైనీ ఐపీఎస్ మనీషా, సెంట్రల్ జోన్ ఏసీపీ దామోదర్, ఏడీసీపీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

నాట్యమయూరాలై..

● ముగిసిన సిద్ధేంద్ర యోగి జయంత్యుత్సవాలు



సత్యానందిని, రమ్య సాహితీల అభినయం

కూచిపూడి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సిద్ధేంద్ర యోగి జయంత్యుత్సవాల్లో భాగంగా అఖిలభారత కూచిపూడి నాట్య కళామండలి ఆధ్వర్యంలో కూచిపూడి సిద్ధేంద్ర యోగి కళావేదికపై రెండు రోజులుగా ప్రదర్శిస్తున్న కూచిపూడి నాట్యాంశాలు నాట్యపరిమళాలను వెదజల్లి ఆదివారం రాత్రితో ముగిశాయి. ముగింపు రోజున విజయవాడకు చెందిన నాద పద్మ నారాయణ తీర్థుల తరంగం అంశాన్ని ప్రదర్శించి నాట్యాంశాలకు శ్రీకారం చుట్టారు. కొత్తగూడేనికి చెందిన శ్రీ దుర్గాసాయి నృత్య కళానికేతన్ విద్యార్థులు మనీషా, శ్రీనిజలు యుగళ నర్తనంలో చూపిన హావభావాలు అబ్బురపరిచాయి. నందిపల్లి సాహితీ ఆలోకయే శ్రీ బాలకృష్ణం అంశాన్ని ప్రదర్శించి రంజింపజేశారు. విజయవాడకు చెందిన శ్రీ సత్యకళానిలయం విద్యార్థులు సత్యానందిని, రమ్యసాహితీలు శ్రీ శంకరగిరి నాదప్రభో, కూచిపూడి వైభవం అంశాలను ప్రదర్శించి ప్రేక్షకులను ఆనందడోలికల్లో ముంచెత్తారు. హైదరాబాద్‌కు చెందిన శ్రీ లలితా స్కూల్ ఆఫ్ డ్యాన్స్ విద్యార్థులు లలితా సింధురి, రిత్విక, తన్వి, రితికలు సరస్వతీ స్తుతి, రామాయణ శబ్దం, రుక్మిణి ప్రవేశ దరువు, అష్టలక్ష్మీ స్తోత్రం, దశవతార హారతి అంశాలు ప్రదర్శించి ఆద్యంతమూ భక్తిభావంలో ముంచెత్తారు. అతిథులను, కళాకారులను నిర్వాహకులు వేదాంతం రాధేశ్యామ్, మృత్యుంజయ శర్మ, హరనాథ శాస్త్రిలు మెమొంటోలు అందించి సత్కరించారు.



మనీషా-శ్రీనిజల యుగళ నర్తనం



కనకదుర్గమ్మ సన్నిధిలో నటుడు అక్కినేని నాగచైతన్య, తండేల్ చిత్ర బృందం

దుర్గమ్మ సేవలో అక్కినేని నాగచైతన్య

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తండేల్ సినిమా కథానాయకుడు అక్కినేని నాగచైతన్య, చిత్ర బృందంతో కలిసి ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను ఆదివారం దర్శించుకున్నారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆయనకు ఆశీస్సులు అందించారు. అమ్మవారి లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటాలను అధికారులు అందజేశారు. చిత్ర నిర్మాత బన్నీ వాసు, దర్శకుడు మొండేటి చందు అమ్మవారిని దర్శించుకున్నారు.

సర్వేశ్వరరావుకు పరామర్శ

అనారోగ్యంతో బాధపడుతున్న ఆల్ ఇండియా అక్కినేని నాగార్జున యువసేన అధ్యక్షుడు ఎస్.సర్వేశ్వరరావును ఆదివారం విజయవాడ సూర్యారావుపేటలోని ఆయన నివాసంలో నాగచైతన్య పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

లడ్డూ ప్రసాదంలో కేశం ఉందని మంత్రి రామనారాయణరెడ్డికి ఎక్స్‌లో పోస్టు

● తయారీకేంద్రంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్, దేవస్థానం డిప్యూటీ ఈవో తనిఖీ

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో వారం క్రితం ఒక భక్తుడు లడ్డూ ప్రసాదం కొనుగోలు చేసి దానిని స్వీకరించడానికి ప్రయత్నం చేయగా అందులో కేశం కనిపించడంతో దీనిపై సమాచార కేంద్రంలో ఫిర్యాదు చేశాడు. అదే విషయాన్ని దేవదాయ మంత్రికి ఎక్స్‌లో ఫొటోతో సహా పోస్టు చేశాడు. దీనిపై మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందించారు. జరిగిన దానికి క్షమించండి, ఇలాంటి తప్పులు మరోసారి జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం, లడ్డూ తయారీ కేంద్రాన్ని స్వయంగా పరిశీలిస్తానని, పవిత్రత దెబ్బతినకుండా చూస్తామని శనివారం బదులిచ్చారు. దీంతో ఆదివారం దేవస్థానం డిప్యూటీ ఈవో, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు లడ్డూ తయారీ కేంద్రాన్ని పరిశీలించారు.

ముగిసిన హాస్య నాటిక పోటీలు

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మనసుకు ఉల్లాస, ఉత్తేజాలను కలిగిస్తూ మూడు రోజులుగా నిర్వహిస్తున్న హాస్య నాటికల పోటీలు ముగిశాయి. సుమధుర కళానికేతన్ 51వ వార్షికోత్సవం, 27వ తెలుగు హాస్యనాటికల మూడో రోజు పోటీలు ఆదివారం సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. ఉదయం నాట్యరంగంలో విశేష ప్రతిభకల లేఖ్యభరణి, సాయి వర్షితవర్మ, శృతి సమన్వి, అజయ్ బృందం నాట్యతరంగాలతో అలరించారు. గుడిపాటి శ్రీలలిత, భవిఎడిపాటి రాజశేఖర్, రసూల్ బాబు, సాత్విక శ్రీజ, ప్రణీతలు పాడుతా తీయగా అంటూ మధురగానాన్ని వినిపించారు. చెర్రీ, పిండిప్రోలు కృష్ణకుమారి బృందం వాద్య గోష్ఠి ఉల్లాసాన్ని కలిగించాయి. సాయంత్రం పోటీల్లో యంగ్ థియేటర్ ఆర్గనైజేషన్, విజయవాడ వారితో ప్రేమపిచ్చి గోపీ వల్లభ నాటికను వాసుదేవరావు దర్శకత్వంలో ప్రదర్శించారు. చివరిగా మల్లాది రవికిరణ్ రచనలో, మంజునాథ్ దర్శకత్వంలో ఆవేశంలో ఆనందం నాటిక ప్రదర్శించి నవ్వించారు. యువ కళాకారులను ప్రోత్సహిస్తూ పీబీ సిద్ధార్థ కళాశాల విద్యార్థులతో పిన్నమనేని మృత్యుంజయరావు రచన, వాసు దర్శకత్వంలో కదం కదం పర్ నాటికను ప్రదర్శించారు. సభలో హాస్యబ్రహ్మ జంధ్యాల స్మారక పురస్కారాన్ని, సినీ, రంగస్థల నటులు సుబ్బరాయశర్మకు బహూకరించి సత్కరించారు. హాస్య నాటికల పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, లలిత ప్రసాద్(సిద్ధార్థ కళాపీఠం), దారా సత్యనారాయణశర్మ, డి.రామకోటేశ్వరరావు, పిన్నమనేని మురళీకృష్ణ(జాషువా సాంస్కృతిక వేదిక), కోనేటి సుబ్బరాజు, దొంతిరెడ్డి వేమారెడ్డి, రావి వెంకటరావు (చైర్మన్, ఎన్ఆర్ఐ), సంస్థ బాధ్యులు ఎంసీ దాసు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి పెద్దేశ్వర్ హెల్త్‌కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు సత్యకుమార్, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, పల్లెం పెద్దేశ్వరరావు తదితరులు

అత్యాధునిక వైద్య సౌకర్యాలతో బహుళ ప్రత్యేకతల

పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్ ప్రారంభం

వన్‌టౌన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): అత్యాధునిక వైద్య సౌకర్యాలతో బహుళ ప్రత్యేకతల పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్‌ను ప్రారంభించడం హర్షదాయకమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. విజయవాడలో స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ మల్టీ స్పెషాలిటీ ట్రామా, క్రిటికల్ కేర్ సెంటర్‌గా రూపొందించిన పెద్దేశ్వర్ హెల్త్ కేర్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా విచ్చేసి, జ్యోతి వెలిగించారు. ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ప్రజారోగ్యానికి ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, అందుకు అనుగుణంగా హెల్త్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం ముదావహమన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, ఎన్టీఆర్ వైద్యసేవలను వివరించారు. ప్రజలకు తక్కువ వ్యయంతో కార్పొరేట్ వైద్యసేవలు అందించాలన్నది ప్రభుత్వ సంకల్పమన్నారు. పాతికేళ్లుగా తక్కువ వ్యయంతో వైద్యసేవలు అందిస్తున్న పెద్దేశ్వరరావును మంత్రి అభినందించారు. రాష్ట్రంలోనే అతి పెద్ద క్రిటికల్ కేర్ సెంటర్‌ను ప్రారంభించామని, ప్రజలకు మరింత విస్తృతంగా సేవలు అందిస్తామని ఎండీ పల్లెం పెద్దేశ్వరరావు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో క్రిటికల్ కేర్‌సెంటర్‌ను ఏర్పాటు చేశామని, 150 బెడ్లు, 8 ఐసీయూలు, 100 క్రిటికల్ కేర్ బెడ్లు ఇంకా ఇతర విభాగాలు ఉన్నాయని సీఈవో డాక్టర్ పల్లెం ఆకాశ్ వివరించారు. మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరరావు, కామినేని శ్రీనివాస్, స్టార్ ఆస్పత్రి ఎండీ మన్నవ గోపీచంద్, వైద్యులు సీహెచ్ ప్రసాద్‌బాబు, ఎస్.భాను ప్రభాకర్, వి.సుశాంత్‌రెడ్డి, సింధు చాగంటి, పోతుల పవన్‌సాయి, కె.శ్రీనివాసబాబు, కొనకళ్ల రామ్‌ప్రతాప్, కె.రామ్మోహన్ పాల్గొన్నారు.

గీత షాపులకు 621 దరఖాస్తులు

● ఎన్టీఆర్ జిల్లాలో 335..కృష్ణాకు 286

● షాపుల కేటాయింపు డ్రా వాయిదా

● ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) ఉమ్మడి కృష్ణాజిల్లాలో గీత కార్మికులకు కేటాయించిన మద్యం షాపులకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఎన్టీఆర్ జిల్లాలో 11, కృష్ణాజిల్లాలో 12 రిజర్వేషన్ షాపులకు కొద్దిరోజుల క్రితం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే.

ఎన్టీఆర్ జిల్లాలో..		కృష్ణా జిల్లాలో..	
విజయవాడ	71	మచిలీపట్నంకార్పొరేషన్	40
జగ్గయ్యపేట	21	గుడివాడమున్సిపాలిటీ	32
కొండపల్లి	47	పెడనమున్సిపాలిటీ	13
వీరులపాడు	27	తాడిగడపమున్సిపాలిటీ	60
వత్సవాయి	31	గూడూరు	17
తిరువూరు	20	గుడివాడ	15
ఎ.కొండూరు	31	పమిడిముక్కల	30
నందిగామ	31	పెడన	16
రెడ్డిగూడెం	18	మచిలీపట్నం	16
విస్సన్నపేట	16	కోడూరు	14
జగ్గయ్యపేట రూరల్	22	పెదపారుపూడి	11
		బంటుమిల్లి	22
మొత్తం	335	మొత్తం	286

ఈ షాపులకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించారు. ఎన్టీఆర్ జిల్లాలో 11 షాపులకు 335, కృష్ణాజిల్లాలో 12 షాపులకు 286 దరఖాస్తులు అందాయి. అత్యధిక దరఖాస్తులు విజయవాడ కార్పొరేషన్‌లోని షాపునకు వచ్చాయి. ఈ షాపునకు 71 దరఖాస్తులు అందాయి. కృష్ణా జిల్లాలో తాడిగడప మున్సిపాలిటీ షాపునకు 60 దరఖాస్తులు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో ఈ షాపులను గీత కార్మిక కులాల్లో ఉన్న గౌడ, శెట్టిబలిజ వర్గాలకు కేటాయించారు. శెట్టిబలిజ సామాజిక వర్గానికి కృష్ణా జిల్లాలో మచిలీపట్నం, ఎన్టీఆర్ జిల్లాలో విస్సన్నపేటలో షాపులను రిజర్వ్ చేశారు. మిగిలిన షాపులను గౌడ సామాజిక వర్గానికి కేటాయించారు. ఈ దరఖాస్తులు పరిశీలించిన అనంతరం ఈనెల పదో తేదీన లాటరీ ద్వారా షాపులను కేటాయించాల్సి ఉంది. దీనిపై ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ప్రభావం పడింది. కోడ్ అమల్లో ఉన్నందున పదో తేదీన నిర్వహించాల్సిన లాటరీని వాయిదా వేస్తున్నట్టు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. తదుపరి డ్రా తేదీని త్వరలో తెలియజేస్తామని స్పష్టం చేశారు.

12న కస్టమ్స్ వాకథాన్

విజయవాడ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవం సందర్భంగా 12న 5కే రన్, వాక్‌థాన్ నిర్వహిస్తున్న కస్టమ్స్ కమిషనర్ ఎస్.నరసింహారెడ్డి తెలిపారు. ఆటోనగర్‌లోని కస్టమ్స్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం పోస్టర్‌ను విడుదల చేశారు. ఆరోగ్యమైన జీవనశైలి, ప్రపంచ వాణిజ్యాన్ని సులభతరం చేయడంలో కస్టమ్స్ పోషించే పాత్రపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎంజీ రోడ్డులోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉదయం ఆరు గంటలకు ప్రారంభమవు తుందన్నారు. వివిధ వయో వర్గాలకు అనుగుణంగా రన్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కస్టమ్స్ ఉద్యోగులే కాకుండా, వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొనవచ్చని తెలిపారు. కస్టమ్స్ అదనపు కమిషనర్ కాకరాల ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

మీకోసం పోర్టల్‌లో అర్జీలు నమోదు చేసుకోండి

● ప్రజలకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సూచన

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గానికి ఎన్నికల షెడ్యూల్ విడుదలవడంతో ఎన్టీఆర్ జిల్లాలో కోడ్ అమల్లో ఉన్న కారణంగా సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి తాత్కాలిక విరామం ప్రకటించామని కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3వ తేదీ నుంచి మార్చి 8వ తేదీ వరకు ప్రతి సోమవారం కలెక్టరేట్, రెవెన్యూ డివిజన్లు, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లో నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం కార్యక్రమానికి తాత్కాలిక విరామం ప్రకటించామని పేర్కొన్నారు. ప్రజలు మీకోసం ఆన్‌లైన్ పోర్టల్‌లో అర్జీలు నమోదు చేసుకోవచ్చని, ఇందుకు సమీప గ్రామ లేదా వార్డు సచివాలయాన్ని సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110,119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

ఈనెల 22, 23న ఉచిత పుస్తకాల పంపిణీ

ఆటోనగర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో 9 ఏళ్లుగా ఉచిత పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని, ఈనెల 22, 23 తేదీల్లో బెంజిసర్కిల్ సమీపంలోని సర్వోత్తమ గ్రంథాలయంలో పుస్తకాలను పంపిణీ చేస్తామని సంఘ ప్రధాన కార్యదర్శి రావి శారద ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు 35 వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు, సాహితీప్రియులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.


ల్యాప్‌ట్యాప్ అందిస్తున్న ఎస్.వినోద

పేద విద్యార్థినికి ల్యాప్‌ట్యాప్ అందజేత

పటమట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): చదువుతున్న అమలాపురానికి చెందిన టి.జాహ్నవిబీటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. తండ్రి లేని పేద విద్యార్థికి రూ.65 వేలు విలువగల ల్యాప్‌ట్యాప్‌ను నిర్భయ క్రాంతి మహిళా మండలి కార్యాలయంలో ఆదివారం మహిళా మండలి సభ్యురాలు ఎస్.వినోద తన సొంత నిధులతో కొను గోలు చేసి అందజేశారు. కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు అబ్బూరి రత్నలక్ష్మి, ఉపాధ్యక్షురాలు సీతామహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న గురువులు


ప్రార్థనలో పాల్గొన్న భక్తులు


తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు

లోకమాతకు వందనం


భక్తులను ఆశీర్వదిస్తున్న గురువులు

గుణదల కొండపై కొలువైన గుణదల(లూర్దు)మాత 101వ మహోత్సవాలు ఆదివారం ఉదయం అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. భక్తులను దేవుని మార్గంలో నడిపించడానికి మరియమాత అనేక ప్రాంతాల్లో దర్శనమిచ్చారు. ఆమెకు వందనం.' గుణదల పురవీధుల్లో మేరీమాత తేరు ప్రదక్షిణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.తేరు ప్రదక్షిణకు ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై మేరీమాత ప్రతిమను ఉంచి మేళతాళాలతో భక్తిగీతాలు ఆలపిస్తూ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ప్రార్థనలకు హాజరైన విశ్వాసులు


చర్చిలో ప్రార్థనలు చేస్తున్న భక్తులు


ఉపదేశం చేస్తున్న గురువులు

నైతిక విలువల సమాజమే లక్ష్యం

ఆటోనగర్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : నైతిక విలువలతో కూడిన సమాజ ఏర్పాటుకు దైవ గ్రంథాల విద్య అవసరం ఎతైనా ఉందని ఏటీప అధ్యక్షుడు రాజనాల వెంకట రమణారావు అన్నారు. ఆటోనగర్‌లోని ఏటీప హాలులో ఆదివారం 10వ రాష్ట్ర స్థాయి ఖురాన్ కంఠస్థ ఫైనల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకటరమణరావు మాట్లాడుతూ చెడు అలవాట్లు, అరాచకాలు, నేరాలు చిన్న పిల్లల్లోనూ పెరిగిపోతున్న తరుణంలో నైతిక విలువలతో కూడిన దైవ గ్రంథాల విద్య అవసరం ఉందన్నారు. యూఎఫ్‌క్యూఎస్ సంస్థ విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడానికి దివ్య ఖురాన్ కంఠస్థ పోటీల్లాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. పది సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని ఆదరిస్తున్న తల్లిదండ్రులకు, సహకరిస్తున్న అందరికీ కృతజ్ఞతలని యూఎఫ్‌క్యూఎస్ ఛైర్మన్ దావూద్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 వేల మంది దరఖాస్తు చేసుకోగా 44 మంది ఫైనల్‌కు చేరుకున్నారని తెలిపారు.

రోగాన్ని ప్రాథమిక దశలోనే గుర్తించాలి


రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

గుణదల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఎటువంటి రోగాన్ని అయినా ప్రాథమిక దశలోనే పసిగట్టి వైద్యుని సలహా సూచనల మేరకు ఆహారం, మందులు వాడుతే ప్రాణాపాయం ఉండదని హెచ్‌సీజీ క్యాన్సర్ ఆసుపత్రి ప్రతినిధి అంజిబాబు అన్నారు. ఒకటో డివిజన్ పరిధిలోని హెచ్‌సీజీ క్యాన్సర్ ఆసుపత్రి, మాచవరం వాకర్స్ అసోసియేషన్ సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. గర్భాశయ పరీక్షతోపాటు పలు రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. మాచవరం, గుణదల పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన 120 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ ఆహారపు అలవాట్లలో మార్పులు వస్తున్నాయని, తద్వారా చాలా మంది అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఇంట్లో తయారు చేసిన ఆహారం ఎంతో శ్రేష్టం అన్నారు. బయట ఏదో తప్పని సరైనప్పుడు తప్ప ఇతర సమయాల్లో ఇంటి ఆహారం తీసుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అనారోగ్యం బారిన పడ్డ తర్వాత శ్రద్ధ తీసుకోవడం కాదని ప్రతి ఒక్కరూ వారి వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవడంతోపాటు శరీరానికి వ్యాయామం కూడా చాలా అవసరమన్నారు. మాచవరం వాకర్స్ అసోసియేషన్ ఈ తరహా ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో మాచవరం వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు, అధ్యక్షుడు సుబ్బారావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రంగా శ్రీనివాస్, కోశాధికారి వెంకటేశ్వరరావు, మచవరం వాకర్స్ అసోసియేషన్ ఉమెన్స్ వింగ్ అధ్యక్షురాలు ఆర్.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి యర్రాజీకు అథ్లెటిక్స్‌లో బంగారు పతకం

శాప్ చైర్మన్ రవినాయుడు అభినందనలు

విజయవాడ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న 38వ జాతీయ క్రీడా పోటీలకు శాప్ చైర్మన్ రవినాయుడు హాజరయ్యారు. ఐవోఏ సభ్యులతో కలిసి అథ్లెటిక్స్ పోటీలను వీక్షించడంతో పాటు అథ్లెటిక్స్‌లో బంగారు పతకం సాధించిన ఏపీ అథ్లెట్ జ్యోతి యర్రాజీకు మెడల్ ప్రదాన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ జ్యోతి యర్రాజీ విజయం తెలుగు ప్రజలకు గర్వకార ణమని, శాప్ తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు.


యర్రాజీకు మెడల్ ప్రదాన చేస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

క్రీడల్లో రాష్ట్ర కీర్తిని ఇనుమడింప చేయాలి

● సీపీ ఎస్.వి.రాజశేఖర్ బాబు

గుణదల, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): స్లాలమ్ కె-1 విభాగంలో జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన నాగిడి గాయత్రిని సీపీ ఎస్.వి .రాజశేఖర్ బాబు అభినందించారు. నాగాయలంకకు చెందిన నాగిడి గాయత్రి రిషీకేష్‌లో జరిగిన 38వ జాతీయ స్థాయిలో పోటీల్లో పాల్గొని కెనాయ్ స్లాలమ్ కె-1 విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి ఆదివారం నగరానికి చేరుకుని నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబును మర్యాద పూర్వకంగా కలిసిన నాగిడి గాయత్రిని ఆయన అభినందించి, సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. క్రీడా కారిణి గాయత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ... తాను స్థాయికి చేరుకోవడానికి పోలీస్ హెడ్ కానిస్టేబుల్ తిప్పిరెడ్డి శివారెడ్డి ఇచ్చిన శిక్షణ ప్రధానమన్నారు. ఇన్‌స్పెక్టర్ కోమాకుల శివాజీ, పారిశ్రామికవేత్త అప్పికట్ల అప్పారావు మరికొంతమంది దాతలు, ప్రభుత్వ ప్రోత్సాహమే కారణమన్నారు. తప్పకుండా ఏషియన్ గేమ్స్‌లోనూ ఒలింపిక్‌లో పతకాలు సాధిస్తానన్నారు. కార్యక్రమంలో గాయత్రి తల్లిదండ్రులు, ఇన్‌స్పెక్టర్ కోమాకుల శివాజీ, హెడ్ కానిస్టేబుల్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గాయత్రిని అభినందిస్తున్న సీపీ ఎస్.వి.రాజశేఖర్ బాబు

అన్నవరపు రామస్వామికి సుసర్ల దక్షిణామూర్తి పురస్కారం

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ సినీ సంగీత దర్శకులు సుసర్ల దక్షిణామూర్తి 104వ జయంతి సందర్భంగా ఆయన పురస్కారాన్ని సుప్రసిద్ధ వయోలిన్ విద్వాంసులు పద్మశ్రీ అన్నవరపు రామస్వామికి ఆదివారం సాయంత్రం కౌతా పూర్ణా నందం కళావేదికపై ప్రదానం చేశారు. సుసర్ల సంగీత వాహిని (హైదరాబాద్), తెలుగు కళావాహిని, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి సంయుక్త అధ్వర్యంలో జరిగిన పురస్కార సభలో చీఫ్ విప్ ఓఎస్‌డీ ప్రభాకర్, ఏబీ ఆనంద్ తదితరులు మాట్లాడుతూ పురస్కారాన్ని సముచితమైన వ్యక్తికి అందించి నిర్వాహకులు పురస్కార గౌరవాన్ని మరింత పెంచారన్నారు. పురస్కార స్వీకర్త అన్నవరపు మాట్లాడుతూ, సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రుల శిష్యులు పారుపల్లి రామకృష్ణయ్య పంతులు తమ గురుదేవులని, ఆ గురుకృపే తననింతటి వాడిని చేసిందన్నారు. అనంతరం సుసర్ల సంగీత దర్శకత్వంలోని చిత్రాల పాటలను స్వాతి, రజని, షబన, మల్లీశ్వరి, డేవిడ్‌రాజు, అయ్యప్పన్, రసూల్‌బాబు, మస్తాన్‌వలిలు సుసర్లవారికి నీరాజనాలర్పిస్తూ శ్రావ్యంగా పాడి వినిపించారు.


సుసర్ల దక్షిణామూర్తి పురస్కారం అందుకుంటున్న అన్నవరపు రామస్వామి

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి

● ఆలపాటి రాజేంద్ర ప్రసాద్

పటమట/ఆటోనగర్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే పట్టభద్రుల సమస్యలపై పోరాటం చేస్తానని ఉమ్మడి కృష్ణా - గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ (రాజ) అన్నారు. 10వ డివిజన్‌లో ఫన్ టైమ్స్ క్లబ్‌లో ఆదివారం వాకర్స్‌ను ఆయన, గద్దె క్రాంతి కుమార్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. తొలి ప్రాధాన్యత ఓటును తనకు వేయాలని అభ్యర్థించారు. గద్దె క్రాంతి కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ యువత చేతిలో ఉందన్నారు. యువతకు కూటమి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతను ఇస్తుందన్నారు. కార్యక్రమంలో దేవినేని అపర్ణ, జాస్తి సాంబశివ రావు, కిలారు శివాజీ, బొర్రా గాంధీ, చెన్నుపాటి గాంధీ, కొసరాజు విజయబాబు, వేమూరి సాంబశివరావు, కోనేరు రాజేష్, అట్లూరి సుమ, చలసాని వాసు తదితరలుఉ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రాజేంద్రప్రసాద్

స్టేడియంలో...

లబ్బీపేట, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికలలో తనకు ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజా కోరారు. ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలోని వాకర్స్‌ను ఆదివారం ఉదయం గద్దె క్రాంతి కుమార్ తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

దిక్సూచి
DIKSUCHI

ఇంజనీరింగ్ విద్యార్థులకు
ఇంటర్న్‌షిప్ అవకాశాలు



మార్కెట్‌లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవడంలో చాలా మంది ఇంజనీరింగ్ విద్యార్థులు వెనకబడుతుంటారు. ఇందుకు ప్రధాన కారణం ఉద్యోగానికి అవసరమైన స్కిల్స్‌ను నేర్చుకోకపోవడమే. అలాంటి వారికి ఇంటర్న్‌షిప్‌లు ఉపయోగపడుతుంటాయి. వీటి ద్వారా కాలేజీలో నేర్చుకున్న థియరిటికల్ నాలెడ్జ్‌ని రియల్ వరల్డ్ సిట్యువేషన్స్‌కు అప్లై చేయడానికి అవకాశం ఉంటుంది. ప్రొఫెషనల్ లైఫ్‌కి కావాల్సిన ఇన్‌సైట్స్ తెలుసుకోవడంలో ఇంటర్న్‌షిప్స్ ఉపయోగపడతాయి. అకడమిక్‌కి, ప్రొఫెషనల్ లైఫ్‌కి కావాల్సిన స్కిల్స్ తేడా వారికి అవగతమవుతుంది. ప్రభుత్వ రంగ సంస్థలు అందించే కొన్ని ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్స్ ఇవి. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

నేషనల్ రెన్యువబుల్ ఎనర్జీ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్

కేంద్ర పునరుత్పాదన మంత్రిత్వశాఖ పరిధిలోని ఇంటర్న్‌షిప్ ఇది. ఇంజనీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్, లా తదితర ప్రోగ్రామ్స్ చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మంత్రిత్వశాఖ అవసరాలను బట్టి సంవత్సరానికి రెండుసార్లు కూడా దీనిని ప్రకటిస్తారు. ఈ ఇంటర్న్‌షిప్ కాలపరిమితి రెండు నుంచి ఆరు నెలలు ఉంటుంది. నెలకు 15 వేల రూపాయలు ఉపకారవేతనం ఇస్తారు. https://mnre.gov.in/en/national-renewable-energy-internship-programme-2/

ఐఐటీ పాలక్కడ్ సమ్మర్ ఇంటర్న్‌షిప్

ఈ ఇంటర్న్‌షిప్ ఇంజనీరింగ్, సైన్స్, హ్యూమానిటీస్ విద్యార్థులకు ఉద్దేశించినది. మూడు లేదా నాలుగో సంవత్సరం చదువుతున్నవారు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఆరువారాల ఈ రెసిడెన్షియల్ ప్రోగ్రామ్‌లో హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన రీసెర్చ్ ట్రైనింగ్ ఉంటుంది. 12000/- స్టయిఫండ్ కూడా ఇస్తారు. 2025 మార్చి 15లోపు దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు https://sun.iitpkd. ac.in/ వెబ్‌సైట్ చూడవచ్చు.

డిజిటల్ ఇండియా ఇంటర్న్‌షిప్ స్కీమ్

ఈ ఇంటర్న్‌షిప్‌ను మినిస్ట్రీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అందిస్తుంది. ఇంజనీరింగ్ యూజీ, పీజీ, లా చేస్తున్న విద్యార్థులు దీనికి అర్హులు. ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకునే ముందు రాసిన పరీక్షలో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి. రెండు నెలల కాలవ్యవధి ఉంటుంది. నెలకు పదివేల రూపాయల స్టయిఫండ్ ఇస్తారు. www.meity.gov.in

వాద్వానీ, మద్రాస్ ఐఐటీ సమ్మర్ ఇంటర్న్‌షిప్స్

వాద్వానీ స్కూల్ ఆఫ్ డేటా సైన్స్ అండ్ ఏఐ, మద్రాస్ ఐఐటీ కలిసి ఉమ్మడిగా ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ని అందిస్తున్నాయి. ఇంజనీరింగ్ లేదా సైన్స్ బ్రాంచ్‌ల్లో యూజీ ప్రోగ్రామ్‌లో ఫైనల్ ఇయర్ చదువుతున్నవారు, పీజీ అయితే మొదటి సంవత్సరం చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్న్‌షిప్ కాల వ్యవధి మూడు నుంచి ఆరు నెలలు ఉంటుంది. వ్యక్తిగతంగా హాజరయి పూర్తి చేయాల్సిన ఇంటర్న్‌షిప్ ఇది. వీరికి స్టయిఫండ్ కూడా అందజేస్తారు. దరఖాస్తులు 2025 ఫిబ్రవరి 15లోపు పంపుకోవాలి.

https://wsai.iitm.ac.in/2025/01/05/wsai-summer-internships-2025/

టెక్ ఇంటర్న్‌షిప్ స్కీమ్

ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలీ కమ్యూనికేషన్స్‌కు చెందిన 'టెలీకామ్ ఇంజనీరింగ్ సెంటర్' ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ నిర్వహిస్తోంది. ఆరు నెలలపాటు ఇది ఉంటుంది. అవసరమైన పక్షంలో దీనిని ఒక సంవత్సరం వరకు పొడిగించుకోవచ్చు. ఇంటర్న్‌షిప్‌లో మొత్తం రూ.15,000స్టయిఫండ్ ఇస్తారు. https://www.myscheme.gov.in/schemes/tecis#details

BITSAT 2025 నోటిఫికేషన్ విడుదల

దేశంలోని ఇంజనీరింగ్ విద్యను అందించే ప్రతిష్ఠాత్మక సంస్థలో 'బిర్లా ఇన్‌స్టిట్యూట్' (బిట్స్) ఒకటి. పిలానీ, గోవా, హైదరాబాద్‌ల్లో బిట్స్‌కు క్యాంపస్‌లు ఉన్నాయి. ఇంజనీరింగ్ చదవాలనుకునే విద్యార్థులు జేఈఈ, తమ రాష్ట్రాల ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌లతో పాటుగా దీనిని కూడా రాస్తుంటారు.

బిట్స్ ఎంట్రెన్స్ స్కోరుకు కూడా కొన్ని ఇతర సంస్థలు అడ్మిషన్ ఇస్తున్నాయి. ఇంటర్మీడియేట్ అర్హతతో బీఈ, బీఫార్మసీ, ఎమ్మెస్సీ కోర్సుల్లో చేరవచ్చు. ఇంటర్ సబ్జెక్టులతోపాటు ఈ ఎంట్రెన్స్‌లో ఇంగ్లీష్, లాజికల్ రీజనింగ్‌ల్లో కూడా ప్రశ్నలు అడుగుతారు. జేఈఈ స్థాయిలో అత్యుత్తమంగా స్కోరు సాధించిన విద్యార్థులకు ఇక్కడ సీటు లభిస్తుంది. 390కి కనీసం 240 మార్కులు సాధించిన వారికి సీటు దొరికే అవకాశం ఉంది. బీఫార్మసీకి అయితే ఇంకా తక్కువ స్కోరుకు కూడా దొరుకుతుంది.

బిట్స్ ఎంట్రెన్స్ 2025 పరీక్ష రెండు సెషన్లలో జరుగుతుంది.

- సెషన్-1 ఎంట్రెన్స్ 2025 మే 26 తేదీ నుంచి 30వ తేదీ వరకు.
- సెషన్-2 ఎంట్రెన్స్ 2025 జూన్ 22 తేదీ నుంచి 26 తేదీ వరకు.

దరఖాస్తులకు చివరి తేదీ: 2025 ఏప్రిల్ 18

ఆసక్తి గల అభ్యర్థులు రెండు సెషన్లు లేదా ఒక్క సెషన్ అయినా రాయవచ్చు. రెండింటిలో అత్యుత్తమంగా సాధించిన మార్కులనే ఫైనల్ స్కోరుగా పరిగణనలోకి తీసుకుంటారు.

కోర్సులు:


బీఈ: కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్, మెకానికల్, మాన్యుఫ్యాక్చరింగ్, ఎన్విరాన్‌మెంటల్ అండ్ సస్టయినబిలిటీ.

బీఫార్మసీ:

ఎమ్మెస్సీ: మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయలాజికల్ సైన్సెస్, ఎకనామిక్స్ సెమీ కండక్టర్ అండ్ నానో సైన్స్, జనరల్ స్టడీస్.

పరీక్ష కేంద్రాలు: హైదరాబాద్, వరంగల్, మహబూబ్ నగర్, విజయవాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం,

సబ్జెక్టులు: ఇందులో నాలుగు విభాగాలు ఉంటాయి.
పార్ట్-1: ఫిజిక్స్ 30,
పార్ట్-2: కెమిస్ట్రీ 30,
పార్ట్ 3
ఏ. ఇంగ్లీష్ ప్రొఫిషియన్సీ 10,
బి. లాజికల్ రీజనింగ్ 20.
పార్ట్-4: మేథ్స్/బయాలజీ(బీఫార్మసీ కోసం) 40 ప్రశ్నలు ఉంటాయి.



పరీక్ష విధానం: పరీక్ష ఆన్‌లైన్‌లో జరుగుతుంది. మొత్తం 130 ప్రశ్నలను మూడు గంటల్లో పూర్తిచేయాలి. అయితే సమయానికి సంబంధించి సెక్షన్ల వారీ నిబంధనలు లేవు. కానీ నెగెటివ్ మార్కింగ్ ఉంది. ప్రతీ సరైన జవాబుకు మూడు మార్కులు, తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.

SCHOLARSHIP ALERT

Tata Capital Pankh

Description: An initiative of Tata Capital Limited aimed at providing financial support to students belonging to economically weaker sections of society to help them fulfill their academic dreams.
Eligibility: Indian students who are currently studying in Classes 11, 12 general graduation (B.Com., B.Sc., B.A., etc.), diploma and ITI courses at recog nised institutions are eligible. Applicants must have scored at least 60% marks in the preceding class. The annual family income of the applicants from all sources must be less than or equal to INR 2.5 lakh.
Prizes & Rewards: Up to an amount ranging from INR 10,000 to INR 12,000 or 80% of course fees (whichever is less) ***Last Date:*** 15-02-2025
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/TCPS27

JK Tyre Shiksha Sarthi

Description: JK Tyre & Industries Pri vate Limited invites applications from the daughters of heavy vehicle drivers who are pursuing technical or non-technical undergraduate or diploma courses and reside in select locations.
Eligibility: Female students who are daughters of heavy vehicle drivers and pursuing technical or non-technical undergraduate or diploma courses are eligible to apply. Students must have received a minimum of 55% marks in their previous academic year. The annual family income of applicants must be less than or equal to INR 5,00,000. Applicants must be residents of Rajasthan, Madhya Pradesh, Uttara khand, Karnataka, or Tamil Nadu.
Prizes & Rewards: One-time scholarship:
Technical Undergraduate Courses: INR 25,000
Non-Technical Undergraduate Courses: INR 15,000 ***Diploma Courses:*** INR 15,000
Last Date to Apply: 15-02-2025
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/JKTS1

Charpak Bachelor's

Description: Charpak Bachelor's Scholarship 2025 is an opportunity offered by the French Government to Indian students who wish to pursue a full-time undergraduate degree in one of the institutions in France.
Eligibility: Open for Indian nationals or OCI card holders who are 23 years old or younger at the time of application. Applicants must have completed secondary school in India and have applied for a bachelor's degree program starting on 1st September 2025. Students must have never previously studied at an educational institution in France.
Prizes & Rewards: The scholarship offers a monthly living allowance of 860 euros and other benefits.
Last Date to Apply: 28-02-2025
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/CBSS3

buddy4study.com

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

విజయ్ సినిమాలో సంజయ్‌దత్?

విజయ్ దేవరకొండ హీరోగా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్ ఓ అతిథి పాత్రలో కనిపించనున్నారనే వార్త టాలీవుడ్‌లో ప్రచారమవుతోంది. అంతేకాదు 'ద మమ్మీ' యాక్టర్ అర్నాల్డ్ వోస్లూ కూడా ఓ కీలక పాత్రలో నటించనున్నాడనే వార్తలు వెలువడ్డాయి. అయితే ఈ వార్తలపై మేకర్స్ ఇప్పటివరకూ స్పందించలేదు. కాగా, ఈ సినిమాలో విజయ్ దేవరకొండ ఓ సరికొత్త పాత్రలో కనిపించనున్నాడట. 1854-78 మధ్య కాలంలో జరిగే కథ కాబట్టి, సినిమాలో చాలా వేరియేషన్స్ ఉంటాయని తెలుస్తోంది. చిత్ర షూటింగ్ ఈనెల మూడో వారంలో ప్రారంభం కానున్నట్లు సమాచారం. మొదటి షెడ్యూల్‌లో విజయ్ దేవరకొండ ఎంట్రీ సీన్‌ను చిత్రీకరించనున్నట్లు టాక్. నాని హీరోగా రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో వచ్చిన 'శ్యామ్ సింగరాయ్' చిత్రం విజయవంతమైంది. దీంతో విజయ్ దేవరకొండ సినిమాపై కూడా భారీ అంచనాలు ఏర్పడ్డాయి.



ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు విజయ్ తన తల్లితో కలసి హాజరయ్యారు. వారు త్రివేణి సంగమంలో ఆదివారం పుణ్యస్నానాలు చేసారు.

త్వరలో వీడీ12 టైటిల్ టీజర్

విజయ్ దేవరకొండ హీరోగా గౌతం తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న వీడీ12(వర్కింగ్ టైటిల్) టైటిల్ టీజర్ ఈనెలలోనే వెలువడనున్నట్లు వార్తలొస్తున్నాయి. నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ సినిమా హిందీ టీజర్‌కు రణబీర్ కపూర్ వాయిస్ ఓవర్ ఇచ్చారు. అదేవిధంగా తెలుగుకు ఎన్టీఆర్, తమిళ్‌కు ధనుష్ వాయిస్ ఓవర్ ఇచ్చినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

అజిత్ కారుకు మళ్లీ ప్రమాదం



పోర్చుగల్ కార్ రేస్ పోటీల కోసం శిక్షణ పొందుతున్న హీరో అజిత్ కారు మరోమారు ప్రమాదానికి గురైంది. ఈ విషయాన్ని అజిత్ ఆదివారం వెల్లడించారు. 'నా అభిమానులు మాత్రమే కాకుండా, నేను ఏం చేయబోతున్నానో తెలుసుకునేందుకు అమితాసక్తితో ఎదురు చూస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. ఈ రోజు కూడా శిక్షణలో నా కారు స్వల్ప ప్రమాదానికి గురైంది. దాన్ని మెకానిక్ బృందం రిపేర్ చేసింది' అని ఒక వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. కాగా, ఇటీవల దుబాయ్ వేదికగా జరిగిన 24హెచ్ కార్ రేస్ పోటీల కోసం శిక్షణ పొందుతుండగా, అజిత్ కారు ప్రమాదానికి గురైన విషయం తెల్సిందే. దీంతో ఆ పోటీల నుంచి అజిత్ తప్పుకున్నారు. అయినప్పటికీ అజిత్ కుమార్ రేసింగ్ టీం ఆ పోటీల్లో మూడో స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. దీంతో అజిత్ కుమార్‌కు 'స్పిరిట్ ఆఫ్ ది గేమ్' అనే అవార్డును కూడా ప్రదానం చేశారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)

నాటి ప్రజారాజ్యమే నేటి జనసేన



- తొలిసారి 'జై జనసేన' అంటూ నినదించిన చిరంజీవి
- ఒక్కోసారి కొన్ని సినిమాలు ఆడొచ్చు, ఆడకపోవచ్చు
- 'పుష్ప 2' ఘన విజయాన్ని స్వాగతిస్తున్నా
- ఇండస్ట్రీ అంతా ఒకటే కాంపౌండ్

"ప్రజారాజ్యం పార్టీ జనసేనగా రూపాంతరం చెందింది. అందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. ఇప్పుడు అంతా జనసేనే. జై జనసేన' అంటూ నినదించి మెగా అభిమానులను ఉత్సాహపరిచారు చిరంజీవి. విష్వక్‌సేన్ కథానాయకుడిగా నటించిన 'లైలా' చిత్రం ఈనెల 14 న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ కార్యక్రమానికి చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేదికపైన ఉన్న విష్వక్‌సేన్ తండ్రి కరాటే రాజుతో తన అనుబంధం గురించి ప్రస్తావిస్తూ చిరంజీవి పై వ్యాఖ్యలు చేశారు. 'మేం ప్రజారాజ్యం పార్టీ పెట్టినప్పుడు రాజకీయంగా ఎదగాలనే తన కోరికను కరాటే రాజు నా దగ్గర ప్రస్తావించాడు. దాంతో ప్రజారాజ్యం తరపున అవకాశం ఇచ్చాం. కానీ అప్పట్లో పరిస్థితులు ఇంకోలా ఉన్నాయి' అని చిరంజీవి చెప్పారు. అలాగే మేనల్లుడు అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' విజయం పట్ల చిరంజీవి హర్షం వ్యక్తం చేశారు. "పుష్ప 2' పెద్ద హిట్టయింది. అందుకు నేను గర్విస్తున్నా. ఒక్కోసారి కొన్ని సినిమాలు ఆడొచ్చు, ఆడకపోవచ్చు. కానీ ఒక సినిమా బాగా ఆడితే దాన్ని ఇండస్ట్రీలో ప్రతి ఒక్కరూ హర్షించాలి' అన్నారు.

విష్వక్‌ను బాలకృష్ణ మనిషి అన్నారు

"నా బాల్యంలో ఎన్టీఆర్, ఏఎన్నార్ అభిమానులు రక్తం వచ్చేలా కొట్టుకోవడం చూశాను. ఆ సంఘటన ప్రభావంతో నేను సినిమాల్లోకి వచ్చాక మా హీరోల మధ్య సఖ్యత కోసం కృషి చేశాను. 'విష్వక్‌సేన్ ఫంక్షన్‌కు వెళ్తున్నావా? అతను మన మనిషి కాదు, బాలకృష్ణ మనిషి. అప్పుడప్పుడూ 'తారక్' అని కూడా అంటాడు. ఆ కార్యక్రమానికి వెళ్లొద్దు" అని కొందరు నాతో అన్నారు. మనుషులన్నాక వేరేవాళ్ల మీద ప్రేమ, అభిమానం ఉండకూడదా? అభిమానం పర్సనల్. జిహ్వాకో రుచి అన్నట్లు యాక్టర్‌గా కొంతమంది కొందరికి కనెక్ట్ అవుతారు. దాన్ని మనమంతా అంగీకరించాలి. రామ్ చరణ్‌కు సూర్య అంటే చాలా ఇష్టం. అంతమాత్రాన వాడితో నేను కలసి ఉండకూడదా? ఇక నుంచైనా మా గురించి ఆ కాంపౌండ్, ఈ కాంపౌండ్ అంటూ మాట్లాడరనే అనుకుంటున్నాను. ఇండస్ట్రీ అంతా ఒకటే కాంపౌండ్' అని చెప్పారు. 'లైలా' సినిమాతో విష్వక్‌సేన్, దర్శకుడు రామ్ నారాయణ్, నిర్మాత సాహూ గారపాటి పెద్ద విజయాన్ని అందుకోవాలని చిరంజీవి ఆకాంక్షించారు. 'ఇది నా కెరీర్‌లో స్పెషల్ మూవీ. జనాల్ని నవ్వించాలని డిసైడ్ అయ్యాను ' అని విష్వక్‌సేన్ అన్నారు. లైలా లాంటి పాత్ర చేయడానికి విష్వక్ తప్ప మరో హీరో ముందుకురాడు అని సాహూ గారపాటి అన్నారు. విష్వక్ ఈ సినిమాను అంగీకరించడమే నాకు పెద్ద బహుమతి అని . రామ్ నారాయణ్ చెప్పారు.



పుష్ప జీవితాంతం గుర్తుంటుంది

అల్లు అర్జున్

"పుష్ప' సినీ ప్రయాణంలో ఐదు నిమిషాల నుంచి ఐదేండ్ల వరకూ భాగమైన ప్రతి ఒక్కరికీ నా కృతజ్ఞతలు. ఈ సక్సెస్ క్రెడిట్ దర్శకుడు సుకుమార్‌తో పాటు సినిమా కోసం కష్టపడి పనిచేసిన టీమ్‌కు దక్కుతుంది. ఆయన సీన్ చెప్తుంటే పిచ్చెక్కిపోతుంది. ఈ సినిమా కోసం వెచ్చించిన ఐదేళ్లు నాకెంతో ప్రత్యేకం. ఈ సినిమా అందరికీ జీవితాంతం గుర్తుండిపోతుంది. 'పుష్ప 3' ఓ అద్భుతం" అని 'పుష్ప 2' థ్యాంక్స్ మీట్‌లో అల్లు అర్జున్ అన్నారు. దర్శకుడు సుకుమార్ మాట్లాడుతూ "మైత్రీ మూవీస్ సీఈఓ చెర్రీ సలహాతోనే 'పుష్ప' మూడు భాగాలుగా తయారైంది. ఈ విజయం మైత్రీ మూవీ మేకర్స్‌కి అంకితం చేస్తున్నాను. ఈ ప్రపంచంలో నన్ను ఎక్కువగా నమ్మే వ్యక్తి అల్లు అర్జున్" అని చెప్పారు. "ఈ సినిమా విజయం ఎంతో మంది కష్టంతో వచ్చింది. ఈ విజయానికి కారణమైన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు" అని నిర్మాత యలమంచిలి రవిశంకర్ అన్నారు. "సినిమా అంచనాలను మించి కలెక్ట్ చేస్తుందని అనుకున్నాం కానీ.. ఇంత ఘనవిజయం సాధిస్తుందని అనుకోలేదు" అని నిర్మాత నవీన్ యెర్నేని తెలిపారు.

'లూసిఫర్ 2'లో హాలీవుడ్ యాక్టర్లు



మోహన్‌లాల్ ప్రధాన పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎల్ 2 ఈ ఎంపురాన్'. 'లూసిఫర్' చిత్రానికి సీక్వెల్‌గా ఈ చిత్రం రాబోతుంది. మార్చి 27న పాన్ ఇండియా స్థాయిలో మలయాళం, తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ చేస్తున్నారు. ఆశిర్వాద్ సినిమాస్, లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో మంజు వారియర్, టొవినో థామస్, ఇంద్రజిత్ సుకుమారన్, జైస్ జోస్ కీలక పాత్రల్లో నటించారు. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్, జైస్ జోస్ పోషించిన జేవియర్ పాత్ర పోస్టర్‌ను విడుదల చేశారు. జైస్ జోస్ ఈ మూవీ చిత్రీకరణ అనుభవాలను వీడియో ద్వారా పంచుకున్నారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. కాగా, ఈ చిత్రం గురించి ఓ ఆసక్తికర అప్డేట్ వైరల్ అవుతోంది. ఈ సినిమాలో కొందరు ఇంటర్నేషనల్ యాక్టర్స్ నటిస్తున్నట్టుగా గతంలో వార్తలు వెలువడ్డాయి. అయితే ఇప్పుడు యూకేకు చెందిన ఇద్దరు యాక్షన్ స్టార్స్ నటించారనే వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. హాలీవుడ్‌కు చెందిన ఓ ఏజెన్సీ ఈ సమాచారాన్ని వెల్లడించింది. కొరియన్ అమెరికన్ నటులు రిక్ యూన్, ఆండ్రియా టి వాడర్ కూడా ఈ సినిమాలో నటించనున్నట్లు ఆ ఏజెన్సీ తొలుత సోషల్ మీడియాలో షేర్ చేసి ఆ తర్వాత డిలీట్ చేసినట్లు మాలీవుడ్ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.



ఆ సినిమాను అంగీకరించారా?

హీరోయిన్ శ్రీలీల వరుస ఆఫర్లతో దూసుకుపోతున్నారు. ఇప్పటికే పవన్‌కల్యాణ్‌తో 'ఉస్తాద్ భగత్‌సింగ్', రవితేజతో 'మాస్ జాతర', నితిన్‌తో 'రాబిన్‌హుడ్', శివకార్తికేయన్‌తో 'పరాశక్తి' సినిమాల్లో నటిస్తున్నారీ బ్యూటీ. అయితే, ఆమెకు మరో అసక్తికరమైన ప్రాజెక్ట్‌లో నటించేందుకు ఆఫర్ వచ్చిందని సమాచారం. 2023లో విడుదలై విజయవంతమైన 'మంగళవారం' సినిమా సీక్వెల్‌లో ఆమె నటిస్తున్నట్లు టాక్. తొలి భాగంలో కథానాయికగా నటించిన పాయల్ రాజ్‌పుత్ ఈ చిత్రం సీక్వెల్‌లో నటించట్లేదని తెలుస్తోంది. ఆమె స్థానంలో నటించేందుకు శ్రీలీలకు ఆఫర్ వచ్చిందట. ఇందుకు ఆమె అంగీకరించారా లేదా తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చేవరకూ ఆగాల్సిందే. ప్రస్తుతం ఈ సినిమా స్క్రిప్టు పనుల్లో బిజీగా ఉన్నారు దర్శకుడు అజయ్ భూపతి. ఈ ఏడాదిలోనే సీక్వెల్‌ను పట్టాలెక్కించే ఆలోచనలో ఉన్నారు మేకర్స్.

నటుడిగా నా స్థాయిని పెంచుతుంది

\- రాగ్ మయూర్



'సినిమా బండి, కీడా కోలా' తదితర చిత్రాలతో నటుడిగా రాగ్ మయూర్ చక్కని గుర్తింపు తెచ్చుకున్నారు. ఇటీవలే 'విడుదలైన గాంధీ తాత చెట్టు' చిత్రంలో విలన్‌గా తన నటనకు మరోసారి ప్రేక్షకుల ప్రశంసలు అందుకొన్నారు. ప్రస్తుతం ఆయన 'గరివిడి లక్ష్మి' అనే చిత్రంలో నటిస్తున్నారు. ఈ సందర్భంగా రాగ్ మయూర్ మాట్లాడుతూ 'ఫహద్ ఫాజిల్, రాజ్‌కుమార్ రావు లాంటి నటులు నాకు ఆదర్శం. వారిలా ముందు మంచి నటుడిగా నిరూపించుకొని ఆ తర్వాత హీరోగా ఎదగాలనేది నా ఆలోచన. అందుకే కెరీర్ ఆరంభం నుంచి ఎక్కువగా నటనకు ఆస్కారమున్న పాత్రలను మాత్రమే ఎంచుకుంటూ వస్తున్నాను. నేను హీరోగా నటిస్తున్న 'గరివిడి లక్ష్మి' చిత్రం గ్రామీణ నేపథ్యమున్న ప్రేమకథతో తెరకెక్కుతోంది. నటుడిగా ఇది నన్ను మరో మెట్టు ఎక్కించే చిత్రమవుతుంది. ఉత్తరాంధ్ర ప్రాంతంలో జరిగే కథ ఇది. అక్కడి వేషభాషలను అవగాహన చేసుకునేందుకు కొన్నాళ్లు అక్కడే గడిపాను. 'గాంధీ తాత చెట్టు' చిత్రంలో నా పాత్రకు ప్రేక్షకులు, విమర్శకుల నుంచి చక్కని ప్రశంసలు దక్కడం ఆనందాన్నిచ్చింది' అని చెప్పారు.



ఈ వారమే విడుదల

ఈ సోమవారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
సర్వైవింగ్ బ్లాక్ హాక్ డౌన్	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 10
కథలిక్క నేరమిల్లై	తమిళచిత్రం	ఫిబ్రవరి 10
ది విచ్చ	యానిమేషన్ మూవీ	ఫిబ్రవరి 11
ది కోబ్రా కై 6	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 13
డాగ్ డేస్ అవుట్	యానిమేషన్ సిరీస్	ఫిబ్రవరి 13
ధూమ్‌ధామ్	హిందీ చిత్రం	ఫిబ్రవరి 14
ఐ యామ్ మారీడ్...బట్	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 14
మెలో మూవీ	వెబ్‌సిరీస్	ఫిబ్రవరి 14
అమెజాన్ ప్రైమ్		
మై ఫాల్ట్: లండన్	హాలీవుడ్ మూవీ (తెలుగులో)	ఫిబ్రవరి 13
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
బాబీ ఔర్ రిషీ కీ లవ్ స్టోరీ	హిందీ చిత్రం	ఫిబ్రవరి 11
జీ 5		
ప్యార్ టెస్టింగ్	హిందీ సిరీస్	ఫిబ్రవరి 14
సోనీ లివ్		
మార్కో	మలయాళ చిత్రం	ఫిబ్రవరి 14
ఆహా...		
మధురై పయనం చెన్నై పొన్నుం	తమిళ చిత్రం	ఫిబ్రవరి 14

చార్లీ ఆచూకీ తెలిసిందా?



వీర్ ఖురానా, కోయల్ చద్దాలది పెద్దల కుదుర్చిన పెళ్లి. పెళ్లయిన మొదటి రోజే వారిపై ఓ క్రిమినల్ గ్యాంగ్ దాడి చేస్తుంది. 'ధూమ్ ధామ్'గా పెళ్లి చేసుకొని ఎంతో ఆనందంగా హనీమూన్‌కు సిద్ధమైన ఆ దంపతుల తొలి రాత్రే కాళరాత్రి అవుతుంది. అనుకోని ఆపద వారి జీవితాలను ఎలాంటి ప్రమాదంలోకి నెట్టింది? దాని నుంచి బయటపడేందుకు వారు చేసిన ప్రయత్నాలేంటి? ఈ నేపథ్యంలో ఉత్కంఠభరితంగా సాగే చిత్రం 'ధూమ్‌ధామ్'. 'చార్లీ ఆచూకీ చెప్పండి' అంటూ వేధిస్తున్న గ్యాంగ్‌లోని కొందరు కథానాయిక చేతిలో చావు దెబ్బలు తిని, భంగపడతారు. ఇక అప్పటినుంచి హీరో, హీరోయిన్లు, విలన్ గ్యాంగ్ మధ్య వచ్చే సన్నివేశాలు ఆద్యంతం నవ్వుల్లో ముంచెత్తుతాయి. ఈ చిత్రాన్ని రిషభ్‌సేత్ దర్శకత్వంలో జియో స్టూడియోస్ నిర్మించింది. యామీ గౌతమ్, ప్రతీక్ గాంధీ, పవిత్రా సర్కార్ ప్రధాన తారాగణం.

మేని మెరుపు కోసం...


చర్మం మృదువుగా మంచి ఛాయతో మెరవాలని రకరకాల క్రీమ్‌లు, లోషన్లు వాడుతూ ఉంటారు. వీటిలోని రసాయనాల వల్ల చర్మానికి హాని కలుగవచ్చు. ఆరోగ్యవంతమైన చర్మంతో ముఖం కళకళలాడాలంటే.. నిపుణులు సూచిస్తున్న ఈ జాగ్రత్తలు పాటించవచ్చు.

- కొంతమంది ముఖానికి వేసుకున్న మేకప్‌ను తొలగించకుండా అలాగే నిద్రిస్తుంటారు. దీనివల్ల చర్మం పొడారిపోయి నిర్జీవంగా కనిపిస్తుంది. పడుకునేముందు మేకప్ అంతటినీ టిష్యూ పేపర్ లేదా పలుచని గుడ్డతో మెల్లగా తుడిచేయాలి. చల్లని నీళ్ల చిలకరించుకుంటూ ముఖాన్ని కడుక్కోవాలి. అప్పుడే చర్మ రంధ్రాలు శుభ్రమై తేమతో నిండుతాయి. ముఖం సహజంగా కాంతులీనుతుంది.
- ముఖం జిడ్డుగా ఉందని వేడి నీళ్లతో కడగడంవల్ల చర్మంపై సహజ నూనె ఉత్పత్తి తగ్గిపోతుంది. తేమ నిలవక చర్మం ఎండినట్లయి కళావిహీనంగా మారుతుంది. ముఖాన్ని ఎప్పుడూ గోరువెచ్చని లేదా చల్లని నీళ్లతో మాత్రమే కడుక్కోవాలి.
- ముఖాన్ని గట్టిగా రుద్దుతూ కడగకూడదు. అలా చేస్తే చర్మం మీద ముడుతలు వచ్చే ప్రమాదం ఉంటుంది. ముఖం మీద నీళ్ల చల్లుకుంటూ సున్నితంగా శుభ్రం చేసుకోవాలి. ముఖాన్ని మెత్తని తువాలుతో అద్దుతూ మెల్లగా తుడుచుకోవాలి.
- మొటిమలు వచ్చినప్పుడు వాటిని గిల్లడం, ఒత్తడం చేయకూడదు. ముఖాన్ని సున్నిపిండితో శుభ్రం చేసుకోవాలి. తాజా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు తినాలి. తరచూ మంచినీరు తాగాలి. అయినా మొటిమల తీవ్రత తగ్గకపోతే వైద్యుని సూచన ప్రకారం జాగ్రత్తలు తీసుకోవాలి.



- బయటికి వెళ్లే ముందు ముఖానికి సన్‌స్క్రీన్ లోషన్ రాసుకోవాలి. దీనివల్ల సూర్యుని నుంచి వెలువడే అతినీలలోహిత కిరణాల నుంచి చర్మానికి రక్షణ లభిస్తుంది. చర్మం నల్లబడకుండా ఉంటుంది.
- నిత్యం వ్యాయామం చేస్తూ ఉంటే చర్మంలోని వ్యర్థ పదార్థాలన్నీ చెమట రూపంలో బయటికి వెళ్లిపోతాయి. ప్రతిరోజూ ఉదయం లేదా సాయంత్రం యోగా, ధ్యానం, నడక అలవాటు చేసుకుంటే మనసు ప్రశాంతంగా మారుతుంది. హార్మోన్ల పనితీరు సక్రమంగా ఉంటుంది. ముఖ వర్చస్సు పెరుగుతుంది.

విభిన్నం



మనసుతో మాయ చేస్తుంది

మహిళలు అరుదుగా కనిపించే ఇంద్రజాల రంగాన్ని ఎంచుకొని... అందులో రాణించి, 27 ఏళ్లుగా మెంటలిస్ట్‌గా, ఇల్యూజనిస్ట్‌గా, మెజిషియన్‌గా సత్తా చాటుతున్నారు రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు చెందిన సుహాని షా. తాజాగా హైదరాబాద్ ఫిక్కీ ఫ్లో మహిళా సంస్థ ఆధ్వర్యంలో, మ్యాజిక్ ఆఫ్ మెంటలిజం కార్యక్రమంలో పాల్గొన్న సుహానీను 'నవ్య' పలకరించింది. ఆ విశేషాలు...

"ఆరేళ్ల వయసులోనే ఇంద్రజాలం పట్ల ఆసక్తి ఏర్పడింది. ఆ రోజు నాకిప్పటికీ గుర్తే! అది ఆదివారం. టీవీలో ఒక స్థానిక ఇంద్రజాలికుడి ప్రదర్శన చూస్తున్నాను. అతను ప్రదర్శించిన ఒక చిన్న మ్యాజిక్ నన్ను విపరీతంగా ఆకర్షించేసింది. చాలా మంది పిల్లలు ఇంద్రజాలాన్ని చూసి సంతోషిస్తారు. కానీ నేను ఇంద్రజాలాన్ని చూడడం కాదు, ప్రదర్శించాలని తపన పడ్డాను. ఈ విషయాన్ని నాన్నతో చెప్పి, ఇంద్రజాలికురాలిగా ఎదగాలని ఉందని చెప్పాను. నాన్న నా మాటలను కొట్టిపారేయకుండా, ఆ విద్యను నేర్పే వ్యక్తి కోసం వెతకడం మొదలుపెట్టారు. ఆ క్రమంలో ఇంద్రజాలికుల కోసం తీవ్రంగా అన్వేషించారు. అయితే చాలా కాలం తర్వాత అహ్మదాబాద్‌లోని, కలోల్ అనే గ్రామంలో నివసిస్తున్న ఒక కుటుంబం గురించి తెలిసింది. వాళ్ల ప్రదర్శనల్లో ఇంద్రజాలికులకు సహాయకులుగా వ్యవహరిస్తూ ఉంటారు. నాకు ఆ విద్య నేర్పించమని మా అమ్మానాన్న వాళ్లను ఒప్పించారు. సాధారణంగా ఇంద్రజాలికులు, సహాయకులకు ఇంద్రజాలాన్ని నేర్పిస్తూ ఉంటారు. నా విషయంలో ఆ సహాయకులే నాకు ఇంద్రజాలాన్ని నేర్పించడం జరిగింది. వాళ్ల దగ్గర ఆ విద్య నేర్చుకుని, పూర్తి స్థాయిలో ప్రదర్శన ఇవ్వడానికి నాకు 10 నెలలు పట్టింది. 1997, అక్టోబరు 22న ఆరేళ్ల వయసులో నేను నా మొదటి ప్రదర్శన ఇచ్చాను. అలా దేశవిదేశాల్లో ప్రదర్శనలిస్తూ వస్తున్నాను. ఇప్పటి వరకూ ఈ 27 ఏళ్లలో ప్రపంచవ్యాప్తంగా దాదాపు ఐదు వేల ప్రదర్శనలిచ్చాను.

జీవితమే నేర్పింది

ఇంద్రజాలం నేర్పిస్తే నేర్చుకోగలిగే వీలున్న విద్య. కానీ మైండ్ రీడింగ్ కోసం నేను పూర్తిగా పుస్తకాల మీదే ఆధారపడ్డాను. మానసిక శాస్త్రం, మానవ ప్రవర్తనల గురించి లోతుగా అధ్యయనం చేశాను. వీటికి సంబంధించి పుస్తకాలు కూడా రాశాను. అలా ఒక సమయంలో మానసిక శాస్త్రం, మానవ ప్రవర్తనల పట్ల నాకున్న పరిజ్ఞానాన్ని ఇంద్రజాలంతో ముడిపెట్టాలని నిర్ణయించుకున్నాను. ఆ విధంగా మెంటలిస్ట్ (ఇతరుల మనసులో ఉన్న విషయాలను చెప్పగలిగే కళాకారుడు)ను అయ్యాను. ఒకటో తరగతిలోనే చదువుకు స్వస్తి చెప్పినా, రోజువారీ అనుభవాలు, వ్యక్తుల నుంచి కొత్త విషయాలు నిరంతరంగా నేర్చుకుంటూనే ఎదిగాను. చదువు మానేసినందుకు నాకు బాధ లేదు. మిగతా పిల్లల కంటే మెరుగ్గా బాల్యాన్ని గడపగలిగాననే సంతృప్తి ఉంది. నేర్పించేవారెవరూ లేరు కాబట్టి అన్నీ స్వయంగా నేర్చుకునే అలవాటు మరింత మెరుగుపడింది. నేర్చుకోవాలనుకునేవారు ఎప్పటికీ నేర్చుకుంటూనే ఉంటారని అమ్మ అంటూ ఉంటుంది. అది అక్షరాలా నిజం. నేర్చుకోవాలనే కోరిక లేని పిల్లలను ఎంత మంచి బడిలో వేసినా రాణించలేరు.

నకిలీ బాబాల గురించి కళ్లు తెరిపిస్తూ...

మెంటలిజం అన్నది అతీంద్రియ విద్య కాదు. అదొక నైపుణ్యం, ఒక కళ. కానీ దీనికి దైవత్వాన్ని ఆపాదించి, అతీంద్రియ శక్తుల్లా ప్రదర్శిస్తూ, అమాయకులను మోసం చేసి పబ్బం గడుపుకునే నకిలీ బాబాలు, సన్యాసులను ఎంతోమందిని మనం చూస్తున్నాం. గారడీ విద్యలు ప్రదర్శించే ఇలాంటి వాళ్లను చూసి మోసపోకుండా ప్రజలను చైతన్యవంతం చేయడానికి నా ఇంద్రజాలం ఉపయోగపడుతుందనే భావిస్తున్నా. మెంటలిజంతో మూఢనమ్మకాలను పారదోలాలన్నది నా లక్ష్యం. కాబట్టే నా ప్రదర్శనల్లో ఇంద్రజాల విద్య పట్ల ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తూ ఉంటాను. ఎంతో మంది నా దగ్గరకు వచ్చి, వాళ్ల కష్టాలను నా ఇంద్రజాల శక్తితో మాయం చేయమని, సమస్యలను పరిష్కరించమని అడుగుతూ ఉంటారు. ప్రజల విశ్వాసమే అతి పెద్ద ఇంద్రజాలం. మనల్ని మనం నమ్మగలిగితే మనమే ఒక ఇంద్రజాలంలా మారిపోయి జీవితాలను మెరుగు పరుచుకోగలుగుతాం! ప్రజల భయాలనే కొందరు వ్యాపారాలుగా మలుచుకుంటూ ఉంటారు. కానీ వాళ్ల చేతుల్లో మోసపోకుండా ఉండాలంటే ప్రజలు మెలకువగా వ్యవహరిస్తూ, స్వయంస్వావలంబన సాధించాలి.



ఎవరైనా నేర్చుకోవచ్చు

ఇంద్రజాలం అన్నది పూర్తిగా భిన్నమైన రహస్య కళ. మెజీషియన్, మెంటలిస్ట్, ఇల్యూజనిస్ట్ ఇవన్నీ భిన్నమైన నైపుణ్యాల్లా కనిపించినా మొత్తం ఇంద్రజాలం కోవకే చెందుతాయి. సాధారణంగా ఈ రంగంలోకి రావడానికి అమ్మాయిలెవరూ ఇష్టపడరు. కానీ ఆసక్తి ఉంటే అమ్మాయిలు రాణించలేని రంగమంటూ ఏదీ లేదు. ఇంద్రజాలం పట్ల ఆసక్తి ఉన్నవాళ్లు యూట్యూబ్ చూసి చిన్నచిన్న ట్రిక్స్ నేర్చుకోవచ్చు. వాటిని సమర్థంగా ప్రదర్శించే స్థాయికి చేరుకున్న తర్వాత, ఆ ప్రయాణంలో ఇంద్రజాలంలో ఏ జోనర్ వాళ్లకు సరైనదో గ్రహించి ఆ దిశగా ప్రయాణించవచ్చు. ఇంద్రజాలాన్ని నేర్పించే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయి. వాటిని కూడా సద్వినియోగం చేసుకోవచ్చు. ఇప్పటి తరం ఎంతో తెలివైనది. వాళ్లకు కొత్తగా దేన్నీ నేర్పించవలసిన అవసరం లేదు. అయితే ప్రపంచానికి దయ, ప్రేమ, కరుణ, ఆనందాల అవసరం ఉంది. కాబట్టి వాటిని నచ్చిన మార్గంలో ఈ ప్రపంచానికి అందించమని నేటి తరాన్ని నేను కోరుకుంటున్నాను."

• గోగుమళ్ల కవిత

వ్యర్థాలను వదిలించారు...
ఆదాయ మార్గం చూపించారు!

ఆదాయాన్నిచ్చే సాగుని మానుకోలేక, వ్యర్థాల్ని వదిలించుకోలేక సతమతమవుతున్న రైతులను కొత్తదారిలో నడిపించారు అనసూయ జెనా. భర్తతో కలిసి ఆమె చేసిన ప్రయత్నం... అరటి వ్యర్థాలను ఆదాయ మార్గంగా మార్చింది. వెయ్యికి పైగా రైతు కుటుంబాల ఆర్థిక సుస్థిరతకు దోహదం చేసింది. "నిబద్ధతతో, కలిసికట్టుగా పని చేయడమే మంచి ఫలితాలు సాధించే మార్గం" అంటున్న అనసూయ కథ ఆమె మాటల్లోనే...



"అరటి చెట్ల నుంచి గెలలు తీసేసిన తరువాత.... నరికిన చెట్లను తోటలలోంచి తొలగించడం శ్రమతోనే కాదు, ఖర్చుతో కూడా కూడుకున్న వ్యవహారం. కూలీలకు రోజుకు రెండువేల రూపాయల వరకూ ఇవ్వాలి. సాధారణ రైతులు ఈ ఖర్చు భరించలేరు. దాంతో తమ తోటల పక్కనే వాటిని పడేసి, ఎండిపోయిన తరువాత కాల్చేసేవారు. ఆ పొగ చుట్టు పక్కల ప్రాంతాల్లో వ్యాపించేది. ఇక మరికొందరు రైతులు ఆ వ్యర్థాలను ఊరి బయట పారబోసేవారు. ఆ కుప్పలు పెద్ద గుట్టల్లా ఉండేవి. ఎండకు ఎండి, వానకు తడిసి, కుళ్లిపోవడంతో.. ఆ వైపు వెళ్ళలేనంత దుర్వాసన. ఈ వాతావరణ కాలుష్యం ప్రభావం సమీప గ్రామాల్లో కూడా తీవ్రంగానే ఉండేది. కొన్నేళ్ల క్రితం మాకు ప్రతిరోజూ ఎదురయ్యే దృశ్యాలివి.

వాటికి అర్థం కల్పించేందుకు...

మాది ఒడిశా రాష్ట్రం ఖుర్దా జిల్లాలోని బలిపట్న. మా జిల్లాలో సాగుచేసే వాణిజ్య పంటల్లో అరటి ప్రధానమైనది. ముఖ్యంగా మాకు దాదాపు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న బనమాలిపూర్ అరటి పంటకు ప్రసిద్ధి. దాదాపు ప్రతి ఇంటి పెరట్లోనూ అరటి మొక్కలు ఉంటాయి. రైతులకు ఆ పంట జీవనాధారమైతే, దాని ద్వారా వచ్చే వ్యర్థాలు తీవ్ర అనారోగ్యానికి కారణమయ్యేవి. నా భర్త కాశీనాథ్ జెనా గత ముప్పయ్యేళ్ళ నుంచి రూరల్ డెవలప్‌మెంట్ కన్సల్టెంట్‌గా పని చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటు, అణగారిన వర్గాలకు జీవనోపాధి కల్పించడం లాంటి కార్యక్రమాల్లో నిమగ్నమై ఉండేవారు. తరచుగా మేము బనమాలిపురా మీదుగా ప్రయాణించేవాళ్ళం. అప్పుడు అరటి వ్యర్థాల సమస్యే మా సంభాషణల్లో ప్రధానంగా ఉండేది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే... రాబోయే రోజుల్లో దుష్ప్రభావాలు మరింత పెరిగిపోతాయనే ఆందోళన కలిగింది. కొందరు రైతులతో మాట్లాడినప్పుడు... పంట కోత తరువాత వ్యర్థాల్ని వదిలించుకోవడమే వారి ప్రధాన సమస్య అని గ్రహించాం. దీన్ని ఇతర ప్రాంతాల్లో ఎలా పరిష్కరిస్తున్నారో తెలుసుకోడానికి నా భర్త ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్రల్లో పర్యటించారు. అరటి బెరళ్ళ నుంచి నారు తీసి వస్త్రాలు నేయడం, ఉత్పత్తుల తయారీ లాంటివి గమనించారు. ఈ విధంగా వ్యర్థాలకు ఒక అర్థం కల్పించవచ్చనిపించింది. ఎన్నో నెలలపాటు పరిశోధన చేసిన తరువాత... 2021లో 'జయదేవ్ బనానా ఫార్మర్స్ అండ్ ఆర్టిసన్స్ అసోసియేషన్'ను ఏర్పాటు చేశాం.



మూడు విభాగాల్లో...

ఆ తరువాత ఒక ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు చేసి, కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా (ఎంఎస్ఎంఇ) మంత్రిత్వశాఖకు అందజేశాం. 'స్పెషల్ పర్పస్ వెహికిల్' (ఎస్‌పీవీ)గా ఈ సంఘాన్ని పరిగణిస్తూ... గ్రామీణ ఉపాధి, ఆర్థికాభివృద్ధి కోసం సహకరించడానికి ఆ శాఖ అంగీకరించింది. తొలి విడతగా, 350 మంది రైతులు మాతో చేరారు. ఆ సంఖ్య క్రమంగా పెరిగి ఇప్పుడు వెయ్యి దాటిపోయింది. అలాగే దాదాపు 40 మంది యువతకు, మహిళలకు ఉద్యోగాలను మా కల్పించాం. ఉత్పత్తుల విషయానికి వస్తే... వాటిని ఆహారం, వ్యవసాయం, ఉపయుక్తమైన వస్తువులు అనే మూడు విభాగాల్లో తయారు చేస్తున్నాం. అరటి దవ్వ పచ్చడి, జామ్, మురబ్బా, జ్యూస్, వడియాల్లాంటి ఆహార ఉత్పత్తులు, భూమి సారాన్ని పెంచే సూక్ష్మ పోషకాలు ఉన్న 'జీవసార', అలాగే అరటి నారతో బ్యాగ్‌లు, కోస్టర్లు, బాస్కెట్లు, గిఫ్ట్ బాక్సులు, టేబుల్ మ్యాట్స్.. ఇలా అనేక ఉత్పత్తులను తయారు చేయించి విక్రయిస్తున్నాం. ఇంతకుముందు రైతుల వద్దకు మేమే వెళ్ళి.. వ్యర్థాలను సేకరించేవాళ్ళం, ఇప్పుడు వారే నేరుగా మా కేంద్రానికి వచ్చి విక్రయిస్తున్నారు. ఎలాంటి ఖర్చు లేకుండానే వారి పొలాలు తదుపరి పంట కోసం శుభ్రంగా మారుతున్నాయి. ఉత్పత్తుల తయారీ ద్వారా లాభాలు కూడా దక్కుతున్నాయి.

పురస్కారాలు... ప్రశంసలు



ఖుర్దాతోపాటు కటక్, పూరీ జిల్లాల రైతులు కూడా మా సంఘంలో భాగస్వాములయ్యారు. వారు తమ పంట దిగుబడి వల్ల వచ్చే మొత్తంతో పాటు ఈ వ్యర్థాల ద్వారా సగటున రూ.7 వేల నుంచి రూ.10 వేల మధ్య ఆదాయం పొందుతున్నారు. మా కార్యక్రమాలకు గుర్తింపుగా... రెండేళ్ళ నుంచి ఎన్నో పురస్కారాలు లభించాయి. అలాగే దేశంలోని పలుచోట్ల మేము ఏర్పాటు చేసిన ప్రదర్శనలకు సర్వత్రా ప్రశంసలు లభించాయి. ఇప్పుడు మా ప్రాంతంలో అరటి వ్యర్థాలను తగులబెట్టడం, కుప్పలుగా పోయడం లాంటి దృశ్యాలు కనిపించడం లేదు. మరోవైపు రైతులకు అదనపు ఆదాయం కూడా లభిస్తోంది. ఒక సమస్య పరిష్కారానికి అందరూ కలిసికట్టుగా నిలబడి, నిబద్ధతతో పని చేస్తే సత్ఫలితాలు వస్తాయనడానికి మా సంస్థ ఒక ఉదాహరణగా నిలుస్తోంది. ఇంతకన్నా సంతోషం, సంతృప్తి ఇంకేం ఉంటుంది?"

ముత్యాలతో మురిపెంగా...

కొత్త ఫ్యాషన్లు ఎన్ని వచ్చినా... ముత్యాల నగలపై మహిళలకుండే మక్కువ తగ్గదు. సాధారణంగా ఉంటూ చూడగానే ఆకట్టుకునే ముత్యాల ఆభరణాలు అన్ని వయసులవారికీ అందంగా నప్పుతాయి. రోజువారీ పెట్టుకోవడానికి వీలుగా ఉండే ట్రెండీ 'ముత్యాల నగలు' ఇవే...



లాకెట్: తెల్లని సీజెడ్ రాయికి అంత కన్నా పెద్ద సైజు ముత్యాన్ని జోడించి లాకెట్‌లా రూపొందిస్తారు. దీనిని సన్నని బంగారు గొలుసుకి అమరుస్తారు. ఈ ముత్యం గొలుసు మెడ వరకు వస్తుంది. అన్ని రకాల దుస్తుల మీద చక్కగా అమరుతుంది. టీషర్ట్, జీన్స్ లాంటి మోడరన్ దుస్తులు ధరించే యువతులకు బాగుంటుంది.



బ్రాస్‌లెట్: అంత చిన్నవి కాకుండా కొద్దిగా పెద్ద ముత్యాలను మందపాటి దారంతో కూర్చి బ్రాస్‌లెట్‌ను తయారు చేస్తారు. ఈ ముత్యాల బ్రాస్‌లెట్‌ను చేతికి పెట్టుకుంటే ధరించిన డ్రెస్ ఆకర్షణీయంగా కనిపిస్తుంది. నేవీ బ్లూ, ముదురు గులాబీ, లావెండర్ రంగు దుస్తుల మీద హుందాగా ఉంటుంది. దీనిని ఉద్యోగినులు ఎక్కువగా ఎంపిక చేసుకుంటున్నారు.



ఉంగరం: శ్వేత వర్ణంలో మెరిసే ముత్యాన్ని బంగారు ఉంగరంలో అమరుస్తారు. ఈ ముత్యపు ఉంగరం సంప్రదాయ దుస్తులతోపాటు ఆధునిక దుస్తుల మీద కూడా రాయల్‌గా కనిపిస్తుంది. కాలేజీ యువతుల నుంచి మధ్య వయసు మహిళల వరకు అందరూ ఈ ఉంగరాన్ని ఎంపిక చేసుకుంటున్నారు.



కమ్మలు: ముత్యాలతో రూపొందించిన వివిధ రకాల డ్రాప్స్, స్టడ్స్, హూప్స్ రింగ్స్ ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్నాయి. ఉద్యోగినులతోపాటు గృహిణులు, కాలేజీలకు వెళ్లే అమ్మాయిలు వీటిని పెట్టుకోవడానికి ఇష్టపడుతున్నారు. ఎలాంటి ముఖాకృతికైనా ఈ ముత్యాల కమ్మలు సొగసును అందిస్తాయి.

ఆలుగడ్డలు నిల్వ ఉండాలంటే...

బజారు నుంచి తెచ్చిన ఆలుగడ్డలు కొద్ది రోజులకే మొలకెత్తడం చూస్తుంటాం. ఇలా మొలకలు వచ్చిన ఆలుగడ్డను తినడం ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. అయితే కొన్ని చిట్కాలు పాటిస్తే ఆలుగడ్డలను ఎక్కువ రోజులు తాజాగా ఉంచుకోవచ్చు.



- ఆలుగడ్డలను గాలి తగిలేలా ఉంచాలి. నేరుగా సూర్యకాంతి పడకుండా చూసుకోవాలి. ఎండ తగిలితే ఆకుపచ్చ రంగులోకి మారి చేదుగా అవుతాయి. చీకటి ప్రదేశాల్లో ఉంచితే ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి.
- తేమ తగిలితే ఆలుగడ్డలు తొందరగా పాడవుతాయి. వీటిని ఫ్రిజ్‌లో కూడా పెట్టకూడదు. చల్లదనం వల్ల వాటిలోని పిండిపదార్థం చక్కెరగా మారుతుంది. దీంతో అవి సహజ రుచిని కోల్పోతాయి.
- ఆలుగడ్డలను గోనె సంచులు, వెదురు బుట్టలు, కాగితం సంచుల్లో గాలి ఆడేలా నిల్వ చేయడం మంచిది. అలాకాకుండా ప్లాస్టిక్ కవర్లలో మూసి ఉంచితే మొలకలు వచ్చి తొందరగా పాడవుతాయి.
- ఆలుగడ్డలను టమాటాలు, నిమ్మకాయలు, ఉల్లిపాయలు, అరటిపండ్లతో కలిపి ఉంచకూడదు. వీటి నుంచి వెలువడే ఎథిలీన్ వాయువు వల్ల ఆలుగడ్డలపై పసుపు రంగు మొలకలు వచ్చేస్తాయి. ఇలా మొలకెత్తినవాటిలో శరీరానికి హాని కలిగించే గ్లైకోఆల్కలైట్ తయారవుతుంది.
- ఆలుగడ్డలను కొనేటప్పుడు గట్టిగా ఉన్నవాటినే తీసుకోవాలి. ఏమాత్రం మెత్తగా ఉన్నా అవి త్వరగా కుళ్లిపోతాయి.
- కొంతమంది ఆలుగడ్డలను కొన్నతరవాత వాటిపై మట్టి ఉందని నీళ్లలో నానబెట్టి కడిగేస్తూ ఉంటారు. ఇలా చేయడం వల్ల ఆలుగడ్డలు ఎక్కువ రోజులు నిల్వ ఉండవు. వాటికి నీళ్ల తగలకుండా ఉంటే చాలా రోజులు తాజాగా ఉంటాయి.



జ్యోతి హ్యాట్రిక్ పసిడి

జాతీయ క్రీడల్లో తెలుగు అథ్లెట్ల జోరు

డెహ్రాడూన్: స్టార్ స్ప్రింటర్, తెలుగమ్మాయి జ్యోతి యర్రాజీ జాతీయ క్రీడల్లో అదరగొట్టింది. వరుసగా మూడోసారి చాంపియన్‌గా నిలిచి హ్యాట్రిక్ పసిడి దక్కించుకుంది. ఆదివారం ఇక్కడ జరిగిన మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి 13.10 సెకన్లలో గమ్యాన్ని చేరి విజేతగా నిలిచింది. ఈ క్రమంలో 2023 క్రీడల్లో తన పేరిటేనున్న 13.22 సెకన్ల రికార్డును జ్యోతి అధిగమించింది. విశాఖ పట్నానికి చెందిన 25 ఏళ్ల జ్యోతికిది జాతీయ క్రీడల్లో వరుసగా మూడో స్వర్ణం కావడం విశేషం. అంతకుముందు 2022 (గుజరాత్), 2023 (గోవా) టోర్నీల్లోనూ ఆమె పసిడి అందుకుంది. ఇక, పురుషుల 110 మీటర్ల హర్డిల్స్‌లో మహారాష్ట్రకు చెందిన తేజాస్ షిర్సే (13.65 సెకన్లు) విజేతగా నిలిచాడు. గత రెండు క్రీడల్లోనూ స్వర్ణం నెగ్గిన తేజాస్‌కు ఇది హ్యాట్రిక్ విజయం. కాగా, ఆదివారం నాటి పోటీల్లో జ్యోతి స్వర్ణంతో కలిపి ఆంధ్రప్రదేశ్‌కు రెండు పతకాలు దక్కగా, తెలంగాణ కూడా రెండు పతకాలు గెలిచింది. పురుషుల డెకాథ్లాన్‌లో ఏపీకి చెందిన రోహిత్ రోమన్ పాటిల్ (6753 పాయింట్లు) మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకం దక్కించుకున్నాడు. ఇక, మహిళల 4.100 మీటర్ల రిలే ఈవెంట్‌లో నందిని, నిత్య, సింధు, మైథిలిలతో కూడిన తెలంగాణ బృందం 47.58 సెకన్లలో రేసు ముగించి మూడోస్థానంతో కాంస్య పతకం సాధించింది. ఇక, మహిళల సంప్రదాయ నెట్‌బాల్‌లో తెలంగాణ జట్టు కాంస్యం గెలిచింది. ఉత్తరాఖండ్‌తో జరిగిన కాంస్యం పోరును తెలంగాణ 42-42 స్కోరుతో టైగా ముగించింది. దీంతో ఇరుజట్లకు కాంస్య పతకం అందజేశారు.


రోహిత్

తొలి క్వార్టర్స్‌లో గుకేష్ ఓటమి

వీసెన్‌హాస్ (జర్మనీ): గ్రాండ్‌స్లామ్ టూర్ చెస్ టోర్నీలో క్వార్టర్‌ఫైనల్ తొలి గేమ్‌లో ప్రపంచ చాంపియన్ గుకేష్ దొమ్మరాజు పరాజయం చవిచూశాడు. ఆదివారం హోరాహోరీగా జరిగిన గేమ్‌లో నల్లపావులతో ఆడిన అమెరికా గ్రాండ్‌మాస్టర్ ఫాబియానో కరువానా 40 ఎత్తుల్లో గుకేష్‌పై నెగ్గాడు. ఇతర క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ల్లో అబ్దుసతోరోవ్‌పై కార్ల్‌సన్, అలీరెజాపై కీమర్ గెలుపొందారు. సిందరోవ్, నకామురా మధ్య గేమ్ డ్రాగా ముగిసింది. సోమవారం రెండో రౌండ్ క్వార్టర్ ఫైనల్స్ జరుగుతాయి.

ఆహా.. ఈ ఆట కోసమే కదా భారత క్రికెట్ అభిమానులు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూసింది. ఫామ్‌లో లేడు.. వయసు మీరుతోంది.. జట్టులో అవసరమా? అనే విమర్శలను తిప్పికొడుతూ ఒకే ఒక్క ఇన్నింగ్స్‌తో హిట్‌మ్యాన్ కమ్‌బ్యాక్ అయ్యాడు. బౌలర్లను తుత్తునియలు చేస్తూ ఫ్లిక్, పుల్, కవర్‌డ్రైవ్, లాఫ్టెడ్ ఆఫ్ డ్రైవ్స్, స్వీప్.. ఇలా అన్ని రకాల షాట్లతో ఫ్యాన్స్‌కు విందు భోజనమే అందించాడు. ఆఖరి పది ఇన్నింగ్స్‌లో కనీసం ఒక్కదాంట్లోనైనా 20 పరుగులైనా సాధించని రోహిత్ శర్మ (90 బంతుల్లో 12 ఫోర్లు, 7 సిక్సర్లతో 119) కటక్‌లో గర్జించాడు. తాను క్రీజులో కుదురుకుంటే ఎంత ప్రమాదకరమో ఎటాకింగ్ గేమ్‌తో ప్రత్యర్థికి రుచి చూపిస్తూ.. 16 నెలల తర్వాత సెంచరీతో మురిపించాడు. రో'హిట్'తో రెండో వన్డేలోనూ ఇంగ్లండ్‌ను భారత్ చిత్తుచేసింది. మరో మ్యాచ్ ఉండగానే మూడు వన్డేల సిరీస్‌ను కైవసం చేసుకుంది.

రోహిట్ అయ్యాడోచ్!

- గిల్ హాఫ్ సెంచరీ
- 2-0తో భారత్‌దే సిరీస్
- రెండో వన్డేలోనూ ఇంగ్లండ్ ఓటమి

76 బంతుల్లో శతకం


గిల్ (60)

కటక్: రోహిత్ శర్మ శతకంతో ఆదివారం ఇంగ్లండ్‌తో జరిగిన రెండో వన్డేలో భారత్ 4 వికెట్ల తేడాతో ఘనవిజయం అందుకుంది. తద్వారా 2-0తో మరో మ్యాచ్ ఉండగానే సిరీస్‌ను కూడా ఖాతాలో వేసుకుంది. ఆఖరిదైన మూడో వన్డే బుధవారం అహ్మదాబాద్‌లో జరుగుతుంది. మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 49.5 ఓవర్లలో 304 పరుగులకు ఆలౌటైంది. జో రూట్ (69), బెన్ డకెట్ (65), లివింగ్‌స్టోన్ (41), కెప్టెన్ జోస్ బట్లర్ (34), బ్రూక్ (31) కలిసికట్టుగా రాణించారు. జడేజాకు 3 వికెట్లు దక్కాయి. భారీ ఛేదనలో భారత్ 44.3 ఓవర్లలో 6 వికెట్లకు 308 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ (60), శ్రేయాస్ అయ్యర్ (44), అక్షర్ పటేల్ (41 నాటౌట్) ఆకట్టుకున్నారు. ఒవర్టన్‌కు రెండు వికెట్లు లభించాయి. సెంచరీ హీరో రోహిత్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

కెప్టెన్ జోరు: భారీ ఛేదనలో భారత్‌కు అదిరిపోయే ఆరంభం దక్కింది. ఓపెనర్లు రోహిత్, గిల్ ఇంగ్లండ్ బౌలర్లను యథేచ్ఛగా ఆడేసుకున్నారు. పిచ్ నుంచి బౌలర్లకు ఎలాంటి సహకారం అందకపోవడంతో భారత్‌కు అలవోకగా పరుగులు సమకూరాయి. ముఖ్యంగా రోహిత్ రెండో ఓవర్‌లో వరుసగా 4,6తో స్టేడియంలో ఫుల్ జోష్‌ను నింపాడు. ఇక అతను కుదురుకున్నట్టే అని ఫ్యాన్స్ అంతా సంబరపడ్డారు. వారిని ఏ మాత్రం నిరాశకు గురి చేయకుండా రోహిత్ ఆ తర్వాత కవర్ డ్రైవ్‌తో, ఫ్లిక్ షాట్‌తో సంధించిన సిక్సర్లు మ్యాచ్‌లో హైలైట్‌గా నిలిచాయి. అయితే ఈ దశలో ఏడో ఓవర్‌లో ఓ ఫ్లడ్‌లైట్ మొరాయించడంతో అరగంట పాటు ఆట ఆగిపోయింది. మ్యాచ్ మొదలైన తర్వాత కూడా రోహిత్ జోరు తగ్గలేదు. వరుస బౌండరీలతో 30 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేశాడు. అటు 15వ ఓవర్‌లో రెండు ఫోర్లతో గిల్ కూడా 45 బంతుల్లో ఈ ఫిఫ్టీ సాధించాడు. కానీ ఒవర్టన్ అతడిని సూపర్ యార్కర్‌తో బౌల్డ్ చేయడంతో తొలి వికెట్‌కు 136 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. మరోవైపు విరాట్ కోహ్లీ (5) నిరాశపరుస్తూ రషీద్ ఓవర్‌లో అవుటయ్యాడు. అటు శతకానికి దగ్గరగా వచ్చిన రోహిత్ మాత్రం దూకుడు కొనసాగించాడు. 26వ ఓవర్‌లో ముందుకు వచ్చి మరీ లాంగాఫ్‌లో బాదిన సిక్సర్‌తో రోహిత్ కెరీర్‌లో 32వ శతకాన్ని పూర్తి చేశాడు. ఆ వెంటనే రెండు వరుస ఫోర్లతో 15 రన్స్ సమకూరాయి. అటు శ్రేయాస్ సైతం చెలరేగి ఉడ్ ఓవర్‌లో 4,4,6తో 17 రన్స్ రాబట్టాడు. సెంచరీ తర్వాత కాస్త అలసిపోయినట్టు కనిపించిన రోహిత్ ఓ ఫుల్‌టాస్ బంతికి రషీద్‌కు క్యాచ్ ఇవ్వడంతో మూడో వికెట్‌కు 70 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అప్పటికే పటిష్ఠ స్థితికి చేరిన భారత్‌కు శ్రేయాస్-అక్షర్ జోడీ నాలుగో వికెట్‌కు 38 పరుగులు జోడించింది. చక్కగా కుదురుకున్న శ్రేయాస్ సమన్వయలోపంతో రనౌట్‌గా వెనుదిరిగాడు. ఆ వెంటనే కేఎల్ రాహుల్ (10), హార్దిక్ పాండ్యా (10) అవుటయ్యారు. కానీ లక్ష్యం 48 బంతుల్లో 19 పరుగులే ఉండడంతో అక్షర్, జడేజా (11 నాటౌట్) 45వ ఓవర్‌లో విజయ లాంఛనాన్ని పూర్తి చేశారు.


జడేజా (3/35)

కలిసికట్టుగా: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ బ్యాటర్లు ఈసారి నిలకడ చూపారు. టాప్-6 బ్యాటర్ల సమష్టి రాణింపుతో జట్టు స్కోరు 300 దాటగలిగింది. అయితే ఆరంభంలో చూపిన జోరు మధ్య ఓవర్లలో కాస్త తగ్గింది. ఓపెనర్లు డకెట్, సాల్ట్ (26) తొలి పవర్‌ప్లేలో వేగంగా ఆడడంతో 75 పరుగులు వచ్చాయి. అయితే 11వ ఓవర్‌లో సాల్ట్‌ను స్పిన్నర్ వరుణ్ అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 81 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు హాఫ్ సెంచరీతో ఊపు మీదున్న డకెట్‌ను జడేజా తన తొలి ఓవర్‌లోనే అవుట్ చేశాడు. అనంతరం రూట్, బ్రూక్ జోడీ భారత్‌ను విసిగిస్తూ మూడో వికెట్‌కు 66 పరుగులు జోడించింది. బ్రూక్ వెనుదిరిగాక రూట్‌కు బట్లర్ జత కలిశాడు. ఇద్దరూ నిలకడను ప్రదర్శించడంతో 320+ స్కోరు కూడా సాధ్యమేననిపించింది. ఇదే జోరులో రూట్ ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. కానీ 39వ ఓవర్‌లో బట్లర్‌ను హార్దిక్ అవుట్ చేయడంతో నాలుగో వికెట్‌కు 51 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. కాసేపటికే జడేజా వరుస ఓవర్లలో కీలక రూట్‌తో పాటు ఒవర్టన్ (6)ను వెనక్కి పంపడంతో జట్టు 258 పరుగులకు ఆరు వికెట్లు కోల్పోయింది. అప్పటికి మరో ఐదు ఓవర్లే ఉండడంతో స్కోరు 300 దాటదనిపించింది. అయితే లివింగ్‌స్టోన్, రషీద్ (14) ఆఖరి నాలుగు ఓవర్లలోనే 43 రన్స్ రాబట్టి ఇంగ్లండ్ భారీ స్కోరుకు కారణమయ్యారు.


రోహిత్ శర్మ (90 బంతుల్లో 12 ఫోర్లు, 7 సిక్సర్లతో 119)

ఒక్క ఇన్నింగ్స్‌తో..

ఎన్ని విమర్శలు..ఎంతటి అవమానం! కెప్టెన్‌గా ఉండీ టెస్ట్ మ్యాచ్ నుంచి తప్పుకోవాల్సిన దుస్థితి. టీ20 కెరీర్ ముగిసింది. ఇక టెస్ట్‌ల నుంచీ రిటైర్ కావడమే ఉత్తమం అన్న సూచనలు. ఇటీవలి కాలంలో ఏ భారత స్టార్ క్రికెటర్‌కూ ఇంతటి గడ్డు పరిస్థితి ఎదురు కాలేదు. కానీ అన్నింటినీ పంటి బిగువున అదిమిపట్టాడు టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ. ఎవరెన్ని విధాలుగా మాటల దాడి చేసినా సంయమనం కోల్పోలేదు. ప్రతి విమర్శలు చేయలేదు. తనదైన రోజుకోసం ఎదురుచూశాడు. ఆ అవకాశం ఇంగ్లండ్‌తో రెండో వన్డే రూపంలో లభించింది. అంతే..దెబ్బతిన్న పులిలా గర్జించాడు. తనలోని బ్యాటర్‌ను వెలికి తీశాడు. ఇంగ్లండ్ పేసర్లు, స్పిన్నర్ల భరతం పట్టి పరుగుల సునామీ సృష్టించాడు. తన పని అయిపోలేదని, ఇంకా ఎంతో క్రికెట్ మిగిలి ఉందని నిరూపించాడు. ఇన్నింగ్స్ ఆరంభం నుంచే ఎడాపెడా ఫోర్లు, సిక్సర్లతో కదం తొక్కి 'హిట్‌మ్యాన్'ను మరోసారి ఆవిష్కరించాడు. మ్యాచ్‌లో రోహిత్ సంధించిన ఫోర్లు, సిక్సర్ల గురించి ఎంత వర్ణించినా తక్కువే. పేసర్ అట్కిన్సన్ వేసిన భారత ఇన్నింగ్స్ రెండో ఓవర్లో-క్రీజు బయటకు వచ్చి కొట్టిన బౌండరీతోపాటు తదుపరి బంతిని ఎలాంటి ప్రయాస లేకుండా ఫ్లిక్ షాట్‌తో సిక్సర్‌గా మలుస్తూ తన 'తుఫాన్'కు శ్రీకారం చుట్టిన రోహిత్ కిక్కిరిసిన బారాబతి స్టేడియాన్ని హోరెత్తించాడు. రషీద్ బౌలింగ్‌లో కట్ షాట్‌తో హాఫ్ సెంచరీ సాధించిన రోహిత్-అదే రషీద్ బంతిని లాంగాఫ్‌లో అద్భుత సిక్సర్‌గా కొట్టి తనదైన శైలిలో సెంచరీ పూరించాడు. దాంతో ఫ్యాన్స్ హర్షధ్వానాలతో స్టేడియం దద్దరిల్లింది. ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీకి ముందు ఈ ఇన్నింగ్స్‌తో ఎనలేని ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేసుకున్న రోహిత్..ప్రత్యర్థులకు హెచ్చరికలు పంపడంతోపాటు విమర్శకుల నోళ్లు మూయించాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

2 వన్డేల్లో ఎక్కువ సిక్సర్లు (338) బాదిన రెండో బ్యాటర్‌గా రోహిత్. షాహిద్ అఫ్రిదీ (351) టాప్‌లో ఉన్నాడు. అలాగే రోహిత్‌కు కెరీర్‌లో ఇది రెండో వేగవంతమైన శతకం (76 బంతుల్లో).

3 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో అన్ని ఫార్మాట్లలో కలిపి ఎక్కువ సెంచరీలు (49) సాధించిన మూడో భారత బ్యాటర్‌గా రోహిత్. సచిన్ (100), కోహ్లీ (81) ముందున్నారు.

1 ఇంగ్లండ్ తరఫున అత్యధిక హాఫ్ సెంచరీలు (56) సాధించిన బ్యాటర్‌గా జో రూట్.

300+ స్కోర్లు సాధించినా ఎక్కువ సార్లు (28) ఓడిన జట్టుగా ఇంగ్లండ్.



2 వన్డేల్లో భారత్ తరఫున అరంగేట్రం చేసిన రెండో అతిపెద్ద వయస్కుడిగా (32 ఏళ్లు) వరుణ్ చక్రవర్తి. ఫరూఖ్ ఇంజనీర్ 36 ఏళ్ల వయస్సులో తొలి వన్డే ఆడాడు.

స్కోరుబోర్డు

ఇంగ్లండ్: సాల్ట్ (సి) జడేజా (బి) వరుణ్ 26; డకెట్ (సి) హార్దిక్ (బి) జడేజా 65; రూట్ (సి) విరాట్ (బి) జడేజా 69; బ్రూక్ (సి) గిల్ (బి) రాణా 31; బట్లర్ (సి) గిల్ (బి) హార్దిక్ 34; లివింగ్‌స్టోన్ (రనౌట్) 41; ఒవర్టన్ (సి) గిల్ (బి) జడేజా 6; అట్కిన్సన్ (సి) కోహ్లీ (బి) షమి 3; రషీద్ (రనౌట్) 14; ఉడ్ (రనౌట్) 0; సకీబ్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 49.5 ఓవర్లలో 304 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-81, 2-102, 3-168, 4-219, 5-248, 6-258, 7-272, 8-297, 9-304, 10-304. **బౌలింగ్:** షమి 7.5-0-66-1; హర్షిత్ రాణా 9-0-62-1; హార్దిక్ 7-0-53-1; వరుణ్ 10-0-54-1; జడేజా 10-1-35-3; అక్షర్ 6-0-32-0.

భారత్: రోహిత్ (సి) రషీద్ (బి) లివింగ్‌స్టోన్ 119; గిల్ (బి) ఒవర్టన్ 60; విరాట్ (సి) సాల్ట్ (బి) రషీద్ 5; శ్రేయాస్ (రనౌట్) 44; అక్షర్ (నాటౌట్) 41; రాహుల్ (సి) సాల్ట్ (బి) ఒవర్టన్ 10; హార్దిక్ (సి) ఒవర్టన్ (బి) అట్కిన్సన్ 10; జడేజా (నాటౌట్) 11; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 44.3 ఓవర్లలో 308/6. వికెట్ల పతనం:** 1-136, 2-150, 3-220, 4-258, 5-275, 6-286. **బౌలింగ్:** సకీబ్ 6-0-36-0; అట్కిన్సన్ 7-0-65-1; ఉడ్ 8-0-57-0; రషీద్ 10-0-78-1; ఒవర్టన్ 5-0-27-2; లివింగ్‌స్టోన్ 7-0-29-1; రూట్ 1.3-0-15-0.

వావ్..గిల్



బ్యాటింగ్‌లో రాణించిన శుభ్‌మన్ గిల్ అంతకుముందు ఫీల్డింగ్‌లో మూడు అద్భుత క్యాచ్‌లతో వహ్వా.. అనిపించాడు. ఇందులో అసాధ్యమనుకున్న బ్రూక్ క్యాచ్‌ను అతను పట్టిన తీరు కళ్లారా చూడాల్సిందే. 30వ ఓవర్‌లో రాణా వేసిన బంతిని బ్రూక్ భారీ షాట్‌గా మలిచేందుకు యత్నించగా.. మిడాఫ్ నుంచి బౌండరీ లైన్ వైపు 19 మీటర్ల దూరం వెనక్కి పరిగెత్తి గిల్ డైవ్ చేస్తూ అందుకున్న ఈ క్యాచ్ హైలైట్‌గా నిలిచింది.

సింధుకు గాయం

'ఆసియా' బ్యాడ్మింటన్ నుంచి అవుట్



న్యూఢిల్లీ: మరో రెండు రోజుల్లో ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ జరగనున్న నేపథ్యంలో..భారత జట్టుకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. కండర గాయంతో స్టార్ షట్లర్ పీవీ సింధు ఈ టోర్నీ నుంచి వైదొలగింది. చైనాలోని క్వింగ్‌డావోలో ఈనెల 11 నుంచి 16 వరకు ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్ జరగనుంది. ఇందుకోసం భారత జట్టు ప్రస్తుతం గువాహటిలో శిబిరంలో పాల్గొంటోంది. 'శిబిరంలో శిక్షణ సందర్భంగా ఈనెల 4న గాయం అయ్యింది. కోలుకొనేందుకు.. ముందుగా అంచనా వేసిన సమయం కంటే ఎక్కువ పట్టనుందని ఎంఆర్‌ఐ స్కాన్ తర్వాత తెలిసింది. దాంతో ఆసియా మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనలేక పోతున్నందుకు ఎంతో విచారంగా ఉంది' అని 29 ఏళ్ల సింధు ఆదివారం ఎక్స్‌లో వెల్లడించింది.

దీప్తికి యూపీ వారియర్స్ పగ్గాలు



న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఫ్రాంచైజీ యూపీ వారియర్స్ తమ సారథిగా ఆల్‌రౌండర్ దీప్తి శర్మను ఎంపిక చేసింది. ఈమేరకు ఆదివారం ప్రకటించింది. రెగ్యులర్ కెప్టెన్ అలీసా హీలీ (ఆస్ట్రేలియా) పాదం గాయంతో ఈసారి డబ్ల్యూపీఎల్ నుంచి వైదొలగింది. దాంతో హీలీ స్థానంలో 27 ఏళ్ల దీప్తిని నియమించింది. అలీసా స్థానంలో వెస్టిండీస్ ఆల్‌రౌండర్ చినెలీ హెన్రీని జట్టులోకి యూపీ తీసుకుంది.

గెలుపు దిశగా ఐర్లాండ్

జింబాబ్వేతో ఏకైక టెస్ట్

బులవాయో: మాథ్యూ హంఫెరీ (4/55) విజృంభించడంతో జింబాబ్వేతో ఏకైక టెస్ట్‌లో ఐర్లాండ్ గెలుపు దిశగా సాగుతోంది. 292 పరుగుల లక్ష్య ఛేదనలో.. నాలుగోరోజైన ఆదివారం ఓవర్‌నైట్ స్కోరు 38/3తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జింబాబ్వే ఆట చివరకు 183/7 స్కోరు చేసింది. ఆఖరిరోజు విజయానికి జింబాబ్వే 109 రన్స్ దూరంలో ఉండగా.. ఐర్లాండ్‌కు 3 వికెట్లు కావాలి. ఐర్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 260, రెండో ఇన్నింగ్స్‌లో 298 రన్స్ చేయగా.. తొలి ఇన్నింగ్స్‌లో జింబాబ్వే 267 పరుగులకు ఆలౌటైంది.

కంగారూలదే సిరీస్

గాలె: ఆతిథ్య శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను పర్యాటక ఆస్ట్రేలియా 2-0తో క్లీన్‌స్వీప్ చేసింది. మరో రోజు ఆట మిగిలి ఉండగానే.. రెండో టెస్ట్‌లో ఆసీస్ 9 వికెట్లతో లంకపై గెలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 211/8తో ఆటకు నాలుగో రోజైన ఆదివారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన లంక 231 రన్స్‌కు కుప్పకూలింది. ప్రత్యర్థి ముందు కేవలం 75 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. ఛేదనలో ఆసీస్ 17.4 ఓవర్లలోనే 75/1 స్కోరు చేసి గెలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో లంక 257, ఆస్ట్రేలియా 414 రన్స్ చేశాయి. 2011 తర్వాత లంకలో సిరీస్ నెగ్గడం కంగారూలకు ఇదే తొలిసారి.



'రెండు'కు ఆస్ట్రేలియా

ఆస్ట్రేలియా వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచింది. సౌతాఫ్రికా (69.44 పాయింట్ల శాతం) అగ్రస్థానంలో నిలిచి డబ్ల్యూటీసీ ఫైనల్ తొలి బెర్త్‌ను ఖరారు చేసుకొంది. ఇప్పుడు ఆసీస్ (67.54 పాయింట్ల శాతం) రెండో స్థానంలో నిలిచి 2023-25 సైకిల్‌ను ముగించింది. భారత్‌పై 3-1తో సిరీస్ నెగ్గినప్పుడే ఆసీస్ కూడా డబ్ల్యూటీసీ బెర్త్‌ను దక్కించుకొంది. జూన్ 11 నుంచి లార్డ్స్‌లో జరిగే డబ్ల్యూటీసీ ఫైనల్లో సౌతాఫ్రికాతో ఆసీస్ తలపడనుంది.

బడులను ముంచిన జగన్ మామ

(మొదటి పేజీ తరువాయి)

లబ్ధి చేకూర్చింది. మధ్యలో కొవిడ్ సమయంలో ప్రభుత్వ బడుల్లో భారీగా విద్యార్థులు పెరిగినా.. వారిని అక్కడే కొనసాగించడంలోనూ గత ప్రభుత్వం విఫలమైంది. వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పుల ప్రభావం ఇప్పటికీ కొనసాగుతోంది. ముఖ్యంగా ప్రాథమిక స్థాయిలో ప్రభుత్వ బడులు అంటే భయపడే పరిస్థితి కనిపిస్తోంది.

తొలి నుంచీ ప్రయోగాలే

జగన్ ప్రభుత్వం పాఠశాల విద్యను ప్రయోగశాలగా మార్చేసింది. అప్పటి ప్రభుత్వ పెద్దలకు ఏం అనిపిస్తే అది అమలు చేసి బడులను భ్రష్టు పట్టించారు. అధికారంలోకి రాగానే ఇంగ్లిష్ మీడియం పేరిట ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియాన్ని రద్దు చేశారు. దీంతో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ వెంటనే కొవిడ్ రావడంతో ప్రైవేటు బడుల విద్యార్థులే ప్రభుత్వ పాఠశాలల్లో చేరారు. కానీ ఆ తర్వాత తీసుకొచ్చిన జీవో 117 ప్రాథమిక విద్యను తీవ్రంగా దెబ్బతీసింది. గ్రామాల్లోని అనేక బడులు మూత పడేందుకు కారణమైంది. జగన్ ప్రభుత్వం తరగతులను విలీనం చేసి ప్రాథమిక విద్యను తీవ్రస్థాయిలో దెబ్బతీసింది. 4,250 పాఠశాలల్లోని 3 నుంచి 5 తరగతులను సమీపంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు తరలించింది. ఈ ఒక్క దెబ్బతో విద్యార్థులు మరో ప్రభుత్వ బడికి కాకుండా సమీపంలోని ప్రైవేటు పాఠశాలలకు వెళ్లిపోయారు. అలాగే జీవో 117 ప్రకారం బోధనను రెండుగా వర్గీకరించింది. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రాథమికోన్నత పాఠశాలలపై ప్రయోగం చేసింది. విద్యార్థుల సంఖ్య 92 లేని ప్రాథమికోన్నత పాఠశాలల్లో మొత్తం సెకండరీ గ్రేడ్ టీచర్లను కేటాయించింది. 92 కంటే ఎక్కువ ఉంటే అక్కడ మొత్తం స్కూల్ అసిస్టెంట్లను ఇచ్చింది. అంటే.. సంఖ్యపై అక్కడి విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడేలా చేసింది. వాస్తవానికి 6వ తరగతి నుంచి స్కూల్ అసిస్టెంట్లతో బోధన జరుగుతుంది. కానీ 3 నుంచే స్కూల్ అసిస్టెంట్లతో బోధన అంటూ ప్రకటించి, విద్యార్థుల సంఖ్యతో ముడిపెట్టి 6 నుంచి 8 తరగతులకు కూడా సబ్జెక్టు టీచర్లను లేకుండా చేసింది. దీంతో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల్లో రెండు రకాల విద్యా బోధనలు అమల్లోకి వచ్చాయి.

సంస్కరణల పేరిట గందరగోళం

రెండేళ్లలో 45 వేల ప్రభుత్వ పాఠశాలలను సీబీఎస్‌ఈ సిలబస్‌లోకి మార్చేస్తామని ప్రకటించిన జగన్.. ఐదేళ్లలో వెయ్యి పాఠశాలలను మాత్రమే మార్చగలిగారు. దానిని కప్పిపుచ్చుకునేందుకు అసలు ఎక్కడుందో తెలియని ఇంటర్నేషనల్ బాకలారియేట్(ఐబీ)ని తెరపైకి తెచ్చారు. ఇక మొత్తం ఐబీ సిలబస్ అంటూ కొంతకాలం ఊదరగొట్టారు. తీరా చూస్తే ఐబీ సిలబస్ దేశం మొత్తంలో వెయ్యి పాఠశాలల్లో కూడా లేదు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఒక్కో తరగతిని ఐబీలోకి మారుస్తూ, 2035 నాటికి ఐబీ సిలబస్‌లో టెన్త్ పరీక్షలు జరుగుతాయంటూ ఐబీతో ఒప్పందం కూడా చేసుకున్నారు. మరోవైపు ఉన్నత విద్య అనంతరం విదేశాలకు వెళ్లేవారికి అవసరమైన టోఫెల్‌ను పాఠశాలల్లో ప్రారంభించారు. ఇంగ్లిష్ టీచర్లు బోధించాల్సిన టోఫెల్‌ను సైన్స్, సోషల్ టీచర్లు బోధించేలా అస్తవ్యస్త విధానాలు అమలు చేశారు. దీంతో అసలు ప్రభుత్వ పాఠశాలు ఏ దిశలో వెళ్తున్నాయనే ఆందోళన మొదలైంది. ఫలితంగా ప్రభుత్వ బడుల నుంచి తమ పిల్లలను తల్లిదండ్రులు క్రమంగా ప్రైవేటుకు పంపారు.

కరోనా సమయంలో పెరిగినా...

గత తెలుగుదేశం ప్రభుత్వంలో చివరి విద్యా సంవత్సరం 2018-19లో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 39,29,019 మంది విద్యార్థులుంటే, 2024-25 విద్యా సంవత్సరం నాటికి ఆ సంఖ్య 34,50,423కు పడిపోయింది. అంటే.. వైసీపీ హయాంలో 4,78,596 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిపోయారు. కరోనా కాలంలో లాక్‌డౌన్‌లు, వైరస్ ప్రభావం వల్ల ఫీజులు వృథా చేసుకోవడం ఎందుకనే ఆలోచనతో తల్లిదండ్రులు లక్షల మంది విద్యార్థులను ప్రైవేటు బడులు మాన్పించి, ప్రభుత్వ బడుల్లో చేర్పించారు. దీంతో 2020-21లో విద్యార్థుల సంఖ్య 43,42,874కు పెరిగింది. ఆ తర్వాత 2021-22లో ఆ సంఖ్య 44,29,569కు చేరింది. కానీ కొవిడ్ తగ్గిన వెంటనే ప్రైవేటు నుంచి వచ్చిన విద్యార్థులంతా వెనుదిరిగారు. దీంతో విద్యార్థుల సంఖ్య 2022-23లో 39,95,992కు, 2023-24లో 35,69,506కు పడిపోయింది. గతంలో ప్రభుత్వ బడుల్లో ఉన్న విద్యార్థులు కూడా భారీగా ప్రైవేటు బాట పట్టారు.

ప్రైవేటుతో సమాన స్థాయికి..

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రైవేటు కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే ఎక్కువ మంది విద్యార్థులు చదివేవారు. రెండింటి మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఉండేది. కానీ జగన్ ప్రభుత్వంలో క్రమంగా ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో ప్రైవేటు బడులు బలోపేతం అవుతూ వచ్చాయి. ఈ క్రమంలో ఈ ఏడాది విద్యార్థుల సంఖ్యను పరిశీలిస్తే ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో దాదాపుగా సమాన స్థాయికి వచ్చారు. ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, సంక్షేమ, ఎయిడెడ్ అన్ని రకాల ప్రభుత్వ మేనేజ్‌మెంట్లలో కలిపి ప్రస్తుతం 34,50,423 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో 33,99,832 మంది ఉన్నారు. 50 వేలమంది మాత్రమే ప్రభుత్వ బడుల్లో ఎక్కువగా ఉన్నారు. గతంలో ఈ వ్యత్యాసం ఏడెనిమిది లక్షలు ఉండేది. కానీ టీచర్లు మాత్రం ప్రభుత్వం స్కూళ్లలో 1,84,860 మంది ఉంటే, ప్రైవేటు పాఠశాలల్లో 1,24,827 మంది మాత్రమే ఉన్నారు. ప్రైవేటు స్కూళ్లలో 60 వేల మంది టీచర్లు తక్కువగా ఉన్నా తల్లిదండ్రులు అటు వైపే మొగ్గు చూపుతున్నారు.

పొడిగాలులతోనే వేడి వాతావరణం

- పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు ఎక్కువగా నమోదు

విశాఖపట్నం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): శీతాకాలం పోయి వేసవి సీజన్ వచ్చే క్రమంలో ఒక్కసారిగా ఎండ తీవ్రత పెరిగింది. ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఫిబ్రవరి ప్రారంభం నుంచే మాడుపగిలే ఎండలు కాస్తున్నాయి. ఇక ఏప్రిల్, మే నెలల్లో ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అయితే ఒక సీజన్ నుంచి మరో సీజన్‌లోకి వెళ్లే క్రమంలో గాలులు పరివర్తనం చెంది ఒక్కసారిగా పొడి వాతావరణం నెలకొనడం సాధారణమేనని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నెలలో వాతావరణం పొడిగా మారడంతో ఆకాశం నిర్మలంగా మారి సూర్యకిరణాలు నేరుగా భూమిని తాకడంతో ఎండ పెరుగుతుందన్నారు. ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో సముద్రం నుంచి గాలులు భూ ఉపరితలంపైకి వీస్తుంటాయన్నారు. ఈశాన్య సీజన్ ముగిసిన తరువాత గాలులు ఒకే దిశలో కాకుండా అన్ని వైపుల నుంచి వీస్తుండడంతోపాటు వేగం మందగించింది. వర్షాలు కురిసే పరిస్థితులు లేకపోవడంతో ఉష్ణోగ్రతలు సాధారణానికి మించి నమోదవుతున్నాయి. ఈ నెలాఖరు వరకూ ఇటువంటి వాతావరణ పరిస్థితులు కొనసాగుతాయని వాతావరణ అధికారి సముద్రాల జగన్నాథకుమార్ పేర్కొన్నారు. ఇదిలావుండగా ఆదివారం రాష్ట్రంలో ఎండ తీవ్రత కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. కర్నూలులో 36.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

జగన్ ఇంటి వద్ద మంటల ఘటన.. సీసీటీవీ ఫుటేజ్ అందించని వైసీపీ

తాడేపల్లి టౌన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిలో మాజీ సీఎం జగన్ ఇంటి ఎదుట ఎండిన గ్రీనరీ తగలబడిన ఘటనలో పోలీసులకు వైసీపీ కార్యాలయ ప్రతినిధుల నుంచి ఆదివారం వరకు సీసీటీవీ ఫుటేజ్ అందలేదు. ఈ నెల 5న ఘటన జరగ్గా.. 6న సోషల్ మీడియా సహా వైసీపీ అనుకూల ప్రసారమాధ్యమాల్లో మాజీ సీఎం ఇంటి వద్ద భద్రతా లోపం అంటూ వార్తలు హల్‌చల్ చేసిన విషయం తెలిసిందే. వైసీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు నారాయణమూర్తి ఫిర్యాదు మేరకు 7న తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటన జరిగిన ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీ ఇవ్వాలని ఫిర్యాదుదారుడికి తెలిపి, వైసీపీ కార్యాలయానికి నోటీసులు అందించారు. అదేరోజు ఫోరెన్సిక్ బృందం, గుంటూరు జిల్లా క్లూస్ టీమ్.. ఘటన జరిగిన ప్రాంతంలో ఆధారాలు సేకరించి ల్యాబ్‌కు పంపింది. సీసీ టీవీ ఫుటేజ్ విషయమై నోటీసులు ఇచ్చి రెండు రోజులు గడిచినా వైసీపీ నాయకులు స్పందించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

'క్రెబ్స్'కు తాళం!

» బయోటెక్ కంపెనీని మూసివేయాలని పీసీబీ ఆదేశం

విజయవాడ/విశాఖపట్నం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రీ ప్రాసెసింగ్ యూనిట్‌కు తరలించాల్సిన వ్యర్థాలను అందుకు విరుద్ధంగా జనావాసాల మధ్య పారబోసిన కంపెనీకి కాలుష్య నియంత్రణ మండలి షాక్ ఇచ్చింది. అనకాపల్లి జిల్లా నుంచి వ్యర్థాలను ట్యాంకర్‌లో తరలించి విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి శివారు ఖాళీ స్థలాల్లో పారబోయడాన్ని పీసీబీ అధికారులు తీవ్రంగా పరిగణించారు. ఈ వ్యర్థాలను బయటకు పంపిన క్రెబ్స్ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి తాళం వేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనకాపల్లి జిల్లా కాశింకోట మండలం కొత్తపల్లిలో క్రెబ్స్ ఫార్మా కంపెనీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. మందుల తయారీలో వచ్చిన వ్యర్థాలను ఏరోజుకారోజు ఏపీ ఎన్విరాన్‌మెంటల్ కార్పొరేషన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసి అనుమతి తీసుకున్న తర్వాత ప్రీ ప్రాసెసింగ్ యూనిట్(పీపీయూ)కు పంపాలి. కొద్ది రోజుల క్రితం ఎలాంటి అనుమతి తీసుకోకుండా వ్యర్థాలను ట్యాంకర్‌లో విజయవాడకు పంపారు. బిహార్‌కు చెందిన డ్రైవర్ ఈ ట్యాంకర్‌ను జక్కంపూడిలోని ఖాళీ స్థలాల్లోకి తీసుకువచ్చి వ్యర్థాలు పారబోస్తుండగా స్థానికులు పట్టుకుని కొత్తపేట పోలీసులకు అప్పగించారు. ఎన్టీఆర్ జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు రంగంలోకి దిగి వ్యర్థాల మూలాలను బయటకు తీసే పనిలో పడ్డారు. డ్రైవర్ వద్ద లభించిన కాగితాల ప్రకారం ఈ వ్యర్థాలు జగ్గయ్యపేటలోని ప్రీ ప్రాసెసింగ్ యూనిట్‌కు వెళ్తున్నట్టుగా చేతితో రాశారు. వాస్తవానికి ఇలా ప్రీప్రాసెసింగ్ యూనిట్‌కు పంపే వ్యర్థాలకు డిజిటల్ అనుమతి మాత్రమే ఉంటుంది. పీసీబీ అధికారులు ఈ సమాచారాన్ని విశాఖ జిల్లా పీసీబీ అధికారులకు ఇవ్వడంతోపాటు జగ్గయ్యపేటలోని ప్రీ ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలించారు. తమకు క్రెబ్స్ బయోటెక్ నుంచి వ్యర్థాలు వస్తున్నట్టు ఎలాంటి సమాచారమూ రాలేదని పీపీయూ సిబ్బంది చెప్పారు. విశాఖ జిల్లా పీసీబీ అధికారులు క్రెబ్స్ కంపెనీలో తనిఖీలు చేయగా ఈ ట్యాంకర్ నెంబర్‌తో వ్యర్థాలు బయటికి వచ్చినట్టు లాగ్ పుస్తకాల్లో గుర్తించారు. ఈ విషయాన్ని కాలుష్య నియంత్రణ మండలి ఉన్నతాధికారులకు తెలియజేశారు. నివేదికలను పరిశీలించిన ఉన్నతాధికారులు క్రెబ్స్ కంపెనీని మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు.

రోజువారీ విచారణ!

(మొదటి పేజీ తరువాయి)

హాజరు కాని వారి అరెస్టుకు నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీచేయాలని తన తాజా అఫిడవిట్‌లో కోరారు. మూడేళ్లకుపైగా పెండింగ్‌లో ఉన్నఎంపీలు, ఎమ్మెల్యేల కేసులను ప్రత్యేక కోర్టులు రోజువారీ విచారించేలా ఆదేశాలివ్వాలని, ఆ కేసుల ట్రయల్ పూర్తయ్యేదాకా ఆ కోర్టులకు ఇతర రెగ్యులర్ కేసుల బాధ్యతలు అప్పగించకుండా చూడాలని సూచించారు. క్రిమినల్ కేసుల్లో దోషులుగా నిరూపణ అయిన ప్రజాప్రతినిధులు ఎన్నికల్లో పోటీచేయకుండా జీవితకాల నిషేధం విధించాలని కోరుతూ న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ్ 2016లో దాఖలుచేసిన పిటిషన్‌పై కోర్టుకు సహాయకారి(అమికస్ క్యూరీ)గా హన్సారియాను సుప్రీంకోర్టు నియమించింది. ఆయా కేసుల్లో పురోగతిపై ఆయన రెండ్రోజుల కింద 21వ అఫిడవిట్‌ను దాఖలుచేశారు. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన ధర్మాసనం సోమవారం ఈ అంశంపై విచారణ జరపనుంది. దేశవ్యాప్తంగా ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులపై 4,732క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని హన్సారియా పేర్కొన్నారు. ఇందులో 892 కేసులు ఒక్క 2024లోనే నమోదయ్యాయని తెలిపారు. ప్రజాస్వామిక సంస్కరణల సంఘం(ఏడీఆర్) రిపోర్టును ప్రస్తావిస్తూ.. ప్రస్తుత లోక్‌సభలోని 543 మంది ఎంపీల్లో 170 మందిపై ఐదేళ్లు, అంతకుమించి శిక్షపడే అవకాశమున్న తీవ్ర నేరాభియోగాలు నమోదైనట్లు చెప్పారు. మాజీ సీఎం జగన్ సహా పలువురు ప్రజాప్రతినిధులపై టీ-హైకోర్టులో 319 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 2023 నవంబరు 24నుంచి ప్రజాప్రతినిధులపై దాఖలు చేసిన కేసులకు సంబంధించి నాంపల్లి సీబీఐ కోర్టులో డిశ్చార్జి పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని.. అప్పటి నుంచి వాటిపై ఏ తీర్పూ వెలువరించలేదని హైకోర్టు గత జూన్ 4న పేర్కొందని హన్సారియా తెలిపారు. సుప్రీంకోర్టు విచారణ నేపథ్యంలో జగన్ సహా ప్రజాప్రతినిధుల కేసుల విచారణ వేగవంతమయ్యే అవకాశముందని న్యాయవాద వర్గాలు చెబుతున్నాయి.

హన్సారియా అఫిడవిట్‌లోని ముఖ్యాంశాలివీ..

- తమపై కేసుల దర్యాప్తు లేదా ట్రయల్‌పై చట్టసభల సభ్యుల పలుకుబడి ప్రభావం ఉంది. ట్రయల్ పూర్తవడాన్ని అనుమతించడం లేదు. సుప్రీంకోర్టు ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇస్తున్నా.. హైకోర్టులు పర్యవేక్షిస్తున్నా.. ఎంపీలు, ఎమ్మెల్యేలపై పెద్దసంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇది దేశ ప్రజాస్వామ్యానికే మచ్చ.
- ప్రజాప్రతినిధుల కేసులను విచారించే ప్రత్యేక కోర్టులకు ఇతర రెగ్యులర్ కేసుల విచారణ బాధ్యతలు అప్పగిస్తున్నారు.
- కొన్ని కేసుల్లో నిందితులు నిర్దిష్ట తేదీల్లో కోర్టుకు హాజరు కావడంలేదు. దీంతో సాక్షుల వాంగ్మూల నమోదు ప్రక్రియ సాగడం లేదు. నిర్ధారిత తేదీల్లో సాక్షులను కోర్టుల్లో హాజరుపరిచేందుకు ప్రాసిక్యూషన్ సమర్థ/సీరియస్ చర్యలు తీసుకోవడం లేదు. సాక్షులకు సమన్లు జారీ చేసి నిర్ణీత తేదీన కోర్టుకు హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత ప్రత్యేక కోర్టుకు అనుబంధంగా ఉన్న నోడల్ ప్రాసిక్యూషన్. సాక్షులను ప్రవేశపెట్టడంలో సదరు అధికారి విఫలమైతే జిల్లా ఎస్పీ నుంచి లిఖితపూర్వకంగా వివరణ కోరాలి. అవసరమైతే చర్య తీసుకోవాలని కోరాలి.
- అరుదైన, అనివార్య కేసుల్లో తప్ప ట్రయల్ కోర్టులు ఈ కేసుల విచారణను వాయిదా వేయరాదని ఆదేశాలిచ్చినా.. సదరు ప్రత్యేక కోర్టులు ఉదారంగా వాయిదాలు మంజూరు చేస్తున్నాయి.
- సుమోటో రిట్ పిటిషన్లలో వివిధ హైకోర్టులు ఉత్తర్వులు జారీచేసినా కేసుల ట్రయల్‌లో చెప్పుకోదగిన పురోగతి లేదు. ఈ నేపథ్యంలో ప్రజాప్రతినిధుల కేసులను వేగవంతంగా పరిష్కరించేందుకు సుప్రీంకోర్టు తదుపరి ఆదేశాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది.
- రాజ్యాంగం వాక్‌స్వాతంత్ర్యం, భావవ్యక్తీకరణను ప్రసాదించింది. సమాచార హక్కు వాటిలో భాగం. చట్టసభల సభ్యులపై కేసుల విచారణ పురోగతి గురించి తెలుసుకునే హక్కు పౌరులకు ఉంది. హైకోర్టు వెబ్‌సైట్‌లో శాశ్వత ట్యాబ్ ఉంటేనే.. మొత్తం సమాచారం సేకరించడానికి అవకాశం ఉంటుంది. చట్టసభల సభ్యుల నేరచరిత, ట్రయల్ పురోగతి.. జాప్యానికి కారణాలు కూడా తెలుసుకునే హక్కు ప్రజలకు ఉంది. ఈ వివరాలు హైకోర్టు వెబ్‌సైట్లలో లేవు. ఏ సైట్‌లోనూ ప్రజాప్రతినిధుల కేసులను విచారించే ప్రత్యేక కోర్టుల ఆదేశాలను అప్‌లోడ్ చేయలేదు. ఈ కేసుల విచారణ పురోగతిని హైకోర్టులు నెలవారీగా సమీక్షించాలి. వెబ్‌సైట్‌లో డేటా అప్‌లోడ్ చేయాలి. జాతీయ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ మాదిరిగా ఒక వెబ్‌సైట్‌ను రూపొందించాలి.
- ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసులను విచారించే ప్రత్యేక కోర్టులు వాటి ట్రయల్ పూర్తయ్యాకే ఇతర కేసులు చేపట్టాలని ఆదేశాలివ్వాలి. అన్ని జిల్లాల ప్రిన్సిపల్-సెషన్స్ జడ్జీలు.. ప్రజాప్రతినిధులపై కేసుల ట్రయల్ పూర్తయిన తర్వాతే ఆయా కోర్టులకు రెగ్యులర్ వర్క్ కేటాయించాలి.
- భారతీయ నాగరిక్ సురక్ష సంహిత-బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 346 (గతంలో సీఆర్‌పీసీ సెక్షన్ 309) ప్రకారం.. మూడేళ్లకుపైగా పెండింగ్‌లో ఉన్న ప్రజాప్రతినిధుల కేసులపై కోర్టులు రోజువారీ విచారణ జరపాలని సర్వోన్నత న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేయాలి.
- అలాగే కోర్టులకు వరుసగా రెండుసార్లు హాజరు కాని ప్రజాప్రతినిధుల అరెస్టుకు నాన్-బెయిలబుల్ వారెంట్లు జారీచేయాలి.
- నిషేధాజ్ఞలు ఉల్లంఘించినందుకు వివిధ రాష్ట్రాల్లో ప్రజాప్రతినిధులపై 863 కేసులు దాఖలయ్యాయి. వీటిలో ఏడాదికిపైగా పెండింగ్‌లో ఉన్న కేసులను కొట్టివేయాలి.

లోక్‌సభలో సగం మందిపై క్రిమినల్ కేసులు..

2024లో ఏర్పడిన ప్రస్తుత లోక్‌సభలో సగం మందిపై క్రిమినల్ కేసులున్నాయి. 251 మంది ఎంపీలపై క్రిమినల్ కేసులు ఉండగా, వాటిలో తీవ్ర నేరాభియోగాలు ఎదుర్కొంటున్నవారు 170 మంది ఉన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని 80 మంది ఎంపీల్లో 40 మందిపై క్రిమినల్ కేసులు ఉండగా.. వారిలో 34 మందిపై తీవ్ర అభియోగాలు ఉన్నాయి. అలాగే మహారాష్ట్రలో 24 మంది ఎంపీలపై, పశ్చిమ బెంగాల్లో 22 మంది, బిహార్‌లో 21 మంది, తమిళనాడులో 26 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.

తెలుగు రాష్ట్రాల్లో..

ఆంధ్రప్రదేశ్‌లో 13 మందిపై క్రిమినల్ కేసులు ఉండగా.. వారిలో 9 మందిపై తీవ్రమైన నేరాభియోగాలు ఉన్నాయని హన్సారియా తెలిపారు. తెలంగాణలో 17 మంది పై క్రిమినల్ కేసులు ఉండగా, వారిలో 12 మందిపై తీవ్రమైన అభియోగాలు ఉన్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ సీబీఐ కోర్టులో 28 కేసులపై విచారణ జరుగుతుండగా.. వాటిలో నాలుగు కేసులపై స్టే ఉందంటూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన నివేదికను ఆయన ప్రస్తావించారు. ఆ సీబీఐ కోర్టులో దాదాపు 140 డిశ్చార్జి పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని కూడా హైకోర్టు పేర్కొందన్నారు.

తెలంగాణ హైకోర్టులో 313 పెండింగ్ కేసులు...

తెలంగాణ హైకోర్టులో 172 మంది సిటింగ్ ప్రజాప్రతినిధులు, 26మంది మాజీలపై 313 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని హన్సారియా వెల్లడించారు. 'ఎంపీలు, మాజీ ఎంపీలపై 121, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలపై 112 కేసులు ఉన్నాయని 2019 ఆగస్టు 25న సీబీఐ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన నివేదికలో పేర్కొంది. వీటిలో 31 కేసులపై విచారణ జరుగుతున్నట్లు తెలిపింది. 2000లో చార్జిషీటు దాఖలైన కేసులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని, దర్యాప్తు పూర్తి చేసేందుకు, ఆరోపణలను రుజువుచేసేందుకు తమ వద్ద సరైన మానవ వనరులు, మౌలిక సదుపాయాలు లేవని సీబీఐ ఆవేదన వ్యక్తం చేసింది' అని హన్సారియా గుర్తుచేశారు.

2023లో సుప్రీం కీలక ఆదేశాలు..

ప్రజాప్రతినిధులపై పెండింగ్‌లో ఉన్న 5వేలకుపైగా కేసుల విచారణను వేగవంతం చేసేందుకు సుప్రీంకోర్టు 2023 నవంబరు 9నే కీలక ఆదేశాలు జారీచేసింది. సత్వర పరిష్కారానికి హైకోర్టులు స్వయంగా ట్రయల్‌ను పర్యవేక్షించాలని నిర్దేశించింది. అరుదైన, అనివార్యమైన సందర్భాల్లో తప్ప ప్రత్యేకకోర్టులు కేసుల విచారణను వాయిదా వేయొద్దని ఆదేశించింది. ప్రజాప్రతినిధులపై క్రిమినల్ కేసుల ట్రయల్‌కు ప్రాధాన్యమివ్వాలని హైకోర్టులు, జిల్లా జడ్జీలు, ప్రత్యేక కోర్టులకు ఆదేశాలిచ్చింది. పెండింగ్‌లో ఉన్న 5వేలకుపైగా కేసుల్లో 2వేలకేసులపై ప్రత్యేక కోర్టులు 2023లో నిర్ణయాలు వెలువరించి పరిష్కరించాయని హన్సారియా గత ఏప్రిల్ 22న నివేదించారు. రెండ్రోజుల కిందట తన 21వ నివేదిక/అఫిడవిట్‌ను సమర్పించారు.



ఆత్మకూరులోని టిడ్కో గృహ సముదాయంలో సీతారాముల ఆలయ నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించిన మంత్రి నారాయణ, చిత్రంలో ఆనం, ఫరూక్, సవిత, బీసీ జనార్దన్

టిడ్కో సముదాయాల్లో ఆలయాల నిర్మాణం

» ఆత్మకూరులో శ్రీకారం, హాజరైన మంత్రులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 67 టిడ్కో గృహసముదాయాల్లో సీతారాముల ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ తెలిపారు. వారి ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా ఆత్మకూరులో ఆదివారం సుమారు రూ.3 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరిగాయి. ఆత్మకూరు టిడ్కో గృహ సముదాయం వద్ద ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసి, శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు సవిత, ఫరూక్, బీసీ జనార్దన్, ఎంపీ వేమిరెడ్డి హాజరయ్యారు. వైసీపీ ప్రభుత్వ తప్పిదాలతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని, చంద్రబాబు అపార అనుభవంతో మళ్లీ చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నారని నారాయణ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు కేటాయించనున్నట్లు మంత్రి తెలిపారు.

11 సీట్లే వచ్చినా జగన్‌కు సిగ్గులేదు: దుర్గేశ్

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో 11 సీట్లే వచ్చి ప్రజలు ఛీత్కరించినా జగన్‌కు సిగ్గులేదని, 2.0 పేరుతో వచ్చే ఎన్నికల్లో తామే గెలుస్తామంటూ పగటికలలు కంటున్నారని మంత్రి కందుల దుర్గేశ్ విమర్శించారు. ఐదేళ్ల జగన్ పరిపాలనలో విధ్వంసం తప్ప సంక్షేమం ఎక్కడుందని ప్రశ్నించారు.

వైసీపీ కార్యాలయాలకు త్వరలో టూలెట్ బోర్డులు: డోలా

ఒంగోలు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వైసీపీని ప్రజలు విశ్వసించడం లేదని, త్వరలో ఆ పార్టీ కార్యాలయాలకు టూలెట్ బోర్డులు పెట్టడం ఖాయమని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఎద్దేవా చేశారు. కొండపి నియోజకవర్గంలోని 41 మందికి రూ.43లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను, రూ.8 లక్షలకు ఎల్‌వోసీలను ఆదివారం మంత్రి తన స్వగ్రామమైన టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికల్లో కేవలం 11 సీట్లకు దిగజారిన జగన్ అలా ఎందుకైందో కనీసం 11 నిమిషాలైనా ఆత్మవిమర్శ చేసుకున్న పరిస్థితి లేదన్నారు. ఐదేళ్ల పాలనలో వైద్య రంగాన్ని జగన్ సర్వనాశనం చేశారని డోలా ఆగ్రహం వ్యక్తంచేశారు.

ఏపీ, ఢిల్లీ ఫలితాలకు సారూప్యత: పురందేశ్వరి

విశాఖపట్నం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఏపీ, ఢిల్లీ ఎన్నికల ఫలితాలకు సారూప్యత ఉందని, అభివృద్ధిని నిర్లక్ష్యం చేసి అవినీతిలో కూరుకుపోవడం వల్లే వైసీపీ, ఆప్ దారుణ ఓటమిని చవిచూశాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. ఆప్, వైసీపీలు రాష్ట్రాలను అప్పుల ఊబిలోకి నెట్టేసి, అభివృద్ధికి తావు లేకుండా చేశాయన్నారు. 26ఏళ్ల తర్వాత బీజేపీకి ఢిల్లీ పీఠం దక్కడం వెనుక కార్యకర్తల కృషి చాలా ఉందన్నారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా బీజేపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గడచిన 8నెలల్లో ఏపీకి రూ3లక్షల కోట్లు వచ్చాయని అమిత్ షా చెప్పారని, విశాఖ స్టీల్‌ప్లాంటు, పోలవరం, రాజధాని అమరావతి నిర్మాణానికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. కేకే లైన్ అంశాన్ని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ జగన్ 30 ఏళ్లు తానే సీఎం అనుకుంటూ కలల్లో విహరిస్తున్నారని, రుషికొండ ప్యాలెస్ కట్టి రూ.450 కోట్ల కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపించారు. అనంతరం పురందేశ్వరి సమక్షంలో మత్స్యకార నాయకుడు వాసుపల్లి సంతోష్‌కుమార్, ఏపీ మెకనైజ్డ్ బోటు యజమానుల సంఘ కార్యదర్శి రాజేష్‌తో పాటు పలువురు బీజేపీలో చేరారు.

బిజినెస్

హైదరాబాద్ ● సోమవారం 10 ఫిబ్రవరి 2025

త్వరలో ఈ-రిక్షా మార్కెట్లోకి బజాజ్

న్యూఢిల్లీ: బజాజ్ ఆటో మార్చి చివరి నాటికి ఈ-రిక్షా విభాగంలోకి ప్రవేశిస్తోంది. నెలకి 45,000 యూనిట్ల పరిమాణం గల ఈ మార్కెట్ ప్రస్తుతం అత్యంత అవ్యవస్థీకృతంగా ఉందని, మార్చి త్రైమాసికం ముగిసేలోగా నియంత్రణాపరమైన అనుమతులు తీసుకోవాలని చూస్తున్నట్లు కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాకేష్ శర్మ తెలిపారు. అనుమతులు రాగానే "ఈ-రిక్" మోడల్ విడుదల చేయాలని భావిస్తున్నామన్నారు. ఏప్రిల్ తొలివారం నుంచి అమ్మకాలు ప్రారంభించాలన్నది తమ ఆలోచన అని తెలిపారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	475
వరంగల్	442	గోదావరి	455
చిత్తూరు	493	విశాఖపట్నం	465
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	97	విజయవాడ	98
వరంగల్	97	గుంటూరు	105
కరీంనగర్	97	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	97	చిత్తూరు	82
కర్నూలు	97	నెల్లూరు	87
విశాఖపట్నం	96	అనంతపురం	87
గోదావరి	98		

2047 నాటికి ఫార్మా ఎగుమతులు రూ.30 లక్షల కోట్లు

టాప్ 5లోకి భారత్ చేరే చాన్స్

బెయిన్ అండ్ కంపెనీ నివేదిక వెల్లడి

ముంబై: భారత ఫార్మా ఎగుమతులు 2047 నాటికి 35,000 కోట్ల డాలర్లకు (రూ.30.10 లక్షల కోట్లు) చేరుతాయని అంచనా. అంటే ప్రస్తుత విలువతో పోల్చితే 10 రెట్లు అధికం. అలాగే ప్రస్తుతం ఫార్మా ఎగుమతుల్లో ప్రపంచ స్థాయిలో భారత్ 11వ స్థానంలో ఉండగా అప్పటికి టాప్ 5లోకి చేరుతుందని ఫార్మెక్సిల్, భారత ఫార్మా సంస్థలతో కలిసి బెయిన్ అండ్ కంపెనీ రూపొందించిన తాజా నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం అనుసరిస్తున్న పరిమాణం ఆధారిత వైఖరి నుంచి విలువ ఆధారిత వ్యూహం అనుసరించడం ద్వారానే భారత్ ఈ ఘనత సాధిస్తుందని కూడా పేర్కొంది. భారత్ ప్రస్తుతం జెనరిక్ ఔషధాల సరఫరాలో



ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంది. 2023లో ఫార్మా ఎగుమతులు 2,700 కోట్ల డాలర్ల (రూ.2.32 లక్షల కోట్లు) స్థాయిలో ఉండగా 2030 నాటికి 6,500 కోట్ల డాలర్లకు (రూ.5.59 లక్షల కోట్లు) చేరగలవని అంచనా. రాబోయే కాలంలో స్పెషాలిటీ జెనరిక్స్, బయో సిమిలర్స్, ఇన్నోవేటివ్ ఫార్మా ఉత్పత్తులపై దృష్టి సారించటం ద్వారా విలువ మరింతగా పెరుగుతుందని ఆ నివేదికలో తెలిపారు.

విధానపరమైన మద్దతు అవసరం

భారత ఫార్మా సామర్థ్యాన్ని సంపూర్ణంగా వినియోగంలోకి తేవాలంటే విధానపరమైన మద్దతు అవసరమని ఇండియన్ డ్రగ్స్ మాన్యుఫాక్చరర్స్ సమాఖ్య (ఐడీఎంఏ) జాతీయ అధ్యక్షుడు విరంచి షా అన్నారు. ప్రధానంగా ఎగుమతులకు నాన్ టారిఫ్ అవరోధాలను తొలగించి విభిన్న దేశాలకు విభిన్న ఎగుమతి వ్యూహాలు అనుసరించాలని సూచించారు. 40 కొత్త కెమికల్, బయోలాజికల్ ఎంటిటీలు అభివృద్ధి దశలో ఉన్న నేపథ్యంలో ఇన్నోవేషన్ విభాగంలో భారత ఎగుమతులు 2047 నాటికి 1,300-1,500 కోట్ల డాలర్లకు (రూ.11.18-12.90 లక్షల కోట్లు) చేరగలవని అంచనా. కాగా స్పెషాలిటీ జెనరిక్స్, బయో సిమిలర్స్, వ్యాక్సిన్లు, అడ్వాన్స్‌డ్ థెరపీల్లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టడం ద్వారా 2047 నాటికి అంచనా వేస్తున్న ఎగుమతుల స్థాయికి చేరగలుగుతామని ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ రాజా భాను అన్నారు.

మూడు అంశాలపై దృష్టి పెడితే సాధ్యమే

విలువ ఆధారిత వ్యూహంలో దృష్టి సారించాల్సిన మూడు అంశాలను ఆ నివేదికలో గుర్తించారు. యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రిడియెంట్స్ (ఏపీఐ) ఎగుమతులు పెంచుకోవడం ఒకటి. ప్రస్తుతం ఏపీఐ ఎగుమతుల పరిమాణం 500 కోట్ల డాలర్లుండగా (రూ.43,000 కోట్లు).. 2047 నాటికి 8,000-9,000 కోట్ల డాలర్లకు (రూ.6.88-7.74 లక్షల కోట్లు) చేరవచ్చని అంచనా. మొత్తం ఔట్‌సోర్సింగ్ ఏపీఐ మార్కెట్లో 35% వాటాతో చైనా అగ్రగామిగా ఉంది. ప్రపంచ సరఫరా వ్యవస్థను విస్తరించుకోవడం ద్వారా భారత్ కూడా తన మార్కెట్‌ను పెంచుకోవచ్చు. ఈ కోణంలో చూస్తే అమెరికా రూపొందించిన బయోసెక్యూర్ చట్టం భారత్‌కు మంచి అవకాశమని ఆ నివేదికలో తెలిపారు. ఏపీఐ మార్కెట్లో గట్టి పట్టు సాధించాలంటే బల్క్ డ్రగ్ పార్కుల్లో పెట్టుబడులు పెట్టడం, ముడిసరుకులో స్వయం సమృద్ధి సాధించడం అవసరమని పేర్కొన్నారు.

- భారత బయో సిమిలర్ ఎగుమతులు ప్రస్తుతం 80 కోట్ల డాలర్లుండగా (రూ.6,880 కోట్లు).. 2047 నాటికి 3000-4000 కోట్ల డాలర్లకు (రూ.2.58-3.44 లక్షల కోట్లు) చేరగలవని అంచనా. పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాల్లో పెట్టుబడులు పెట్టడం, అమెరికా వంటి మార్కెట్లలో నిబంధనల సరళీకరణ, సామర్థ్యాల విస్తరణ బయో సిమిలర్ విభాగంలో భారత్ స్థానాన్ని పటిష్ఠం చేస్తాయంటున్నారు.
- ప్రస్తుతం మొత్తం ఫార్మా ఎగుమతుల్లో 70 శాతం వాటా జెనరిక్ ఫార్ములేషన్లదే. వీటి ప్రస్తుత విలువ 1,900 కోట్ల డాలర్లుండగా (రూ.1.63 లక్షల కోట్లు).. 2047 నాటికి 18,000-19,000 కోట్ల డాలర్లకు (రూ.15.48-16.34 లక్షల కోట్లు) చేరుతుందని అంచనా. ఇందుకోసం భారత్ సాధారణ జెనరిక్స్ నుంచి అధిక మార్జిన్లుండే స్పెషాలిటీ జెనరిక్స్ వైపు దృష్టి కేంద్రీకరించాలి.

రెయిన్‌బో హాస్పిటల్స్ ఆదాయం రూ.398 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రెయిన్‌బో చిల్డ్రన్ మెడికేర్ లిమిటెడ్ నికర లాభం 10.2 శాతం వృద్ధితో రూ.68.94 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో లాభం రూ.62.57 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో రెవెన్యూ రూ.335.96 కోట్ల నుంచి రూ.398.08 కోట్లకు పెరిగింది. కాగా ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో 100 పడకలతో ఏర్పాటు చేస్తున్న రీజినల్ హబ్ హాస్పిటల్ వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అందుబాటులోకి రావచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపింది.

- బాలు ఫోర్జ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్.. డిసెంబరు త్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదికన రూ.255.78 కోట్ల ఆదాయంపై రూ.59.06 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.25.20 కోట్లు)తో పోల్చితే లాభం 134% వృద్ధి చెందింది.
- డిసెంబరు త్రైమాసికంలో ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ నికర లాభం 17% వృద్ధి చెంది రూ.239 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.204 కోట్లుగా ఉంది. ఈ కాలంలో మొత్తం ఆదాయం కూడా రూ.659 కోట్ల నుంచి 785 కోట్లకు పెరిగింది.
- జాగిల్ ప్రీపెయిడ్ ఓషన్ సర్వీసెస్ డిసెంబరు త్రైమాసికంలో రూ.336.89 కోట్ల రెవెన్యూపై రూ.19.75 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 29.76% వృద్ధి చెందగా ఆదాయం 68.86% పెరిగింది.
- లగ్జరీ వాచీ సంస్థ రాడో.. మార్కెట్లోకి రాడో డయాస్టార్ ఒరిజినల్ ఎక్స్ తేజ్ చౌహాన్ వాచీని తీసుకువచ్చింది. బ్రిటిష్ ఇండస్ట్రియల్ డిజైనర్ తేజ్ చౌహాన్ సృజనాత్మకకు అనుగుణంగా ఈ గడియారాన్ని డిజైన్ చేసింది.

రివర్సల్‌కు అవకాశం

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మెరుగ్గా ట్రేడ్ కావచ్చు. అంతర్జాతీయంగా నెలకొన్ని అనిశ్చిత పరిస్థితులు ముగుస్తున్నాయి. పరిస్థితులు కుదుటపడుతుండటంతో మార్కెట్లో పాజిటివ్ సెంటిమెంట్ పెరుగుతోంది. పైగా ఫండమెంటల్స్ బాగున్న షేర్లు ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తున్నాయి. ప్రస్తుతం బెంచ్‌మార్క్ సూచీలన్నీ టర్న్ అరౌండ్ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఫైనాన్స్, బ్యాంకింగ్, ఆటో, వినియోగ రంగాల షేర్లు పటిష్ఠంగా ట్రేడవుతున్నాయి. మీడియా, రియల్టీ రంగాలు మెరుగవుతున్నాయి.

స్టాక్ రికమండేషన్స్

టాటా స్టీల్: జీవితకాల గరిష్ఠం నుంచి 30 శాతం మేర దిద్దుబాటుకు గురైన ఈ షేరు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్లో ఉంది. తాజా త్రైమాసిక ఫలితాల తర్వాత మూమెంటమ్ మొదలైంది. చక్కటి రిలేటివ్ స్ట్రెంత్ ప్రదర్శిస్తోంది. గత శుక్రవారం 4.35 శాతం లాభంతో రూ.138 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.135 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.165 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.130 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హిందాల్కో: గత ఏడాది నవంబరు నాటి గరిష్ఠం నుంచి 30 శాతం మేరకు దిద్దుబాటుకు లోనైన ఈ షేరు ప్రస్తుతం బలం ప్రదర్శిస్తోంది. కీలకమైన రూ.560 స్థాయిలో రెండు సార్లు మద్దతు లభించింది. మెటల్ రంగం మెరుగ్గా రాణిస్తుండటం, త్వరలో ఆర్థిక ఫలితాలు వెల్లడించే నేపథ్యంలో ఈ షేరుపై ఇన్వెస్టర్ల ఆసక్తి పెరిగింది గత శుక్రవారం రూ.607 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.600 శ్రేణిలో ఎంటరై రూ.674/710 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.570 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌పీఐసీ (స్పిక్) లిమిటెడ్: కొన్ని నెలలుగా డౌన్ ట్రెండ్‌లో కొనసాగిన ఈ షేరు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్‌లో ఉంది. రూ.70 స్థాయిలో సపోర్ట్ తీసుకున్న ఈ షేరు తక్షణ నిరోధ స్థాయి రూ.80ని బ్రేకౌట్ చేసింది. నిఫ్టీతో పోలిస్తే మూమెంటమ్ పెరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు రూ.82 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.80 శ్రేణిలో ప్రవేశించి రూ.96/100 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించాలి. అయితే రూ.77 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

చంబల్ ఫెర్టిలైజర్స్: గత ఏడాది జూన్ నుంచి ఈ షేరు సైడ్‌వేస్‌లో కన్సాలిడేషన్ అవుతూ వస్తోంది. తాజా త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో గతవారం ఈ షేరు మెరుగ్గా రాణించింది. కీలకమైన రూ.555 రెసిస్టెన్స్ జోన్‌కు చేరుకుంది. గత శుక్రవారం రూ.555 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.520/540 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.655 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.490 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కేఫిన్ టెక్నాలజీస్: జీవితకాల గరిష్ఠం తర్వాత 36 శాతం మేర దిద్దుబాటుకు గురైన ఈ షేరు ప్రస్తుతం ఆకర్షణీయమైన ధరలో లభిస్తోంది. డిసెంబరు త్రైమాసిక ఫలితాల తర్వాత మూమెంటమ్ పెరిగింది. చివరి నాలుగు సెషన్లలోనే 16 శాతం మేర ఎగిశాయి. గత శుక్రవారం రూ.1,224 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,200 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,550 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,155 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

అమర రాజా లాభంలో 11 శాతం వృద్ధి

అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసిక లాభంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.3,272.47 కోట్ల ఆదాయంపై రూ.298.37 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.267.89 కోట్లు)తో పోల్చితే లాభం 11 శాతం వృద్ధి చెందింది. కాగా డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి గాను రూ.9,786.25 కోట్ల ఆదాయంపై రూ.783.10 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన అమర రాజా ఎనర్జీ డిసెంబరు త్రైమాసికంలో రూ.3,164.02 కోట్ల ఆదాయంపై రూ.311.83 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది.

టెక్ వ్యూ — మరింత కన్సాలిడేషన్‌కే ఆస్కారం

నిఫ్టీ గత వారం గరిష్ఠ, కనిష్ఠ స్థాయిలకు మధ్యన ముగియడం అనిశ్చిత ధోరణికి సంకేతం. మార్కెట్ మరింత కన్సాలిడేట్ కావలసి ఉంది. అయితే ఇప్పటికీ ప్రధాన మద్దతు స్థాయి 23,000 కన్నా చాలా పైన ఉండడం వల్ల తక్షణ ముప్పు ఏదీ ఉండకపోవచ్చు. శుక్రవారం అమెరికన్ మార్కెట్లలో ఏర్పడిన రియాక్షన్ కారణంగా ఈ వారంలో నిఫ్టీ మరింత అప్రమత్త ట్రెండ్ ప్రదర్శించే ఆస్కారం ఉంది. మొత్తం మీద గత రెండు వారాల ర్యాలీ అనంతరం పుల్‌బ్యాక్ రియాక్షన్ ఏర్పడవచ్చు.



వి. సుందర్ రాజా

బుల్లిష్ స్థాయిలు: రియాక్షన్ ఏర్పడినా ట్రెండ్‌లో సానుకూలత కోసం రాబోయే కొద్ది రోజుల్లో 23,500 వద్ద బలంగా నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధ స్థాయిలు 23650, 23800. ఇక్కడ కూడా నిలదొక్కుకోగలిగితే తదుపరి టార్గెట్ 24,100.

బేరిష్ స్థాయిలు: ప్రస్తుత మద్దతు స్థాయి 23,300 వద్ద విఫలమైతే మైనర్ బలహీనతలో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 23,000.

బ్యాంక్ నిఫ్టీ: ఈ వారంలో ఈ సూచీ మానసిక అవధి 50,000 వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు. ప్రధాన నిరోధం 50,600. ఇక్కడ నిలదొక్కుకుంటే తదుపరి టార్గెట్ 51,000. దిగువన ప్రధాన మద్దతు స్థాయిలు 49,400, 48,800.

పాటర్న్: మార్కెట్ సానుకూలత కోసం 50 డీఎంఏ వద్ద నిలదొక్కుకోవాలి. ప్రస్తుతం నిఫ్టీ 23,650 వద్ద "దిగువకు అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద ఉంది. ఆ పైన నిలదొక్కుకున్నప్పుడే స్వల్పకాలిక సానుకూలత ప్రదర్శిస్తుంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం	23,650, 23,710
మద్దతు	22,450, 22,380

మరణిస్తూ.. మరో ఐదుగురికి ప్రాణదానం!



- రోడ్డుప్రమాదంలో గాయపడి బ్రెయిన్‌డెడ్‌కు గురైన యువ డాక్టర్ భూమికారెడ్డి
- అవయవాలు దానం చేసి కూతురు కోరిక తీర్చిన తల్లిదండ్రులు

రాయదుర్గం, కదిరి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తాను మరణిస్తూ.. మరో ఐదుగురికి ప్రాణం పోసిందా వైద్యురాలు..! ఒక్కగానొక్క కుమార్తె తమకు దక్కదన్న కొండంత దుఃఖాన్ని దిగమింగుకుని, అవయవాలను దానం చేసి బిడ్డ కోరిక తీర్చారు ఆమె తల్లిదండ్రులు.. శ్రీసత్యసాయి జిల్లా కదిరి నియోజకవర్గం తలుపులు మండల నంగివాండ్లపల్లికి చెందిన నంగి నందకుమార్ రెడ్డి, లోహితల కూతురు భూమికారెడ్డి (24).. ఇటీవలే వైద్య విద్య పూర్తిచేసి హైదరాబాద్ ఎల్బీ నగర్‌లోని కామినేని ఆస్పత్రిలో హౌస్ సర్జన్‌గా వైద్య సేవలు అందిస్తోంది. ఈ నెల 1వ తేదీన హైదరాబాద్‌లో భూమికారెడ్డి ప్రయాణిస్తున్న కారు.. డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. దీంతో ఆమె తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకోగా నానక్‌రామ్‌గూడలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందించారు. చివరికి వారం తర్వాత ఆమె బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు తేల్చారు. దీంతో గతంలో భూమికారెడ్డి అవయవ దానంపై చెప్పిన మాటలు గుర్తు తెచ్చుకున్న తల్లిదండ్రులు.. ఆమె అవయవాలు దానం చేసేందుకు ముందుకొచ్చారు. వైద్యులు భూమికారెడ్డి నుంచి గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలు సేకరించి అవసరమైన వారికి అవయమార్పిడి చేసి ప్రాణాలు కాపాడారు. భూమికారెడ్డి మృతదేహాన్ని అంత్యక్రియల కోసం ఆదివారం రాత్రి స్వగ్రామం నంగివాండ్లపల్లికి తరలించారు. భూమికారెడ్డి త్యాగం చిరస్మరణీయమని కాంటినెంటల్ ఆస్పత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి అన్నారు.

తలకు మించిన..

'కాలేజీల' భారం!



- వైద్య కళాశాలల కోసం కూడా జగన్ సర్కారు అప్పులే అప్పులు
- కాంట్రాక్టు సంస్థలకు 674 కోట్ల బాకీ

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త వైద్య కళాశాలల ఏర్పాటు విషయంలో వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులు సరిదిద్దడానికి.. చేసిన అప్పులు తీర్చడానికి కూటమి ప్రభుత్వం ప్రయాస పడుతోంది. రూ.8,480 కోట్ల అంచనాలతో 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి వైసీపీ ప్రభుత్వం అప్పట్లో శ్రీకారం చుట్టింది. దీనిలో రూ.4,948 కోట్లు రుణాలు తీసుకుంది. అయితే, వైసీపీ ప్రభుత్వం నిర్దేశించిన నిర్మాణ వ్యయంలో సుమారు 25% అంటే రూ.2125 కోట్ల విలువైన పనులు పూర్తి చేసింది. మూడేళ్ల వ్యవధిలో కనీసం 50 శాతం నిర్మాణ పనులు కూడా పూర్తి చేయకుండా కాలయాపన చేసింది. పైగా.. వైసీపీ ప్రభుత్వం దిగిపోయేనాటికి రూ.674 కోట్ల విలువైన పనులకు సంబంధించిన బకాయిలను కూటమి ప్రభుత్వంపై మోపింది. ఈ బకాయిలను కాంట్రాక్ట్ సంస్థలకు కూటమి ప్రభుత్వం విడతల వారీగా చెల్లిస్తోంది. ఈ క్రమంలో ఆదివారం రూ.285 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేసింది. కొన్నాళ్ల కిందట కూడా దాదాపు రూ.110 కోట్ల పెండింగ్ బకాయిలు విడుదల చేసింది. ఇదిలావుంటే, జగన్ ప్రభుత్వం చేసిన 25 శాతం పనుల విలువ దాదాపు రూ.2,125 కోట్లు ఉంటే దీనిలో రూ.1,451 కోట్లు మాత్రమే కాంట్రాక్ట్ సంస్థకు చెల్లించింది. దీంతో మిగిలిన సొమ్ము రూ.674 కోట్లను కూటమి ప్రభుత్వం కాంట్రాక్ట్ సంస్థకు చెల్లించాల్సి వచ్చింది. మరోవైపు 17 మెడికల్ కాలేజీల నిర్మాణాలు కొనసాగించాలంటే మరో రూ.3,532 కోట్లు కేటాయించాలి. ఇవి కాకుండా ఇప్పటికే వివిధ మార్గాల ద్వారా వైసీపీ ప్రభుత్వం తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించాలి. తిరిగి ఆ రుణాలను కూడా ప్రభుత్వం విడతల వారీగా చెల్లించాలి. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఉన్న ఆర్థిక పరిస్థితుల్లో కొత్త కాలేజీల నిర్మాణాలకు రూ.3532 కోట్ల నిధులు కేటాయించే పరిస్థితి లేదు. దీంతో 'సేఫ్ క్లోజర్' అనే విధానం ద్వారా దాదాపు 10 కాలేజీల నిర్మాణాన్ని నిలుపుదల చేసింది.

పూర్తికాని వైనం

జగన్ ప్రభుత్వం ఫేజ్-1 కింద విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్లు చేపట్టింది. ఎన్నికలకు ముందు హడావుడిగా ఫేజ్-2 కింద పాడేరు, మర్కాపురం, మదనపల్లి, పులివెందుల, ఆదోని కాలేజీల్లో అడ్మిషన్లు చేపట్టాలని ప్రయత్నాలు చేసింది. కానీ, భవన నిర్మాణాలు పూర్తి కాక, ఫ్యాకల్టీ, మౌలిక సదుపాయాలు కొరత వల్ల నేషనల్ మెడికల్ కౌన్సిల్ అడ్మిషన్లకు అనుమతి నిరాకరించింది. పాడేరు మెడికల్ కాలేజీని కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించడంతో ఆ కాలేజీలో మాత్రం 50 సీట్లలో అడ్మిషన్లకు అనుమతిచ్చింది. మిగిలిన ఏడు కాలేజీల్లో(పార్వతీపురం, నర్సీపట్నం, అమలాపురం, పాలకొల్లు, బాపట్ల, పెనుగొండ, పిడుగురాళ్ల) కనీసం పనులు కూడా ప్రారంభించలేదు. ఇలాంటి తరుణంలో అడ్మిషన్లు జరుగుతున్న 6 కాలేజీలు(విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల, పాడేరు) మినహా మిగిలిన 11 కాలేజీల నిర్వహణ సాధ్యం కాదన్న ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

వీజీఎఫ్ ఊసే లేదు!

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని మిగిలిన 10 మెడికల్ కాలేజీల కోసం రూ.వేల కోట్లు ఖర్చు చేసే పరిస్థితిలో ప్రభుత్వం లేదు. కాబట్టి వయబులిటీ గ్యాప్ ఫండ్స్(వీజీఎఫ్) కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీతో ప్రైవేటు సంస్థలకు ఈ కాలేజీలకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ, ఈ వీజీఎఫ్ ద్వారా కాలేజీల నిర్మాణం సాధ్యం అవుతుందా? ప్రైవేటు సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తాయా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. వీజీఎఫ్ కింద 40 శాతం కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తుంది. 35 శాతం రాష్ట్ర ప్రభుత్వం.. 25 శాతం ప్రైవేటు సంస్థ పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. ఇది కేవలం కాలేజీ నిర్మాణానికి, మౌలిక సదుపాయాల కల్పనకు మాత్రమే. ఇది కాకుండా కాలేజీ నిర్వహణ కోసం ఐదేళ్ల పాటు రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందించాలి. అది కూడా ప్రతి ఏటా దాదాపు రూ.100 కోట్ల వరకు ఖర్చవుతుంది. ఈ స్థాయిలో పెట్టుబడి పెట్టేందుకు ప్రైవేటు సంస్థలు ముందుకు వస్తాయా అంటే చెప్పలేని పరిస్థితి. కూటమి ప్రభుత్వం తొలుత వీజీఎఫ్ ద్వారా కాలేజీలు పూర్తి చేస్తామని చెప్పింది. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో అది సాధ్యం కాదని భావిస్తున్నారు.

నిపుణుల మాట ఇదీ..!

ఫేజ్-2లో చేపట్టిన కాలేజీలకు సంబంధించి 80 శాతం నిర్మాణ పనులు పూర్తి అయ్యాయి. వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలు కూడా అందుబాటులోకి వచ్చాయి. అయితే, ఫ్యాకల్టీ కొరతతో ఈ ఏడాది ఆయా కాలేజీల్లో అడ్మిషన్లు నిలిచిపోయాయి. అయితే, ఆయా కాలేజీలను పూర్తి చేసి వచ్చే ఏడాది అడ్మిషన్లు కల్పించడమే మంచిదని నిపుణులు చెబుతున్నారు. లేదంటే ఈ కాలేజీల కోసం ఖర్చు చేసిన రూ.1200 కోట్లు వృథా అవుతాయని అంటున్నారు. వంద సీట్లు కాకపోయినా కనీసం 50 సీట్లతో అయినా వాటిని ప్రారంభించాలని సూచిస్తున్నారు.

దక్షిణాది రాష్ట్రాలు ఏకం కావాలి

- కుటుంబ నియంత్రణ పాటిస్తే.. శిక్షిస్తారా?
- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పిలుపు

హైదరాబాద్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగపరమైన హక్కుల సాధనకు దక్షిణాది రాష్ట్రాలు ఏకం కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. జనాభా దామాషా పద్ధతిలో నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్రంలోని మోదీ సర్కారు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. జనాభా ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన జరిగితే.. దక్షిణాది రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలు తగ్గుతాయని.. బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ వంటి బీమారు రాష్ట్రాల్లో గెలిచే సీట్లతోనే కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చని, దక్షిణాది రాష్ట్రాలపై ఆధారపడాల్సిన అవసరమే పార్టీలకు ఉండదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం తిరువనంతపురంలో జరిగిన మాతృభూమి ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. మాతృభూమి ఎడిటర్, ఆహూతుల ప్రశ్నలకు తనదైన శైలిలో సమాధానాలిచ్చారు.

రూ.1.83 కోట్లు చెల్లించాలని... లారీ డ్రైవర్‌కు ఐటీ నోటీసు!

టెక్కలి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): లారీ డ్రైవర్‌గా పని చేసుకునే తనకు రూ.1.83 కోట్ల మేర చెల్లించాలంటూ ఐటీ శాఖ నుంచి నోటీసు వచ్చిందంటూ శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం బొప్పాయిపురం పంచాయతీ చల్లపేటకు చెందిన చల్లా నాగేశ్వరరావు అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనకు ఎకరా 30 సెంట్ల భూమి మాత్రమే ఉంది. ఇంతపెద్ద మొత్తంలో డబ్బులు కట్టాలని నోటీసు రావడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

దేశంలోనే తొలి కృత్రిమమేధ రోబోటిక్ గిడ్డంగి!

(మొదటి పేజీ తరువాయి)

దీనిని ప్రతిపాదించింది. దీన్ని అల్ట్రా మోడరన్ టెక్నాలజీతో డిజైన్ చేశారు. బందరు పోర్టును దృష్టిలో ఉంచుకుని, పోర్టును ఆనుకుని ఉన్న మునిసిపల్ స్థలంలో పైలట్ ప్రాజెక్ట్‌గా దీనిని నిర్మించనున్నారు. దేశంలోనే కృత్రిమ మేధతో మానవ రహిత సేవలు, అధునాతన సౌకర్యాలు, ఆధునిక సాంకేతికతతో నిర్మించే తొలి గిడ్డంగి ఇదే కానున్నది. సాధారణంగా 10వేల టన్నుల గిడ్డంగి నిర్మాణానికి రూ.15కోట్లు ఖర్చయితే.. ఈ గిడ్డంగి నిర్మాణానికి రూ.25 కోట్లు వ్యయం కానున్నది. హమాలీలతో పని లేకుండా.. ఆహార ధాన్యాల నిల్వ నష్టాలు, తూకంలో తేడాలు, దొంగతనాలు వంటివి జరగకుండా పౌరసరఫరాలు, ఎఫ్‌సీఐ, నాఫెడ్ సంస్థల కోసం దీనిని నిర్మించనున్నారు. ప్రస్తుత గిడ్డంగులకు చెల్లిస్తున్న అద్దె కన్నా 25% తక్కువ వ్యయంతో ఉత్పత్తులను ఇందులో నిల్వ చేసుకునే వెసులుబాటు ఉంటుందని అధికారులు చెప్తున్నారు. సాంప్రదాయ గిడ్డంగుల్లో చదరపు మీటరు స్థలంలో 1.5 టన్నుల సరుకు నిల్వ చేస్తే.. ఈ గిడ్డంగిలో చదరపు మీటరులో 5 టన్నులు నిల్వ చేయవచ్చు. నిధులు మంజూరైతే త్వరలో నిర్మాణాన్ని చేపట్టనున్నారు.



కుడి కాలువ ఎగ్జిట్ చానల్ బండ్-1 పనులు

శరవేగంగా జంటగుహల విస్తరణ పనులు

ఏలూరు ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో ప్రధానమైన కుడి కాలువ కనెక్టివిటీ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రాజెక్టు రిజర్వాయర్ నుంచి కుడి కాల్వకు నీటిని పంపిణీ చేయడానికి కుడి కాల్వ జంటగుహల విస్తరణ పనులను జలవనరుల శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నారు. ఇప్పటికే తోటగొంది మామిడిగొంది, మామిడిగొంది దేవరగొంది జంటగుహలలో డీవాటరింగ్ పనులు పూర్తిచేశారు. తోటగొంది మామిడిగొంది జంటగుహలలో కుడివైపు గుహ విస్తరణ పనులు త్వరితగతిన జరుగుతున్నాయి. ప్రాజెక్టు ఎగ్జిట్ చానల్ హెడ్ రెగ్యులేటర్ వద్ద 0.2 టీఎంసీల నీటి నిల్వ చేయనున్న రిజర్వాయర్ బండ్ పనులు పూర్తి చేశారు. బండ్-2 పనులు పూర్తిచేసి దాని పటిష్టతకు రాళ్ల వేసి కాంక్రీటు పనులు పూర్తి చేశారు. బండ్-1 పనుల ప్రాంతంలో కంకరు రాళ్ల వేసి బండ్‌కి రక్షణ చర్యలు చేపడుతున్నారు. పనులు వేగంగా జరిగేందుకు ఆయా ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి రేయింబవళ్లు శ్రమిస్తున్నట్టు ఈఈ బాలకృష్ణ తెలిపారు.

'దండమూడి'కి శత మృదంగ వాయిద్య నివాళి



సత్కారం అందుకున్న కళాకారులతో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ప్రముఖ వీణ విద్వాంసుడు శ్యామసుందర్ తదితరులు

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ప్రముఖ మృదంగ విద్వాంసుడు దండమూడి రామమోహనరావు 95వ జయంతిని పురస్కరించుకుని కళాకారులు 'శత మృదంగ వాయిద్య' నివాళులర్పించారు. గాన విద్వాంసుల అత్యద్భుతమైన లయ విన్యాసం చేశారు. మృదంగ వాయిద్యంలో లయ సౌందర్యాన్ని ప్రదర్శిస్తూ, ప్రతీ నాదస్వరూపం సంగీత ప్రియులకు వినసొంపుగా అంకితమైంది. స్థానిక సత్యనారాయణపురం ప్రభుత్వ సంగీత కళాశాలలో ఆదివారం రాత్రి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వీణ విద్వాంసుడు అయ్యగారి శ్యామసుందర్, అయ్యగారి జయలక్ష్మి, దండమూడి సుమతీ పాల్గొన్నారు. కార్యక్రమానికి హరగోపాల్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

రైతుబజార్లలో సబ్జీ కూలర్లు!

- పండ్లు, కూరగాయలు పాడవకుండా నిల్వ.. గుంటూరులో పైలట్

అమరావతి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రైతుబజార్లలో సబ్జీ కూలర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పండ్లు, కూరగాయలు, పూలు నిల్వ చేయడంతో పాటు వాటి సహజ పక్వానికి ఈ కూలర్లు ఉపయోగపడతాయి. పండ్లు, కూరగాయల్లో పోషక విలువలు కూడా సంరక్షింపబడతాయి. త్వరగా పాడైపోయే టమాటా, దోస, క్యాప్సికం వంటి కూరగాయలతో పాటు ఆకుకూరలు 3-5రోజులు ఈ కూలర్లలో నిల్వ చేయవచ్చు. వెంటనే పాడవ్వని క్యారెట్, బీట్రూట్, ముల్లంగి వంటివి వారం పాటు నిల్వ చేయవచ్చు. ఒక్కొక్కటి రూ.27లక్షల విలువైన సబ్జీ కూలర్లలో 50% ఉద్యానశాఖ సబ్సిడీ ఇవ్వనుంది. 50% రైతుబజార్లలో స్టాల్స్ నిర్వాహకులైన స్వయం సహాయక బృందాల సభ్యులు, రైతు ఉత్పత్తిదారు బృందాలు, రైతు సహకార సంఘాలు భరించాల్సి ఉంటుంది. ముంబై ఐఐటీ నిపుణులు అభివృద్ధి చేసిన సబ్జీ కూలర్లలో మహారాష్ట్రలోని రుకార్ట్ టెక్నాలజీ సంస్థ 100, 50, 25కిలోల సామర్థ్యం గల కూలర్లను సరఫరా చేస్తోంది. పైలట్‌గా గుంటూరు చుట్టగుంట రైతుబజార్‌లో 100కిలోల సామర్థ్యం గల సబ్జీ కూలర్‌ను ఏర్పాటు చేశారు. అలాగే చిత్తూరు, తిరుపతి జిల్లా రైతు బజార్లలో ప్రత్యేక కార్యక్రమం కింద 13 కూలర్లు ఇస్తుండగా, విజయవాడ 3, విశాఖ 2, తిరుపతి, రాజమండ్రి, గుంటూరు రైతుబజార్లలో ఒక్కొక్కటి ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలోని అన్ని రైతుబజార్లలో త్వరలో వీటిని ఏర్పాటు చేయనున్నారు.

'కల్లుగీత' మద్యం షాపులకు నేడు లాటరీ

- ఎన్నికల కోడ్ నేపథ్యంలో 15 జిల్లాల్లో వాయిదా

కల్లు గీత కులాలకు కేటాయించిన మద్యం షాపుల లాటరీ ఎన్నికల కోడ్ కారణంగా 15 జిల్లాల్లో వాయిదా పడింది. ఈ జిల్లాల్లో 202 షాపులు ఉన్నాయి. ఎన్నికల కోడ్ అమలులో లేని పది జిల్లాల్లో యథావిధిగా సోమవారం లాటరీ ద్వారా కేటాయింపులు జరుపనున్నారు. ఇక్కడి 137 షాపులకు లాటరీ నిర్వహించి లైసెన్స్‌లు జారీచేయనున్నారు. షెడ్యూలు ప్రకారం 25 జిల్లాల్లోని 339 షాపులకు సోమవారమే లాటరీ ద్వారా కేటాయింపులు జరగాలి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గీత కులాలకు షాపులు లేవు.

చిలుకూరు అర్చకుడిపై దాడి

మొయినాబాద్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానార్చకుడు సీఎస్ రంగరాజన్‌పై 'రామరాజ్యం' అనే సంస్థ ప్రతినిధులు దాడికి పాల్పడ్డారు. అంతేకాకుండా.. రామరాజ్య స్థాపనకు కృషి చేయడం లేదంటూ దూషించారు. ఈ ఘటనపై ఆలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ ఎంవీ సౌందర్‌రాజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. చిలుకూరు బాలాజీ ఆలయానికి వంశపారంపర్యంగా అర్చకుడిగా రంగరాజన్ వ్యవహరిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వీర రాఘవరెడ్డి అనే వ్యక్తి 20 మంది రామరాజ్యం సభ్యులతో కలిసి చిలుకూరుకు వచ్చారు. నేరుగా బాలాజీ ఆలయ ప్రాంగణంలోని రంగరాజన్ ఇంటికి వెళ్లారు. "రామరాజ్య స్థాపనకు సహకరించాలి. ఉగాదిలోగా నేను ఏర్పాటు చేయాలనుకుంటున్న రామరాజ్య సైన్యానికి ఆర్థిక సాయం చేయాలి. చిలుకూరు ఆలయాన్ని నాకు అప్పగించాలి" అంటూ రంగరాజన్‌ను బెదిరించారు. లేని పక్షంలో అంతుచూస్తానంటూ హెచ్చరిస్తూ ఆయనపై చేయిచేసుకున్నారు.

ధార్ గ్యాంగ్ అరెస్టు

- పోలీసుల అదుపులో ముగ్గురు.. పరారీలో ఇద్దరు
- 59 తులాల బంగారు ఆభరణాలు, 19.35 లక్షల నగదు స్వాధీనం

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వరుస దోపిడీలతో కలకలం సృష్టిస్తున్న ధార్ గ్యాంగ్‌ను అనంతపురం పోలీసులు అరెస్టు చేశారు. అనంతపురం నగర శివారులోని విల్లాల్లో ఈ ముఠా గతనెలలో రూ.2.13 కోట్లకుపైగా విలువైన బంగారు ఆభరణాలు, వజ్రాలను చోరీ చేసింది. దీంతో జిల్లా ఎస్పీ జగదీశ్ నేతృత్వంలో నాలుగు పోలీసు బృందాలు రంగంలోకి దిగి కేసును ఛేదించారు. ఆదివారం అనంతపురంలోని పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను ఎస్పీ వెల్లడించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం ధార్ జిల్లా టాండ పోలీసు స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన నారూ పచావర్, సావన్, మహబత్, మోట్ల గతనెల 21న రాత్రి అనంతపురంలో వెంకట శివారెడ్డి, రంజిత్‌రెడ్డి, శివశంకర్ నాయుడుకు చెందిన విల్లాల్లో చోరీ చేశారు. చోరీ సొమ్మును వాటాలేసి పంచుకున్నారు. పచావర్, సావన్ హైదరాబాద్, బెంగళూరులో సొత్తును విక్రయించే ప్రయత్నం చేసినా కుదరకపోవడంతో మధ్యప్రదేశ్‌కు చెందిన రమేశ్‌ను సంప్రదించారు. దీంతో అతను తన కుమారుడు సునీల్‌ను పంపాడు. చోరీ సమయంలో మొబైల్ ఫోన్ లోకేషన్, ఫింగర్ ప్రింట్స్ ఆధారంగా పోలీసులు... అనంతపురం రాయల్‌నగర్‌లో ఉన్న పచావర్, సావన్, సునీల్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి 59 తులాల బంగారు ఆభరణాలు, రూ.19.35 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. చోరీ సొత్తులో తమ వాటాలతో స్వగ్రామానికి వెళ్లిపోయిన మహబత్, మోట్లను కూడా త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు. కాగా, ధార్ ముఠాలోని పచావర్, మహబత్ స్వయానా అన్నదమ్ములు. వారి మరో ముగ్గురు సోదరులు ప్రస్తుతం హైదరాబాద్ జైలులో ఉన్నారు. పచావర్‌పై ఏపీ, తెలంగాణ, తమిళనాడు, గుజరాత్‌ల్లో 32, మహబత్‌పై 29కి పైగా కేసులు ఉన్నాయి. సావన్, మోట్ల కూడా పాత నేరస్తులే. సునీల్‌పై 9, అతడి తండ్రి రమేశ్‌పై ఏపీ, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, గుజరాత్‌ల్లో 32 చొప్పున కేసులు నమోదయ్యాయి. నాలుగు రాష్ట్రాల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న ఈ గ్యాంగ్‌లో 60 మంది వరకూ సభ్యులున్నారు. వీరంతా ధార్ జిల్లా పరిధిలో గ్రామాలకు చెందినవారు.

చోరీ అయిన సెల్‌ఫోన్లు సేఫ్

- నేడు బిహార్ కోర్టుకు ఫోన్ల దొంగలు
- ట్రాన్సిట్ వారెంట్‌పై విజయవాడకు

విజయవాడ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఇన్‌గ్రామ్ ఇండియా మొబైల్ ప్రైవేటు లిమిటెడ్ గోడౌన్ నుంచి మాయమైన యాపిల్ ఫోన్లు, ట్యాబ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అన్నీ సేఫ్‌గా ఉన్నాయి. ఈ నెల 5న అర్ధరాత్రి గోడౌన్ షట్టర్‌ను కత్తిరించిన యూపీకి చెందిన దొంగలు రూ.2.52 కోట్ల పరికరాలను దొంగిలించారు. ఈ చోరీతో సంబంధం ఉన్న ఆరుగురు నిందితులను బిహార్ సరిహద్దుల వద్ద పోలీసులు పట్టుకున్నారు. విజయవాడ నుంచి వెళ్లిన రెండు ప్రత్యేక బృందాలు వారిని విచారిస్తున్నాయి. నిందితులను సోమవారం బిహార్ కోర్టులో హాజరుపరచనున్నారు. అనంతరం ట్రాన్సిట్ వారెంట్‌పై మంగళ, బుధవారాల్లో వారిని విజయవాడకు తీసుకువచ్చే అవకాశం ఉంది.

దొంగలు బాబోయ్.. దొంగలు!

రాష్ట్రంలో ఉత్తరాది ముఠాల హల్‌చల్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో దొంగలు పడ్డారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ నుంచి వచ్చి మరీ ఇక్కడ ఇళ్లలో దూరి బంగారం, నగదు దోచుకెళ్లిపోతున్నారు.. ధార్, బచాడే, భూరియా, చంబా, పార్ధి గ్యాంగ్‌లు వరుస దొంగతనాలతో పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఏలూరు, పల్నాడు, అనంతపురం, తిరుపతి.. ఇలా మూడు వారాల్లో నాలుగు భారీ దొంగతనాలు జరిగాయి. దొంగల కోసం యూపీ, రాజస్థాన్ వరకూ వెళ్లి గాలించిన ఏలూరు పోలీసులు రెండు వారాల పాటు అష్టకష్టాలు పడి బంగారం, వెండి రికవరీ చేశారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించిన అనంతపురం పోలీసులు దేశంలోనే పేరు మోసిన ధార్ (మధ్యప్రదేశ్) గ్యాంగ్ గుట్టు రట్టు చేశారు. పెద్దమొత్తంలో బంగారు, వజ్రాల ఆభరణాలు, లక్షలాది రూపాయల నగదు రికవరీ చేశారు. ఇదే బాటలో పల్నాడు, తిరుపతి పోలీసులు కూడా ఉత్తరాది రాష్ట్రాల్లో దొంగల కోసం గాలింపు చేపట్టినట్లు తెలుస్తోంది.

ఏలూరులో పండుగ వేళ భారీ దోపిడీ

సంక్రాంతి పండుగ సమయంలో ఏలూరులోని ఒక బంగారం దుకాణం నుంచి భారీగా నగలు, వెండి వస్తువులు దోచుకుని నలుగురు దొంగల గ్యాంగ్ పరారైంది. పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా వారంతా విజయవాడలో రైలెక్కినట్లు గుర్తించారు. వారికోసం నాలుగు ప్రత్యేక బృందాలు యూపీకి, అక్కడినుంచి రాజస్థాన్‌కు వెళ్లి గాలింపు చేపట్టారు. కుల్దీప్ శర్మ, మనోజ్ కుమార్‌ను యూపీలో, మహేందర్‌సింగ్, రాజేశ్ కుష్వాను రాజస్థాన్‌లో అదుపులోకి తీసుకొని ఏలూరు తీసుకొచ్చారు. మొత్తం రూ.73లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు రికవరీచేసి, నిందితులను జైలుకు పంపారు.



రికవరీ చేసిన నగలతో ఏలూరు జిల్లా పోలీసులు

పల్నాడులో మూడుచోట్ల చోరీలు

పల్నాడు జిల్లాలోని మూడు ప్రాంతాల్లో సంక్రాంతి వేళ దొంగలు చోరీలకు పాల్పడ్డారు. రాజస్థాన్ నుంచి వచ్చిన వీరు ముందుగా విజయవాడ, గుంటూరులో బైకులు దొంగతనం చేశారు. వాటిపై పల్నాడు వెళ్లి అక్కడ ఇళ్లు దోచేశారు. అనంతరం అవే వాహనాలపై మరో ప్రాంతానికి చేరుకుని అక్కడి నుంచి రైలెక్కి పారిపోయారు. వీరి కోసం ఇప్పుడు పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

అనంతలో ధార్ గ్యాంగ్ కలకలం

అనంతపురం శ్రీనగర్ కాలనీలోని మూడు విల్లాల్లోకి చొరబడిన ధార్ గ్యాంగ్ గత నెలలో పెద్దమొత్తంలో నగదు, భారీగా బంగారం, వజ్రాభరణాలు అపహరించారు. దొంగల వేలిముద్రలు సేకరించిన అనంతపురం పోలీసులు మధ్యప్రదేశ్‌కు వెళ్లి మారుమూల గ్రామాల్లో జల్లెడ పట్టి మరీ ఈ గ్యాంగ్‌లో కీలకమైన ముగ్గురిని ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ముఠా నాయకుడు నారూ పచావర్‌తో పాటు సభ్యులు సావన్, సునీల్‌ను జైలుకు తరలించారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

తిరుచానూరులో భారీగా బంగారం దోపిడీ

ఈ నెల మొదటివారంలో తిరుచానూరులోని సీవీఆర్ విల్లాల్లోకి దొంగలు చొరబడ్డారు. ముందుగా విల్లా నం.81లో కిలో బంగారం దోచుకెళ్లారు. తర్వాత పొరుగునే ఉన్న జగదీశ్ ఇంట్లోకి దూరి 480 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు దొంగల కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. అలాగే విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని గోడౌన్ నుంచి రూ.2.52 కోట్ల విలువైన యాపిల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను దొంగిలించిన యూపీకి చెందిన ఆరుగురు నిందితులను బిహార్ సరిహద్దుల వద్ద పోలీసులు పట్టుకున్నారు.

కార్డెన్ సెర్చ్ తప్పనిసరి

రాష్ట్రంలో వరుస దొంగతనాలపై పోలీస్ బాస్ హరీశ్ కుమార్ గుప్తా దృష్టి సారించారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠాలు నేరం చేసే ముందు రెక్కీ నిర్వహిస్తున్నాయని, ముఖ్యంగా జాతీయ రహదారుల పక్కన, ఖరీదైన విల్లాల్లో చోరీలకు పాల్పడుతున్నారని గుర్తించారు. ఇకపై ఇటువంటి ఘటనలు జరగకుండా కార్డెన్ సెర్చ్ తప్పనిసరి చేయాలని జిల్లా ఎస్పీలకు సూచించినట్లు తెలిసింది.

మహిళా టీచర్లను అవమానించినా అక్కడే!

- సస్పెండ్ చేసిన రెండు రోజులకే మళ్లీ అదే స్థానంలో పోస్టింగ్
- పాఠశాల విద్య తీరుపై టీచర్ల అసహనం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మహిళా టీచర్లను అవమానించిన డైట్ కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌కు తిరిగి అక్కడే పోస్టింగ్ ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది. పాఠశాల విద్యాశాఖ అధికారుల నిర్ణయంపై టీచర్లలో అసహనం వ్యక్తమవుతోంది. ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్)పై ప్రాథమిక పాఠశాలల టీచర్లకు ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా డైట్ కాలేజీల ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రకాశం జిల్లా టీచర్లకు ఒంగోలులో శిక్షణ తరగతులు నిర్వహించారు. మైనంపాడు డైట్ కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సోమా సుబ్బారావు ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. మహిళా, పురుష టీచర్లను వేర్వేరు వరుసల్లో కూర్చోబెట్టి ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. శిక్షణ తరగతులు ప్రారంభమైన ఈనెల 3న సాయంత్రం కోఆర్డినేటర్ సుబ్బారావు ప్రతి లైనులోనూ మహిళా, పురుష టీచర్లను పక్కపక్కనే కూర్చోబెట్టారు. దీనిపై టీచర్లు అసహనం వ్యక్తంచేశారు. ఇదేం విధానం అని ఓ మహిళా టీచర్ నిలదీయడంతో ఆగ్రహించిన కోఆర్డినేటర్ ఆమెకు ఇరువైపులా పురుష టీచర్లను కూర్చోబెట్టి అవమానించారు. ఇది బయటకి పొక్కడంతో ఉన్నతాధికారులు ఆ మరుసటి రోజే ఆర్జేడీతో విచారణ జరిపించారు. శిక్షణ కేంద్రంలో ఉన్న 150 మంది టీచర్లను ఆర్జేడీ విచారించి.. కోఆర్డినేటర్ తప్పుగా వ్యవహరించినట్లు నిర్ధారించి, వెంటనే సస్పెండ్ చేశారు. అయితే అనూహ్యంగా రెండు రోజుల తర్వాత సోమా సుబ్బారావుకు తిరిగి మైనంపాడు డైట్ కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా పోస్టింగ్ ఇచ్చారు. పైగా ఆయనను ప్రశ్నించిన మహిళా టీచర్‌దే తప్పు అనే కోణంలో ప్రచారం మొదలుపెట్టారు. సుబ్బారావు తప్పు చేసినట్లు విచారణలో టీచర్లు స్పష్టంగా చెప్పిన తర్వాతే సస్పెండ్ చేయగా, రెండు రోజుల్లో ఏం మారిందని ఆయన్ను తిరిగి అదే స్థానంలో నియమించారని టీచర్లు ప్రశ్నిస్తున్నారు. విశాఖపట్నంకు చెందిన టీడీపీ ముఖ్య నేత అండతో సుబ్బారావును కాపాడినట్లు ప్రచారం జరుగుతోంది. గతంలోనూ శిక్షణ కార్యక్రమాల్లో మహిళా, పురుష టీచర్లను పక్కపక్కనే కూర్చోబెట్టి అసౌకర్యానికి గురిచేశారన్న ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. ఆయన సస్పెన్షన్‌తో జిల్లాలోని టీచర్లంతా ఊపిరి పీల్చుకోగా, తిరిగి అక్కడే పోస్టింగ్ ఇవ్వడంపై అందరూ విస్మయం వ్యక్తంచేస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.